

నేర సామ్రాజ్యం

గుట్టు రట్టు!

3 రోజులపాటు అరుణను విచారించిన పోలీసులు

ఎన్నో విషయాలు చెప్పిన కి'లేడీ'

రాజకీయ, పోలీసు వర్గాల్లో కి'లేడీ' నడిగుంట అరుణ ప్రకంపనలు సృష్టిస్తోంది. పలు నేరాల్లో పోలీసు అధికారులే సహకరించారనే గుట్టు రట్టు కావడంతో సంబంధిత ఆ శాఖలో కలకలం మొదలైంది. మూడు రోజులపాటు అరుణను కస్టడీలోకి తీసుకున్న పోలీసులు పలు అంశాలపై క్షుణ్ణంగా విచారించినట్లు తెలిసింది. తాను ఏ ఏ నేరాలకు పాల్పడింది... ఎవరెవరు సహకరించారు? ఎవరెవరికి ఎంతెంత ఇచ్చింది? ఇలా అనేక అంశాలను పూసగుచ్చినట్లు విచారణాధికారులకు తెలిసినట్లు సమాచారం. అలాగే కొంతమంది పేర్లు కూడా చెప్పగా, ఆ వివరాలను అధికారులు గోప్యంగ ఉంచారు. కోర్టు కేటాయించిన కస్టడీ సమయం ముగియడంతో బుధవారం అరుణను నెల్లూరులోని ఇన్చార్జి మేజిస్ట్రేట్ కోర్టులో హాజరుపరిచిన అనంతరం జిల్లా జైలుకు తరలించారు.



కోవూరు పోలీస్ స్టేషన్ నుంచి వెలుపలకు వస్తున్న నిడిగుంట అరుణ

కోవూరు, సెప్టెంబరు 24 (ఆంధ్రజ్యోతి) : పలుకేసుల్లో నిందితురాలైన అరుణ నెల్లూరు జిల్లా జైలులో రిమాండులో ఉండగా పోలీసులు సోమవారం కస్టడీకి తీసుకుని విచారించారు. నెల్లూరు రూరల్ డీఎస్పీ జీ శ్రీనివాసరావు పర్యవేక్షణలో కోవూరు పోలీస్‌స్టేషనులో సీఐ సుధాకరరెడ్డి, ఎస్‌బీఐ సీఐ నాగేశ్వరమ్మలు అరుణను ప్రశ్నించగా తన నేరాల చిట్టా విప్పినట్లు తెలిసింది. రౌడీషీటర్ల మధ్య నెలకొన్న వివాదాల గురించి కూడా కొంత సమాచారం అందించారని తెలిసింది. విచారణలో వెలుగు చూసిన అంశాలను అధికారులు ఎస్పీ అజిత వేజెండ్ల దృష్టికి తీసుకు వెళ్ళినట్లు విశ్వసనీయ సమాచారం. గత వైసీపీ ప్రభుత్వంలో పలు కేసుల్లో బాధితులు ఫిర్యాదు చేసినా పట్టించుకోని పోలీసు అధికారుల వివరాల గురించి అరుణ తేటతెల్లం చేశారు. ప్రస్తుత ప్రభుత్వంలోనూ రౌడీషీటరు శ్రీకాంత్‌కు, తనకు సహకరించిన పోలీసుల పేర్లను కూడా చెప్పినట్లు తెలిసింది. అలాగే పలు నేరాలతో సంబంధం ఉన్న రాజకీయ నాయకులు, ప్రజాప్రతినిధులు, రౌడీషీటర్ల వివరాలను కూడా ఆమె వివరించినట్లు తెలిసింది. దీనిప్రకారం ఎస్పీ అజిత దృష్టి సారించనున్నారనే సమాచారంతో పోలీసు వర్గాల్లో కలకలం రేగుతోంది.

జాబితాలో పోలీస్ అధికారులు, రాజకీయ నేతలు, ప్రజాప్రతినిధుల పేర్లు

'రివాల్వర్' కేసులో త్వరలో కస్టడీ కోరే అవకాశం

రాష్ట్ర పోలీస్ బాస్ నుంచి ఎప్పటికప్పుడు జిల్లా ఉన్నతాధికారులకు దిశానిర్దేశం

● రాష్ట్ర యంత్రాంగం అప్రమత్తం

తాను సాగించిన నేరాలకు పలువురు పోలీసు అధికారులు సహకరించారని కి'లేడీ' అరుణ విచారణలో చెప్పడంతో రాష్ట్ర పోలీసు యంత్రాంగం అప్రమత్తమైనట్లు తెలిసింది. ఈ విషయమై తీసుకోవాల్సిన చర్యల గురించి రాష్ట్ర పోలీసు బాస్ నుంచి జిల్లా అధికారులకు ఆదేశాలు అందినట్లు భావిస్తున్నారు. జిల్లాలో రౌడీషీటర్లపై ఉక్కుపాదం మోపాలనే రాష్ట్ర ప్రభుత్వ నిర్ణయానికి అనుగుణంగా అడుగులు పడుతుండటంతో నేరాలకు సహకరించిన అధికారులు, ప్రముఖులు, రాజకీయ నాయకులు తీవ్ర మానసిక ఒత్తిడికి గురవుతున్నట్లు సమాచారం.

● నేర సామ్రాజ్యంపై విచారణ

కోవూరు నాగులకట్టకాలనీకి చెందిన 21 మంది గిరిజన మహిళల నుంచి ఇళ్ల పట్టాల పేరుతో అరుణ నగదు వసూలు చేయడమే కాకుండా రౌడీషీటర్ల నేర సామ్రాజ్యం గురించి కూడా విచారణాధికారులు వివరాలు రాబట్టారు. నెల్లూరులోని పలు కేసులు, హిజ్రా హాసిని హత్యకేసుపై కూడా సమాచారాన్ని రాబట్టారు. హత్య అనంతరం ఎవరెవరికి ఎంతెంత నగదు ఇచ్చారో ఆ వివరాలు కూడా చెప్పినట్లు సమాచారం. కాగా, పోలీసు కస్టడీ బుధవారం మధ్యాహ్నం ముగియడంతో వైద్యుల పరీక్షల అనంతరం ఆమెను జిల్లాజైలుకు అప్పగించారు. కాగా, నగరంలో రివాల్వరుతో బెదిరించిన కేసును విచారించేందుకు త్వరలోనే నెల్లూరు పోలీసులు కస్టడీ విచారణను కోరనున్నట్లు సమాచారం.

స్పెషల్ కెపాసిటీ బిల్డింగ్ కోర్సుకు దరఖాస్తుల ఆహ్వానం

నెల్లూరు(విద్య) : భారత క్రీడా ప్రాధికార సంస్థ ఆధ్వర్యంలో పాటియాలోని నేతాజీ సుభాష్ నేషనల్ ఇన్‌స్టిట్యూట్ ఆఫ్ స్పోర్ట్స్‌లో 2025-26 సంవత్సరానికి స్పెషల్ కెపాసిటీ బిల్డింగ్ కోర్స్ ప్రవేశాలకు దరఖాస్తులు ఆహ్వానిస్తున్నట్లు డీఎస్‌డీవో ఆర్‌కే యతిరాజ్ ఓ ప్రకటనలో పేర్కొన్నారు. ఒలంపిక్, ఏషియన్ చాంపియన్‌షిప్, కామన్‌వెల్త్ క్రీడల్లో పాల్గొన్న క్రీడాకారులతోపాటు జాతీయ గేమ్స్, వరల్డ్ మిలటరీ గేమ్స్, ఆలిండియా ఇంటర్ యూనివర్సిటీ, ఖేలో ఇండియా, జాతీయ స్థాయి క్రీడాపోటీల్లో పాల్గొన్న క్రీడాకారులందరూ ఈ కోర్సుకు అర్హులని తెలిపారు. స్పోర్ట్స్ కోచింగ్‌లో డిప్లమోతో సమానమైన ఈ కోర్సులో చేరేందుకు ఆసక్తి కలిగిన వారు www.nsnis.in వెబ్‌సైట్‌లో పొందుపరిచిన మార్గదర్శకాలకు అనుగుణంగా ఈనెల 25లోగా దరఖాస్తు చేసుకోవాలన్నారు. మరిన్ని వివరాలకు నెల్లూరు ఏసీ సుబ్బారెడ్డి స్టేడియంలోని డీఎస్‌ఏ కార్యాలయంలో సంప్రదించాలని కోరారు.



పెళ్లకూరును సత్కరిస్తున్న ఎమ్మెల్యే సోమిరెడ్డి చంద్రమోహన్‌రెడ్డి

రాష్ట్ర వేతనాల సలహా బోర్డు చైర్మన్‌గా

'పెళ్లకూరు' ప్రమాణం

నెల్లూరు (వైద్యం), సెప్టెంబరు 24 (ఆంధ్రజ్యోతి) : రాష్ట్ర వేతనాల సలహా బోర్డు చైర్మన్‌గా జిల్లాకు చెందిన పెళ్లకూరు శ్రీనివాసులురెడ్డి బుధవారం ప్రమాణ స్వీకారం చేశారు. విజయవాడలోని సీతారామపురం లేబర్ కమిషనర్ కార్యాలయంలో ఆయన ప్రమాణం చేశారు. వ్యాపా రులు, కార్మికులకు ఎలాంటి ఇబ్బందులు లేకుండా బాధ్యతగా వ్యవహరి స్తామని వెల్లడించారు. సర్వేపల్లి ఎమ్మెల్యే సోమిరెడ్డి చంద్రమోహన్ రెడ్డిసహా పలువురు నాయకులు పెళ్లకూరుకు శుభాకాంక్షలు తెలిపారు.

పంచాయతీల మార్పు,

చేర్పులుంటే పంపండి

నెల్లూరు (జడ్పీ), సెప్టెంబరు 24 (ఆంధ్రజ్యోతి) : గ్రామ పంచాయతీల మార్పులు, చేర్పులు ఉంటే ప్రతిపాదనలను పంపాలని జిల్లా పంచాయతీ అధికారి (డీపీఓ) శ్రీధర్‌రెడ్డి ఒక ప్రకటనలో తెలిపారు. పంచాయతీ సాధారణ ఎన్నికల పదవీ కాలం 2026, ఏప్రిల్ 2వ తేదీలో ముగియనుందని, అప్పటిలోగా ఎన్నికలు నిర్వహించేందుకు ఏర్పాట్లు చేసుకునేందుకు షెడ్యూలు జారీ అయినట్లు పేర్కొన్నారు. పంచాయతీల ఏర్పాటుకు అక్టోబరు 15వ తేదీలోగా ప్రతిపాదనలు పంపాలని కోరారు.



నెల్లూరు నగరంలోని మూలస్థానేశ్వరుడి ఆలయంలో విద్యార్థినుల నృత్యరూపకం

వేదమూతా నమోస్తుతే..!

నెల్లూరు (సాంస్కృతికం), సెప్టెంబరు 24 (ఆంధ్రజ్యోతి) : జిల్లాలోని ఆలయాల్లో దేవీ నవరాత్రి ఉత్సవాలు వైభవోపేతంగా జరుగుతున్నాయి. మూడో రోజు బుధవారం వివిధ రూపాల్లో అమ్మవారు భక్తులను కటాక్షిం చారు. విశేష అభిషేకాలు, సామూహిక కుంకుమ పూజలు, హోమాలు, శ్రీచక్ర నవావరణ పూజలు జరిగాయి. అమ్మణ్ణి నామస్మరణతో ఆలయాలు మారుమోగాయి. సాంస్కృతిక ప్రదర్శనలు ఆకట్టుకున్నాయి. నెల్లూరులోని రాజరాజేశ్వరి అమ్మవారు గాయత్రి దేవి అలంకరణలో దర్శనమిచ్చారు. కన్యకాపరమేశ్వరి బాలా త్రిపుర సుందరిగా, ఇరుకళల పరమేశ్వరి గజలక్ష్మిగా పూజలందుకున్నారు.



నెల్లూరు : గాయత్రీదేవిగా రాజరాజేశ్వరి

వెంకటాచలం సర్పంచి

చెక్ పవర్ రద్దు

వెంకటాచలం, సెప్టెంబరు 24 (ఆంధ్రజ్యోతి) : వెంకటాచలం సర్పంచి మందల రాజేశ్వరి చెక్ పవర్‌ను రద్దు చేస్తూ జిల్లా పంచాయతీ అధికారి ఎల్ శ్రీధర్‌రెడ్డి బుధవారం ఉత్తర్వులు జారీ చేశారు. పంచాయతీ నిధులు భారీగా దుర్వినియోగమైనట్లు టీడీపీ నేత సండి రమేష్ ఇచ్చిన ఫిర్యాదు మేరకు అధికారులు విచారించారు. సర్పంచి అధికారాన్ని అడ్డుపెట్టుకుని తన భర్త వైసీపీ జిల్లా ఉపాధ్యక్షుడు మందల వెంకటశేషయ్యను కాంట్రాక్టర్‌గా చూపించి భారీగా నిధుల దుర్వినియోగానికి పాల్పడ్డారని, నిబంధనలకు విరుద్ధంగా వెంకటశేషయ్య ఖాతాకు రూ.81,42,220, పంచాయతీ కార్యదర్శి శ్రీనివాసరావు కుమారుడు వంశీ వెంకట్, డేటా ఎంట్రీ ఆపరేటర్, వివిధ పంచాయతీ కార్యదర్శుల ఖాతాలకు మరో రూ.26,16,721 జమ చేశారు. దీనిపై వెంకటాచలం సర్పంచికు పలుమార్లు షోకాజు నోటీసులు జారీ చేసి సంజాయిషీ కోరగా వివరణ సరిగ్గా లేనందున పంచాయతీ నిధులు డ్రా చేసే అధికారాన్ని ఆరు నెలల వరకు తాత్కాలికంగా నిలుపుదల చేస్తూ డీపీఓ ఉత్తర్వులు జారీ చేశారు.

జీఎస్టీ 2.0 సంస్కరణ..

ఓ పొదుపు పండుగ

- అన్ని వర్గాలకు ఎంతో ప్రయోజనం
- పాత ధరల ప్రకారం అమ్మితే చర్యలు
- నేటి నుంచి అవగాహన కార్యక్రమాలు
- ప్రత్యేక బృందాల ద్వారా పరిశీలన : కలెక్టర్

నెల్లూరు (హరనాథపురం), సెప్టెంబరు 24 (ఆంధ్రజ్యోతి) : కేంద్ర ప్రభుత్వం తీసుకొచ్చిన జీఎస్టీ 2.0 సంస్కరణతో పేద, మధ్య తరగతి వర్గాలకు ఎంతో మేలు చేకూరుతుందని, ఇది ఒక పొదుపు పండుగ అని కలెక్టర్ హిమాన్షు శుక్లా అన్నారు. బుధవారం కలెక్టరేట్‌లోని శంకరన్ హాలులో వాణిజ్య పన్నుల శాఖ జాయింట్ కమిషనర్ కిరణ్‌కుమార్‌తో కలిసి ఆయన విలేకరులతో మాట్లాడారు. నిత్యావసరాలు, మందులు, వ్యవసాయ పరికరాలు, భవన నిర్మాణ సామాగ్రి, ఆటో మొబైల్ రంగాల్లోని ఉత్పత్తులపై భారీగా జీఎస్టీ తగ్గిందన్నారు. ప్రధానంగా సిమెంటు ధరపై జీఎస్టీ 28 నుంచి 18 శాతానికి తగ్గడంతో భవన నిర్మాణ రంగం బలోపేతమవుతుందని చెప్పారు. నిత్యావసర వస్తువులు పూర్తిగా ప్రజలకు అందుబాటు ధరల్లో లభ్యమవుతాయని వివరించారు. ఈ తగ్గింపు వల్ల చిరువ్యాపారాలు పెరుగుతారని, ఫలితంగా రానున్న కాలంలో అన్ని వర్గాల వారు జీఎస్టీ పరిధిలోకి వస్తారని, ఇప్పటి కన్నా ఎక్కువగా ప్రభుత్వానికి ఆదాయం వస్తుందని వివరించారు. రాష్ట్రంలోని ప్రజలకు జీఎస్టీ రేట్లు తగ్గడం వల్ల రూ.8 వేల కోట్ల మేర లబ్ధి చేకూరుతుందని తెలిపారు. ఇక వ్యాపారులు కూడా కొత్త జీఎస్టీ రేట్ల ప్రకారం వస్తువులు అమ్మాలని, పాత జీఎస్టీ ప్రకారం అమ్మితే చర్యలు తప్పవని హెచ్చరించారు.



విలేకరులతో మాట్లాడుతున్న కలెక్టర్ హిమాన్షు శుక్లా, జాయింట్ కమిషనర్ కిరణ్‌కుమార్

● నెలపాటు కార్యక్రమాలు

ప్రతి ఇంటికి జీఎస్టీ ఫలాలు చేరేలా నెల రోజులపాటు అవగాహనా కార్యక్రమాలు నిర్వహిస్తున్నట్లు కలెక్టర్ చెప్పారు. ఈ నెల 25 నుంచి 29వ తేదీ వరకు ఇంటింటికీ వెళ్లి జీఎస్టీ ఫలాల పేరుతో తగ్గిన నిత్యావసర వస్తువుల వివరాలను, కలుగుతున్న ప్రయోజనాలను వివరించనున్నట్లు తెలిపారు. 30 నుంచి అక్టోబరు 6వ తేదీ వరకు వ్యవసాయం దాని అనుబంధ రంగాల్లో కలిగే ప్రయోజనాలను వివరిస్తామని, అక్టోబరు 7 నుంచి 13 వరకు మానవవనరుల అభివృద్ధి, డిజిటల్ సాధికారతపై, 14 నుంచి 18వ తేదీ వరకు వికాస్ విశ్వాస్, నమ్మకమైన అభివృద్ధిపై అవగాహన కార్యక్రమాలు ఉంటాయని చెప్పారు.

● ప్రత్యేక బృందాలతో ఆరా

జిల్లాలో జీఎస్టీ అమలు తీరును ప్రత్యేక బృందాల ద్వారా పరిశీలించనున్నట్లు కలెక్టర్ తెలిపారు. వాణిజ్య సముదాయాల్లో నిబంధనలు పాటించకపోతే చర్యలు తీసుకొంటామని చెప్పారు. వాణిజ్య పన్నుల శాఖ జాయింట్ కమిషనర్ కిరణ్‌కుమార్ మాట్లాడుతూ జీఎస్టీ 2.0 వలన పన్నుల తగ్గింపుతోపాటు జీఎస్టీ రిజిస్ట్రేషన్, రీఫండ్ తదితర సేవలు చాలా సులభతరమైనట్లు చెప్పారు.

మెరుగైన విద్యుత్ సరఫరాకు ప్రాధాన్యమిస్తా

● నూతన ఎస్ఈ రాఘువేంద్రం



నెల్లూరు (జడ్పీ), సెప్టెంబరు 24 (ఆంధ్రజ్యోతి) : వినియోగదారులకు మెరుగైన విద్యుత్ సరఫరాకు అధిక ప్రాధాన్యత ఇస్తానని ఆ శాఖ నూతన ఎస్ఈ కొండూరు రాఘవేంద్రం అన్నారు. నగరంలోని విద్యుత్ భవన్‌లో బుధవారం ఆయన ఎస్ఈగా బాధ్యతలు స్వీకరించారు. శ్రీసత్యసాయి జిల్లాలో ఎగ్జిక్యూటివ్ ఇంజనీర్‌గా పని చేస్తూ పదోన్నతిపై నెల్లూరుకు వచ్చారు ఇక్కడున్న విజయన్ జనరల్ మేనేజర్ సోలార్ కార్పొరేట్ ఆఫీస్ కు (తిరుపతి) బదిలీపై వెళ్లారు. కాగా, జిల్లావాసి అయిన రాఘవేంద్రం గతంలో ఇక్కడే పని చేశారు. ఈ సందర్భంగా విద్యుత్ అధికారులు, సిబ్బంది, ట్రేడ్ యూనియన్, అసోసియేషన్ నేతలు ఎస్ఈని కలిసి శుభాకాంక్షలు తెలియజేశారు.

మర్రిపాడులో భూచోళ్లు!

- ప్రభుత్వ భూమి కనిపిస్తే కబ్జానే!
- వర్షాకాలం వస్తే మరింత ఎక్కువగా..
- అధికారులకు తెలిసినా పట్టించుకోని వైనం

భూ కబ్జాదారులు చెలరేగిపోతున్నారు. అధికారుల నిర్లక్ష్యం వారికి కలిసి వస్తుండటంతో ప్రభుత్వ భూములనే ఆక్రమిస్తున్నారు. ఏటా వర్షాలు ప్రారంభం కాగానే ప్రభుత్వ భూములను జల్లెడ పట్టి.. అందులో ఉన్న కంప చెట్లను తొలగించి, జామాయిల్ మొక్కలు నాటి స్వాధీన పరుచుకుంటున్నారు. మర్రిపాడు మండలంలో ఈ వ్యవహారం జోరుగా సాగుతోంది. అల్లంపాడు రెవెన్యూ పరిధిలోని 1081, 1082, 1083, 1165, 1167 సర్వే నెంబర్లలో సుమారు 40 ఎకరాల భూమిని కొంతమంది దుక్కిదున్నారు. ఇటీవల మరి కొంతభూమిలో కంప చెట్లను తొలగిస్తుండటంతో స్థానికుల ఫిర్యాదుతో రెవెన్యూ అధికారులు అక్కడికి వెళ్లి, ఎక్స్‌కవేటర్‌ను ఆపేసి అక్రమార్కులను మందలించి, పంపించేశారు. అయితే, మరుసటి రోజే అదే భూమిలో ఎక్స్‌కవేటర్ సహాయంతో చెట్లను తొలగించేందుకు రంగంలోకి దిగారు. దీంతో రెవెన్యూ అధికారులు వెళ్లి అక్కడ ఉన్న ఎక్స్‌కవేటర్‌ను, ట్రాక్టరును తహసీల్దారు కార్యాలయానికి తరలించారు. తహసీల్దారు అనిల్‌కుమార్ ఆక్రమణకు గురవుతున్న భూమిలో బోర్డు ఏర్పాటు చేశారు. భూమి ఆక్రమించిన వ్యక్తిపైన, ఎక్స్‌కవేటర్ ఓనర్, ట్రాక్టర్ డ్రైవర్‌పైన బైండోవర్ కేసు నమోదు చేసి, వాహనాలను పంపించేసినట్లు తహసీల్దారు తెలిపారు.



- వివరాలు 10లో..

మర్రిపాడు పరిసరాల్లో కబ్జారాయుళ్లు ఆక్రమించిన ప్రభుత్వ భూమి

వికసిత్ భారత్‌కు

దరఖాస్తుల ఆహ్వానం

నెల్లూరు(విద్య) : స్వామి వివేకానంద జయంతిని పురస్కరించుకుని mybharath.gov.in పోర్టల్ ద్వారా నిర్వహించే వికసిత్ భారత్ క్విజ్‌లో 15 నుంచి 29 ఏళ్ల యువత పాల్గొనాలని సెట్నెల్ సీఈవో నాగేశ్వరరావు ఓ ప్రకటనలో పేర్కొన్నారు. యువత ఆలోచనలను వినూత్నంగా ప్రదర్శించేందుకు ఉపయోగపడే ఈ వేదికకు అందరూ దరఖాస్తు చేసుకోవాలని, పూర్తి వివరాలకు వెబ్‌సైట్‌ను పరిశీలించాలని కోరారు.

ఎన్‌క్యాప్ ద్వారా నెల్లూరుకు

రూ.13.50 కోట్ల మంజూరు

నెల్లూరు (సిటీ, ఆంధ్రజ్యోతి) : నేషనల్ క్లీన్ ఎయిర్ ప్రోగ్రాం (ఎన్‌క్యాప్)లో భాగంగా ప్రస్తుత ఆర్థిక సంవత్సరానికి సంబంధించి నెల్లూరుకు రూ.13.50 కోట్ల నిధులు మంజూరైనట్లు కలెక్టర్ హిమాన్షు శుక్లా వెల్లడించారు. బుధవారం కలెక్టరేట్‌లోని తన ఛాంబరులో ఎన్ఎంసీ, పొల్యూషన్ బోర్డు ఇతర శాఖలతో ఆయన సమావేశమై మాట్లాడారు. నగరానికి మంజూరైన ఈ నిధులను రోడ్ల నిర్మాణం, పచ్చదనం పెంపు, యంత్రాలతో రోడ్ల శుభ్రం, దుమ్ము నియంత్రణ వంటి చర్యలు చేపట్టనున్నట్లు చెప్పారు. పొల్యూషన్ కంట్రోల్ బోర్డు ఇంజనీర్ అశోక్‌కుమార్ మాట్లాడుతూ కేంద్రంలోని తమ శాఖ ఏపీలో 13 నగరాల్లో పీఎం10 నమూనాలను తీయగా అందులో నెల్లూరు కూడా ఉందన్నారు. వాయుకాలుష్యాన్ని అరికట్టడానికి నగరంలో స్వచ్ఛమైన గాలికోసం సమగ్ర కార్యాచరణ అమలు చేస్తున్నట్లు తెలిపారు. కాలుష్యాన్ని పూర్తిగా కట్టడి చేసేందుకు సిటీలో కమిటీ కూడా ఏర్పాటు చేసినట్లు తెలిపారు. ఈ కార్యక్రమంలో ఎన్ఎంసీ కమిషనర్ నందన్, డీటీసీ చందర్, పరిశ్రమల శాఖ జీఎం మారుతీప్రసాద్ తదితరులు పాల్గొన్నారు.

వృద్ధులు, పురుషుల కోసం

బస్సు సర్వీసులు పెంచండి

డయల్ యువర్ ఆర్టీసీ డీఎంలో ఓ ప్రయాణికుడు 10లో



ఏపీపీగా స్టాలిన్‌బాబు

కోవూరు, సెప్టెంబరు 24 (ఆంధ్రజ్యోతి): స్థానిక అ సిస్టెంటు సెషన్సు జడ్జి కోర్టు ఏపీపీగా పూండ్ల స్టాలిన్‌బాబును నియమిస్తూ రాష్ట్ర ప్రభుత్వం ఉత్తర్యులు జారీ చేసింది. నియామక ఉత్తర్వులు పొందిన ఆయన బుధవారం బాధ్యతలు చేపట్టారు. ఆయనను పలువురు న్యాయవాదులు, అభిమానులు అభినందించారు.



బంగారం, వెండి ధరలు

బంగారం (22 క్యారెట్లు)

ఒక గ్రాము ధర	రూ. 10898
వెండి కిలో ధర	రూ. 138600
వెండి ఒక గ్రాము	రూ. 141.60

సైదాపురం ఎంపీడీవోగా రామ్మోహన్ రెడ్డి



గూడూరు అర్బన్ (సైదాపురం), సెప్టెంబరు 24 (ఆంధ్రజ్యోతి): సైదాపురం ఎంపీడీవోగా రామ్మోహన్‌రెడ్డి బుధవారం బాధ్యతలు స్వీకరించారు. ప్రకాశం జిల్లా కనిగిరి డిప్యూటీ ఎంపీడీవోగా పనిచేస్తున్న ఆయన పదోన్నతిపై సైదాపురానికి బదిలీ అయ్యారు. పలువురు ప్రజాప్రతినిధులు, కూటమి నాయకులు, పంచాయతీ కార్యదర్శులు, సిబ్బంది ఆయనకు అభినందనలు తెలిపారు. ఈసందర్భంగా ఆయన మాట్లాడుతూ స్థానిక నాయకుల సహకారంతో మండలాన్ని అభివృద్ధి చేస్తానన్నారు. మండల ప్రజానీకం తమ సమస్యల పరిష్కారం కోసం నేరుగా తనను కలవాలన్నారు.

ఉచిత వైద్య శిబిరం, రక్తదానం



శిబిరంలో రక్తదానం చేస్తున్న దాతలు

బుచ్చిరెడ్డిపాళెం, సెప్టెంబరు 24(ఆంధ్రజ్యోతి): ప్రధాని నరేంద్రమోదీ జన్మదినాన్ని పురస్కరించుకుని చేపట్టిన సేవా పక్షోత్సవాల్లో భాగంగా స్వస్థ్ నారీ సశక్త్ పరివార్ అభియాన్ కార్యక్రమాన్ని బుధవారం స్థానిక ప్రభుత్వ ఆసుపత్రి వద్ద నిర్వహించారు. అక్కడ ఏర్పాటు చేసిన ఉచిత మెగా వైద్య శిబిరంలో 20 మంది వైద్యులు సుమారు 500 రోగులకు పరీక్షలు నిర్వహించి ఉచితంగా మందులు పంపిణీ చేశారు. రెడ్‌క్రాస్ ఆధ్వర్యంలో ఏర్పాటు చేసిన రక్తదాన శిబిరంలో తహసీల్దారు అంబటి వెంకటేశ్వర్లు, డిప్యూటి తహసీల్దారు భాగ్యలక్ష్మి, రెవెన్యూ సిబ్బందితోపాటు 40 మంది యువత రక్తదానం చేశారు. ప్రభుత్వ వైద్యాధికారి డాక్టర్ పద్మజ, హెచ్‌డీసీ చైర్మన్ దొడ్ల కోదండరామిరెడ్డి, డైరెక్టర్లు ఆర్.రమణమ్మ, టీ.ప్రసాద్‌లు రక్తదాతలను అభినందించారు. ఈ కార్యక్రమంలో ప్రభుత్వ వైద్యులు రమ్య, సహన, ప్రత్యూష, నితిన్, అబ్దుల్, ప్రమీల, ప్రసాద్, ఎల్‌టీ రాజేష్, కౌన్సిలర్ తాళ్ల వైష్ణవి తదితరులు పాల్గొన్నారు.

● ఇందుకూరుపేటలో..



వైద్య పరీక్షలు నిర్వహిస్తున్న వైద్య సిబ్బంది

ఇందుకూరుపేట, సెప్టెంబరు 24(ఆంధ్రజ్యోతి) : మండలంలోని కొత్తూరు ఎస్టీ కాలనీ ఎంపీపీ స్కూల్‌లో ఆరోగ్య శాఖ ఐసీడీఎస్ సమన్వయంతో బుధవారం ఉచిత వైద్య శిబిరం న్యూట్రిషన్ స్టాల్ ఏర్పాటు చేశారు. డాక్టర్ కిషోర్‌కుమార్ ఆరోగ్యంపై అవగాహన కల్పించారు. ఈ కార్యక్రమంలో డిప్యూటీ హెల్త్ ఎడ్యుకేటర్ సుధాకర్‌రావు, ఐసీడీఎస్ అధికారి ఏ.రాధిక, హెచ్‌ఈవో శ్రీనివాసులు, హెల్త్ సూపర్‌వైజర్లు రమ, సతీష్, హెల్త్ అసిస్టెంట్ మాధవ, సుధాకర్, తదితరులు పాల్గొన్నారు.

విండ్రో కంపోస్ట్ తయారీ విధానం పరిశీలన

కావలి, సెప్టెంబరు 24(ఆంధ్రజ్యోతి): కావలి పురపాలకసంఘంలో పారిశుధ్య నిర్వహణ, విండ్రోకంపోస్ట్ తయారీ విధానాలను తెలుసుకుని తమ పురపాక సంఘంలో కూడా అమలు చేసేందుకు బుధవారం నాయుడుపేట మున్సిపల్ కమిసనర్ షేక్ ఫజులుల్లా కావలికి వచ్చారు. పట్టణంలోని కంపోస్ట్‌యార్డులో నూతన సాంకేతిక పరిజ్ఞానంతో తయారు చేస్తున్న విండ్రోకంపోస్ట్ తయారీ విధానాన్ని ఆయన పరిశీలించి అక్కడ సిబ్బందిని అడిగి వివరాలు తెలుసుకున్నారు. అలాగే పట్టణంలో ఇంటింటి నుంచి సేకరించిన చెత్తను తీసుకెళ్లే వాహనాలు వచ్చే వరకు రోడ్డుపై పడేయకుండా చెత్త డబ్బాలను పెట్టేందుకు ఏర్పాటు చేసిన ఇనుప గ్రిల్స్‌తో తయారు చేసిన బోనులను, బ్లాక్ స్పాట్స్‌ను గ్రీన్ స్పాట్స్‌గా మార్చేందుకు ఏర్పాటు చేసిన తులసి వనాలను పరిశీలించి సిబ్బందిని అడిగి తెలుసుకున్నారు. ఈ విధానం బాగుందని కావలి పురపాలక సంఘం పనితీరును అభినందించారు. ఈ కార్యక్రమంలో శానిటరీ ఇన్‌స్పెక్టర్ ఎండీ బషీర్, సిబ్బంది తదితరులు పాల్గొన్నారు.

నేలటూరు జెన్కోకు భూములిస్తే .. బూడిద ఇచ్చారు!

● నిర్వాసితుల ఆవేదన

ముత్తుకూరు, సెప్టెంబరు 24 (ఆంధ్రజ్యోతి): రాష్ట్రంలో వెలుగులు నింపుతుందని భూములు ఇస్తే మాకు బూడిద ఇచ్చారని నెల్లూరు జిల్లా ముత్తుకూరు మండలం నేలటూరులోని శ్రీదామోదర సంజీవయ్య థర్మల్ విద్యుత్ కేంద్రానికి భూములు ఇచ్చిన రైతులు, నిర్వాసితులు ఆవేదన వ్యక్తం చేస్తున్నారు. ప్రాజెక్టు కోసం భూములు, ఇళ్లు వదిలేసిన నిర్వాసిత గ్రామాల ప్రజలు ఈరోజు తిండి కోసం చుట్టుపక్కల ప్రాంతాలకు వలస వెళ్లాల్సిన పరిస్థితి ఏర్పడింది. ఇళ్లు కట్టిస్తామన్నారు... పాఠశాలలు, ఆసుపత్రులు ఏర్పాటుచేస్తామని హామీ ఇచ్చారే తప్ప ఏఒక్కటీ నెరవేర్చలేదని వాపోతున్నారు. నిర్వాసితులకు కేవలం జీతాలు ఇచ్చే ఉద్యోగాలే కాదు.. దీర్ఘకాలిక జీవన భద్రత కల్పించే చర్యలు తీసుకోవాలని స్థానికులు కోరుతున్నారు. ప్రారంభ సమయంలో తీసుకున్న కొంతమందిని కూడా శాశ్వత ఉద్యోగులుగా గుర్తించకపోవడమే కాకుండా, బయట జిల్లాలవారికి అవకాశాలు కల్పించి వారిని పర్మినెంట్ చేయడం ఏమిటని ప్రశ్నిస్తున్నారు. ప్రాజెక్టులో తమకు పర్మినెంట్ ఉద్యోగాలు ఇవ్వాలని నిర్వాసితులు కోరుతున్నారు. కనీసం 70 శాతం ఉద్యోగాలను స్థానికులకే కేటాయించాలని, నిర్వాసితులకు ప్రత్యేక శిక్షణా కార్యక్రమాలు నిర్వహించి నైపుణ్యాలు పెంచి శాశ్వత ఉద్యోగాలు ఇవ్వాలని, విద్య వైద్య సదుపాయాలను కల్పించాలని, నిర్వాసితుల కుటుంబాల కోసం ప్రత్యేక సంక్షేమ పథకాలు, గృహ నిర్మాణాలు చేపట్టడం, ప్రతి సంవత్సరం ఉపాధి, సంక్షేమ చర్యలపై జెన్కో పబ్లిక్ రిపోర్టు విడుదల చేయాలని కోరుతున్నారు.

కాంట్రాక్టు పనులు చేయాలంటే వాటా ఇవ్వాల్సిందే

ప్రాజెక్టులో కాంట్రాక్టు పనులు చేయాలంటే 40 శాతం వాటా ఇవ్వాల్సిందేనని, వాటా ఇవ్వకపోతే బిల్లులు జాప్యం చేసి దౌర్జన్యాలు చోటుచేసుకుంటున్నాయని స్థానిక కాంట్రాక్టర్లు ఆరోపిస్తున్నారు. కూటమి ప్రభుత్వం అధికారంలోకి వచ్చి 15 నెలలు గడుస్తున్నా జెన్కో అధికారులు ఇంకా వైసీపీ నేతల ప్రభావంలోనే ఉన్నారన్న విమర్శలు వినిపిస్తున్నాయి. ఇటీవల టీడీపీ నాయకులు స్థానికులతో కలిసి జెన్కో అధికారులను కలిసి వినతిపత్రం ఇవ్వాలనుకున్నా.. మీకు లోపలికి అనుమతి లేదంటూ నిర్లక్ష్య ధోరణి ప్రదర్శించారంటూ తీవ్ర ఆగ్రహం వ్యక్తం చేస్తున్నారు. వైసీపీ హయాంలో అధికారులు ఇష్టారీతిన వ్యవహరించారని, కూటమి ప్రభుత్వం అధికారంలోకి వచ్చినా అధికారులు ఇంకా అదే దారిలో నడుస్తున్నారని స్థానికులు తీవ్ర అసహనం వ్యక్తం చేస్తున్నారు.



జెన్కో ఎదుట ఆందోళన చేస్తున్న కాంటాక్ట్ కార్మికులు, స్థానికులు (ఫైల్)

రక్తబీజ వధ అలంకారంలో కామాక్షితాయి

బుచ్చిరెడ్డిపాళెం, సెప్టెంబరు 24(ఆంధ్రజ్యోతి): మండలంలోని జొన్నవాడ మల్లికార్జునస్వామి, కామాక్షితాయి ఆలయంలో జరుగుతున్న శరన్నవరాత్రి ఉత్సవాల్లో భాగంగా బుధవారం కామాక్షితాయి రక్తబీజవధ అలంకారంలో భక్తులకు దర్శనమిచ్చారు. ఈ సందర్భంగా ఆలయంలో ఉదయం, రాత్రి స్వామివారికి అభిషేకం, అమ్మవారికి నవావరణ పూజలు, కాళరాత్రి నవావరణ పూజలు జరిగాయి. ఈ కార్యక్రమానికి నెల్లూరుకు చెందిన అద్దేపల్లి మస్తానయ్య, కుమారులు ఉభయకర్తలుగా వ్యవహరించారు. చిన్నారుల సాంస్కృతిక కార్యక్రమాలు భక్తులను అలరించాయి. కాగా గురువారం కామాక్షితాయి మధుకైటభవధ అలంకారములో భక్తులకు దర్శనమివ్వనున్నారు.

● **కోదండరామస్వామి ఆలయంలో..**

బుచ్చిపట్టణం పెద్దూరులో కొలువైవున్న సీతా లక్ష్మణ సమేత కోదండరామస్వామి ఆలయంలో కోదండరాముడు కాళీయమర్దనం అలంకారములో భక్తులకు దర్శనమిచ్చారు. గురువారం వేణుగోపాలస్వామి అలంకారములో దర్శనమివ్వనున్నారు.

● **వీరలక్ష్మి అలంకారంలో కల్యాణ వేంకటేశ్వరుడు**

బుచ్చిరెడ్డిపాళెం రామకృష్ణానగర్‌లో కొలువైవున్న కల్యాణ వేంకటేశ్వరస్వామి వీరలక్ష్మి అలంకారంలో భక్తులకు దర్శనమిచ్చారు. గురువారం ధనలక్ష్మి అలంకారములో దర్శనమివ్వనున్నారు.



బుచ్చి : పెద్దూరులో కాళీయమర్దనం అలంకారంలో దర్శనమిచ్చిన కోదండరాముడు

● రాపూరు, సెప్టెంబరు 24 (ఆంధ్రజ్యోతి): శరన్నవరాత్రి ఉత్సవాల్లో భాగంగా 3వ రోజు బుధవారం పెంచలకోన క్షేత్రంలో వున్న ఆదిలక్ష్మీ అమ్మవారు ధాన్యలక్ష్మీ అలంకారంలో భక్తులకు దర్శనమిచ్చారు. ఈ సందర్భంగా అమ్మవారికి ప్రత్యేక పూజా కార్యక్రమాలు నిర్వహించారు. ముందుగా అమ్మవారికి వస్త్ర సమర్పణ, పుష్పాలంకరణ, అభిషేకం నిర్వహించారు. అనంతరం సాయంత్రం ధాన్యలక్ష్మీగా భక్తులకు దర్శనమిచ్చారు. కాగా, గురువారం అమ్మవారు ధైర్యలక్ష్మీ అలంకారంలో భక్తులకు దర్శనమివ్వనున్నారు. అలాగే శ్రీమాతృదేవి విశ్వశాంతి ఆశ్రమంలో శ్రీవిజయేశ్వరిదేవి లక్ష్మీనారాయణ హృదయ సూక్త హోమం, గాయత్రి హోమాలు నిర్వహించారు. భక్తులు అధిక సంఖ్యలో పాల్గొన్నారు.



రాపూరు : విశ్వశాంతి ఆశ్రమంలో పూజా కార్యక్రమాలు నిర్వహిస్తున్న విజయేశ్వరిదేవి

సమాజంలో మార్పు తీసుకురావాలి

● విద్యార్థులకు వీఎస్‌యూ వీసీ శ్రీనివాసరావు పిలుపు

వెంకటాచలం, సెప్టెంబరు 24 (ఆంధ్రజ్యోతి): సమాజంలో మార్పు తీసుకురావడంలో విద్యార్థులు ముందుండాలని వీఎస్‌యూ వీసీ ప్రొఫెసర్ అల్లం శ్రీనివాసరావు పిలుపునిచ్చారు. స్థానిక వీఎస్‌యూలోని పురుషుల వసతిగృహం వద్ద బుధవారం బీసీడీఈ, ఎన్‌ఎస్‌ఎస్ సంయుక్త ఆధ్వర్యంలో ఫ్రీడమ్ ఫ్రం ప్లాస్టిక్‌పై అవగాహన కార్యక్రమాన్ని నిర్వహించారు. ఈసందర్భంగా పోస్టర్‌ను ఆవిష్కరించి ప్రతిజ్ఞ చేయించారు. వీసీ ముఖ్య అతిథిగా హాజరై మాట్లాడుతూ ప్లాస్టిక్ వినియోగం పర్యావరణానికి పెద్ద ముప్పు అని, ప్లాస్టిక్ వాడకం పెరిగితే భూసమృద్ధి తగ్గిపోవడంతోపాటు జలచరాలు, పక్షులు, వన్యప్రాణులు ప్రమాదంలో పడతాయన్నారు. విద్యార్థులు ప్లాస్టిక్‌కు బదులుగా పునర్వినియోగ పాత్రలు, పేపర్ బ్యాగులు, జ్యూట్ బ్యాగులను వాడాలన్నారు. పర్యావరణ పరిరక్షణలో ప్రతి ఒక్కరూ భాగస్వాములు కావాలన్నారు. విద్యార్థులు స్వయంగా అలవాటు మార్చుకుంటేనే సమాజంలో చైతన్యం పెరుగుతుందన్నారు. సింగిల్ యూజ్ ప్లాస్టిక్ వినియోగాన్ని తగ్గించేందుకు వీఎస్‌యూ ఎల్లప్పుడూ ముందుంటుందన్నారు. కార్యక్రమంలో వర్సిటీ రిజిస్ట్రార్ డాక్టర్ కే సునీత, వర్సిటీ కళాశాల ఇన్‌చార్జ్ ప్రిన్సిపాల్ సీహెచ్ విజయ, వార్డెన్లు డాక్టర్ షైల త్యాగరాజు, డాక్టర్ నీలమణికంఠ, డాక్టర్ అల్లం ఉదయ్ శంకర్, డాక్టర్ కేవీఎల్ శ్రీకన్యరావు తదితరులు పాల్గొన్నారు.

● **ఘనంగా ఎన్‌ఎస్‌ఎస్ దినోత్సవం**

స్థానిక వీఎస్‌యూలో బుధవారం జాతీయ సేవా పథకం (ఎన్‌ఎస్‌ఎస్) దినోత్సవాన్ని ఘనంగా నిర్వహించారు. ముఖ్యఅతిథిగా వీఎస్‌యూ వీసీ ప్రొఫెసర్ అల్లం శ్రీనివాసరావు హాజరయ్యారు. ఆయన మాట్లాడుతూ విద్యార్థి దశ నుంచే సేవా భావం, క్రమశిక్షణ, సమాజంపై అవగాహన కల్పించడంలో జాతీయ సేవా పథకం ముఖ్యపాత్ర పోషిస్తుందన్నారు. విద్యార్థులు సమాజానికి సేవ చేయడం ద్వారా దేశ భవిష్యత్తుకు పునాదులు వేస్తారన్నారు. అనంతరం వీఎస్‌యూ ప్రాంగణంలో మొక్కలు నాటారు. ఈసందర్భంగా ప్లాస్టిక్ వ్యర్థాలు, చెత్తను శుభ్రం చేశారు. కార్యక్రమంలో వర్సిటీ రిజిస్ట్రార్ డాక్టర్ కే సునీత, వర్సిటీ కళాశాల ఇన్‌చార్జ్ ప్రిన్సిపాల్ డాక్టర్ సీహెచ్ వెంకట్రాయులు, ఎన్‌ఎస్‌ఎస్ కోఆర్డినేటర్ డాక్టర్ అల్లం ఉదయ్‌శంకర్, ప్రోగ్రామ్ ఆఫీసర్లు డాక్టర్ ఎస్ సాయినాథ్, డాక్టర్ ఆర్‌వీఎస్ శంకర్, డాక్టర్ పిబి సుచరిత, పీఆర్‌ఓ డాక్టర్ నీలమణికంఠ పాల్గొన్నారు.



ప్లాస్టిక్ వ్యర్థాలను ఎత్తుతున్న వర్సిటీ వీసీ అల్లం శ్రీనివాసరావు

కామాక్షితాయి సేవలో దీపా వెంకట్



జొన్నవాడ కామాక్షితాయిని దర్శించుకుంటున్న స్వర్ణభారత్ ట్రస్టీ దీపా వెంకట్

బుచ్చిరెడ్డిపాళెం, సెప్టెంబరు 24(ఆంధ్రజ్యోతి): మండలంలోని జొన్నవాడ మల్లికార్జున స్వామి, కామాక్షితాయిని మాజీ ఉపరాష్ట్రపతి వెంకయ్యనాయుడు కుమార్తె, స్వర్ణభారత్ ట్రస్టీ దీపావెంకట్ బుధవారం దర్శించుకున్నారు. ముందుగా ఈవో ఆర్వభూమి వెంకట శ్రీనివాసులురెడ్డి, అర్చకులు ఆలయ మర్యాదలతో ఆమెను స్వాగతించారు. అనంతరం వారి గోత్ర నామాలతో స్వామి, అమ్మవారికి ప్రత్యేక పూజలు నిర్వహించి తీర్థప్రసాదములు అందజేశారు. అ నంతరం ఆలయంలో రక్తబీజవధ అలంకారములో కొలువుదీరిన కామా క్షితాయిని దర్శించుకున్నారు. ఆమె వెంట సీఐ శ్రీనివాసులురెడ్డి, బీజేపీ నాయ కులు విజయలక్ష్మి, జిల్లా మైనారిటీ మోర్చా అధ్యక్షుడు ఖాదర్‌బాషా, కీలు కుప్ప శ్రీనివాసులు యాదవ్, జల్లి పెంచలయ్య, శివ తదితరులున్నారు.

అంగన్‌వాడీ భవనం ప్రారంభం



శిలాఫలకాన్ని ఆవిష్కరిస్తున్న ఎమ్మెల్యే శ్రీధర్‌రెడ్డి, జడ్పీ చైర్‌పర్సన్ ఆనం అరుణమ్మ

నెల్లూరు రూరల్, సెప్టెంబరు 24 (ఆంధ్రజ్యోతి) : నగరంలోని చింతారెడ్డిపాళెంలో రూ.26 లక్షలతో నిర్మించిన అండన్‌వాడీ భవనాన్ని జడ్పీ చైర్‌పర్సన్ ఆనం అరుణమ్మతో కలిసి రూరల్ ఎమ్మెల్యే కోటంరెడ్డి శ్రీధర్‌రెడ్డి బుధవారం ప్రారంభించారు. అన్నీ ప్రాంతాలు అభివృద్ధి చెందాలన్నదే తమ అజెండా అని తెలిపారు. అంగన్‌వాడీ కేంద్రం నిర్మాణానికి నెల్లూరు ఎంపీ వీపీఆర్ తన నిధుల నుంచి రూ.16 లక్షలు కేటాయించారని చెప్పారు. ఈ కార్యక్రమంలో నాయకులు అబ్రహం, తనూజ తదితరులు పాల్గొన్నారు.

ప్రతి మహిళ లక్షాధికారి కావాలన్నదే ప్రభుత్వ లక్ష్యం

కావలి(టౌన్), సెప్టెంబరు 24(ఆంధ్రజ్యోతి): ప్రతి మహిళ లక్షాధికారి కావాలన్నదే ప్రభుత్వ లక్ష్యమని మున్సిపల్ కమిషనర్ శ్రావణ్‌కుమార్ తెలిపారు. రైల్వే రోడ్డులోని మెప్మా కార్యాలయ ప్రాంగణంలో మెప్మా ఆధ్వర్యంలో స్వయం సహాయక సంఘాల సభ్యులు ఏర్పాటు చేసిన అర్బన్ మార్కెట్‌ను బుధవారం శ్రావణ్‌కుమార్ ప్రారంభించారు. ఆయన మాట్లాడుతూ ప్రభుత్వ లక్ష్యం చిన్న వ్యాపారల నుంచి పెద్ద వ్యాపారాలు చేసుకోవాలని, తయారు చేసిన వస్తువులు ఆన్‌లైన్ మార్కెటింగ్ చేసుకునేందుకు అవకాశం కల్పించారని, తద్వారా లాభాలు పొందవచ్చన్నారు. మహిళలు తయారు చేసి ప్రదర్శించిన వస్తువులు, వస్త్రాలు, ఆభరణాలు, ఆహారానికి సంభందించిన రాగిపిండి, మల్టీగ్రెయిన్ పిండి, వడియాలు, ఊరగాయలు, మగ్గం వర్క్ శారీస్, పింగాణి గ్లాసులు బొమ్మలు, ఫినాయిల్, వర్క్ బ్లౌజ్‌లు తదితర వస్తువులు ప్రత్యేక ఆకర్షణగా ఆకట్టుకున్నాయి. కార్యక్రమంలో డీఈ సాయిరామ్, ఇండియన్ బ్యాంక్ మేనేజర్ హరిబాబు, మెప్మా సీఎంఎం భారతి తదితరులు పాల్గొన్నారు.

అవగాహనతోనే క్షయ వ్యాధి నివారణ

నెల్లూరు (వైద్యం), సెప్టెంబరు 24 (ఆంధ్రజ్యోతి) : అవగాహన ద్వారానే క్ష యవ్యాధిని పూర్తిగా నివారించవచ్చని నా రాయణ దంత వైద్య కళాశాల హెచ్‌వోడీ డాక్టర్ కన్నన్ తెలియచేశారు. బుధవారం నగరంలోని అబైండింగ్ హోప్ ట్రస్ట్ కార్యాలయంలో క్షయ బాధితులకు పౌష్టికాహారం అందచేశారు. ట్రస్ట్ నిర్వాహకుడు నిర్మలకుమార్ మాట్లాడుతూ మంచి ఆ హారం తీసుకుంటే క్షయ వ్యాధిగ్రస్తులు త్వరగా కోలుకుంటారని చెప్పారు. ఈ కార్యక్రమంలో జయప్రకాష్, కాంతికుమార్, జ్యోతి చౌదరి, మధు తదితరులు పాల్గొన్నారు.



పౌష్టికాహారం ప్యాకెట్లు అందచేస్తున్న డాక్టర్ కన్నన్, నిర్వాహకులు

పెద్దచెరుకూరు సొసైటీ చైర్మన్‌గా అజయ్‌కుమార్‌రెడ్డి

నెల్లూరు రూరల్, సెప్టెంబరు 24 (ఆంధ్రజ్యోతి) : పెద్దచెరుకూరు ప్రాథమిక వ్యవసాయ పరపతి సంఘం చైర్మన్‌గా వల్లూరు అజయ్‌కుమార్ రెడ్డిని నియమిస్తూ రాష్ట్ర సహకార శాఖ ఉత్తర్వులిచ్చింది. ఇందులో భాగంగా ఆయన చైర్మన్‌గా, రాచూరు రమేష్, చెవికల సుబ్బరామయ్య డైరెక్టర్లుగా బుధవారం సొసైటీ కార్యాలయంలో బాధ్యతలు స్వీకరించారు. రైతులకు రాయితీ రుణాలతోపాటు ఎరువులు కొరత లేకుండా కృషి చేస్తామని చైర్మన్ తెలిపారు. నూతనంగా బాధ్యతలు చేపట్టిన త్రీమెన్ కమిటీకి ఏఎంసీ చైర్మన్ మనుబోలు శ్రీధర్‌రెడ్డి, టీడీపీ నాయకులు బండి శ్రీకుమార్‌రెడ్డి, మనుబోలు రామ్మోహన్‌రెడ్డి, చెన్నారెడ్డి శ్రీకాంత్‌రెడ్డి, మేకల హరి శుభాకాంక్షలు తెలిపారు.



బాధ్యతలు స్వీకరించిన సొసైటీ చైర్మన్, డైరెక్టర్లు

C.R.I.M.E N.E.W.S

ఉద్యోగాలు ఇప్పిస్తానని నకిలీ పోలీసు గాలం

● పలువురి నుంచి రూ.51 లక్షల వసూలు

నెల్లూరు(క్రైం), సెప్టెంబరు 24 (ఆంధ్రజ్యోతి): 'విజయవాడలో క్రైమ్ బ్రాంచ్ సర్కిల్ ఇన్‌స్పెక్టర్‌గా పని చేస్తున్నాను. నాకు ఫారెస్ట్ డిపార్ట్‌మెంట్ లో చాలా పరిచయాలు ఉన్నాయి. మీకు ఉద్యోగం ఇప్పిస్తాను. దానికి డబ్బులు ఇవ్వాలి' అంటూ మాయమాటలు చెప్పి ఓ నకిలీ పోలీసు నిరుద్యోగుల నుంచి రూ.51 లక్షలకుపైగా వసూలు చేసి పరారయ్యాడు. ఈ ఘటనపై వేదాయపాళెం పోలీసులు కేసు నమోదు చేశారు. పోలీసుల సమాచారం మేరకు... నెల్లూరు నగరం న్యూ మిలటరీ కాలనీకి చెందిన తూపిలి వినోద్ కుమార్ బీటెక్ చదివి ఉద్యోగాన్వేషణలో ఉన్నాడు. ప్రస్తుతం డైకాస్‌రోడ్డు సెంటర్‌లో ఆయన మామ ప్రసాద్ నిర్వహిస్తున్న టీ బ్రేక్ దుకాణంలో పనిచేస్తున్నాడు. ఆ దుకాణానికి పొదలకూరురోడ్డు ప్రాంతానికి చెందిన దేవళ్ల సాయికృష్ణ వస్తూ ఉండేవాడు. తాను విజయవాడలో క్రైమ్ బ్రాంచ్ సీఐగా పనిచేస్తున్నానని, తనకు డబ్బులు ఇస్తే ఫారెస్ట్ డిపార్ట్‌మెంట్‌లో ఉద్యోగం ఇప్పిస్తానని వినోద్‌కుమార్‌ను నమ్మించాడు. పలుమార్లు పోలీసు యూనిఫామ్‌లో రావడంతో నిజంగా పోలీసే అని వినోద్‌కుమార్ నమ్మి ఈ ఏడాది జూన్ నుంచి ఆగస్టు వరకు ఫోన్‌పే ద్వారా రూ.3.31 లక్షలు, చేతికి రూ.3.20 లక్షలు, ఆరు సవర్ల బంగారు వస్తువులు... కలిపి మొత్తం రూ.11 లక్షలు సాయికృష్ణకు ఇచ్చాడు. ఉద్యోగం విషయం ప్రశ్నించినప్పుడల్లా తప్పించుకుంటూ ఉండటంతో వినోద్‌కుమార్‌కు అనుమానం వచ్చి విచారించగా సాయికృష్ణ ప్రభుత్వ ఉద్యోగి కాదని తెలిసింది. దీంతో తనకు ఉద్యోగం వద్దని, తానిచ్చిన నగదు, నగలు తిరిగి ఇచ్చేయాలని ఈ నెల 14వ తేదీ నిలదీశాడు. దీనికి స్పందించిన సాయికృష్ణ 'నాపై నమ్మకం లేకపోతే నా కారు, రెండు బైక్‌లు మీ వద్దనే ఉంచుకోండి, నగదు ఇచ్చాక వాటిని తీసుకువెళతాను' అని చెప్పి వాటిని ఇచ్చి వెళ్లిపోయాడు. 15వ తేదీ అతని ఇంటికి వెళ్లి చూడగా తాళం వేసి ఉండటంతో మోసపోయామని తెలుసుకున్నాడు. ఎన్‌సీసీ కాలనీకి చెందిన పోలిరెడ్డి పావని, భారతి, దగదర్తికి చెందిన కే హేమంత్‌కు కూడా ఉద్యోగాలు ఇప్పిస్తానని సాయికృష్ణ రూ.40 లక్షలు తీసుకొని మోసం చేశాడని వినోద్‌కుమార్‌కు తెలిసింది. ఈ నేపథ్యంలో బుధవారం వేదాయ పాళెం పోలీసులకు ఫిర్యాదు చేశాడు. కారు, రెండు బైక్‌లను స్వాధీనం చేసుకున్న పోలీసులు కేసు నమోదు చేసి విచారిస్తున్నారు.

రామాలయంలో చోరీ



కంపచెట్లలో పడి ఉన్న హుండీ

వరికుంటపాడు (ఉదయగిరి రూరల్), సెప్టెంబరు 24 (ఆంధ్రజ్యోతి): మండలంలోని తూర్పు కొండా రెడ్డిపల్లి రామాలయంలో గుర్తుతెలియని దుండగులు చోరీకి పాల్పడిన సంఘటన బుధవారం వెలుగు చూసింది. వివరాల మేరకు... మంగళవారం సాయంత్రం రోజు మాదిరిగా పూజలు నిర్వహించి ఆలయ ప్రధాన గేటుకు తాళాలు వేసి నివాసాలకు చేరుకున్నారు. బుధవారం ఉదయం గేటు తాళాలు పగులకొట్టి ఉండడాన్ని అటుగా వెళ్లిన కొంతమంది గమనించి గ్రామస్థులకు సమాచారం అందజేశారు. దీంతో వారు అక్కడికి చేరుకుని హుండీతో పాటు రెండు బంగారు తాళిబొట్లు చోరీకి గురయినట్లు నిర్ధారించారు. అనంతరం గాలింపు చర్యలు చేపట్టి గ్రామ శివారు ప్రాంతంలోని కంపచెట్లలో పడి ఉన్న హుండీని గుర్తించారు. ఆలయ కమిటీ అందించిన ఫిర్యాదు మేరకు పోలీసులు సంఘటనా స్థలానికి చేరుకొని దర్యాప్తు చేపట్టారు.

● **చిల్లర దుకాణంలో..**

కావలిరూరల్, సెప్టెంబరు 24(ఆంధ్రజ్యోతి): కావలి పట్టణం ట్రంక్ రోడ్డులో ఉన్న చిల్లర దుకాణంలో చోరీ జరిగినట్లు బుధవారం దుకాణం యజమాని తాతా అమర్‌చంద్ గుర్తించి పోలీసులకు ఫిర్యాదు చేశాడు. 1వ పట్టణ పోలీసులు, బాధితుడి వివరాల మేరకు.. మంగళవారం రాత్రి దుకాణం మూసి వెళ్లగా అర్ధరాత్రి సమయంలో దుకాణం వెనుక షెట్టరు పగలగొట్టి లోనికి ప్రవేశించిన గుర్తుతెలియని దుండగులు గల్లా పెట్టెలో ఉంచిన రూ.10,000 అపహరించుకుకెళ్లారు. అలాగే పక్కనే ఉన్న మరో దుకాణంలో చోరీ యత్నానికి పాల్పడగా ఆ సమీపంలో మనుషుల అలికిడి రావడంతో అక్కడ నుంచి వెళ్లిపోయారు. బాధితుడి ఫిర్యాదు మేరకు ఎస్‌ఐ సుమన్ కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నట్లు తెలిపారు.

● **రెండు ద్విచక్ర వాహనాలు..**

నెల్లూరు రూరల్, సెప్టెంబరు 24 (ఆంధ్రజ్యోతి) : నెల్లూరు రూరల్ పరిధిలోని రెండు ద్విచక్ర వాహనాలు చోరీ అయినట్లు రూరల్ సీఐ గుంజి వేణు బుధవారం తెలిపారు. చింతారెడ్డిపాళెంకు చెందిన శ్రీధర్ తన యమహా ఎఫ్‌జడ్ వాహనాన్ని గత నెల 25వ తేదీన మెడికవర్ ఆసుపత్రి వద్ద ఉంచగా అది చోరీకి గురైనట్లు ఫిర్యాదు చేశారని తెలిపారు. దేవరపాళెంలోని ఐఎంఎల్ డిపోలో హమాలీ కార్మికుడిగా పని చేస్తున్న గడ్డం వెంకటేశ్వర్లు ఈ నెల 20వ తేదీన తన హోండా సీబీ జడ్ బైక్‌ను ఇంటి వద్ద ఉంచగా చోరీకి గురైనట్లు ఫిర్యాదు చేశారన్నారు. ఈ కేసులు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నామని చెప్పారు.

నిద్రిస్తున్న వ్యక్తిపైకి లారీ...

నరుకూరు రోడ్డు వద్దనున్న వెంకటరమణ రైసు మిల్లులో బుధవారం వేకువజామున లారీ వెనుక్కు తీస్తున్న సమయంలో పక్కనే నిద్రపోతున్న ఓ వ్యక్తి కాలుపైకి వాహనం ఎక్కింది. అతని కాలు పూర్తి దెబ్బతిన్నదని, పూర్తి వివరాలు అందాల్సి ఉందని సీఐ తెలిపారు.

● **13 సవర్ల బంగారు నగలు..**

కోవూరు, సెప్టెంబరు 24(ఆంధ్రజ్యోతి): స్థానిక పాత ఆంధ్రాబ్యాంకు సమీపంలో నివాసముంటున్న మూర్తిరాజు చంద్రశేఖరరావు ఇంట్లో గుర్తుతెలియని దుండగులు 13 సవర్ల బంగారు నగలు అపహరించుకెళ్లినట్లు బుధవారం పోలీసులకు ఫిర్యాదు అందింది. వివరాల మేరకు... చంద్రశేఖరరావు ఈనెల 15వ తేదీన హైదరాబాద్‌కు వెళ్లారు. ఈ క్రమంలో మంగళవారం రాత్రి గుర్తు తెలియని వ్యక్తులు ఇంటి తలుపులు పగులగొట్టి 13 సవర్ల బంగారు నగలు అపహరించుకు వెళ్లారు. బుధవారం హైదరాబాదు నుంచి తిరిగి వచ్చిన ఆయన పోలీసులకు ఫిర్యాదు చేశారు. పోలీసులు కేసు దర్యాప్తు చేపట్టారు.

పది బైకుల స్వాధీనం



వివరాలు వెల్లడిస్తున్న డీఎస్పీ శ్రీనివాసరావు, పక్కన సీఐ సుధాకరరెడ్డి

కోవూరు, సెప్టెంబరు 24(ఆంధ్రజ్యోతి): ఇటీవల బైక్‌లను అపహరిస్తూ పట్టుబడిన కావలి పట్టణానికి చెందిన నిందితుడు సాగర్ వద్ద నుంచి పది మోటారు బైక్‌లను స్వాధీనం చేసుకున్నట్లు నెల్లూరు రూరల్ డీఎస్పీ జీ శ్రీనివాసరావు తెలిపారు. స్థానిక సీఐ కార్యాలయంలో బుధవారం ఏర్పాటు చేసిన విలేకరుల సమావేశంలో ఆయన మాట్లాడారు. జాతీయ రహదారిపై పహారా కాస్తున్న పోలీసులు సాగర్‌ను అదుపులోనికి ప్రశ్నించడంతో వివరాలు వెలుగులోకి వచ్చినట్లు చెప్పారు. నిందితుడు సాగర్ తన మిత్రులు సహన్‌బాబు, ఆదర్శ్‌గోవిండ్‌లతో కలిసి వరుస చోరీలకు పాల్పడినట్లు అంగీకరించాడని చెప్పారు. దీంతో రూ.9లక్షల విలువ చేసే పది బైకులను స్వాధీనం చేసుకున్న కోవూరు పోలీసులను ఆయన అభినందించారు. ఈ సమావేశంలో సీఐ సుధాకరరెడ్డి పాల్గొన్నారు.

యువకుడి మృతదేహం గుర్తింపు

కలువాయి, సెప్టెంబరు 24 (ఆంధ్రజ్యోతి): సోమశిల కండలేరు వరద కాలువ ప్రవాహంలో సోమవారం గల్లంతైన కేశమనేనిపల్లి ఎస్టీ కాలనీకి చెందిన చలంచర్ల శీనయ్య (35) మృతదేహాన్ని బుధవారం కండలేరు జలాశయం పాత దాచూరు సమీపంలో స్థానికులు గుర్తించారు. ఈమేరకు పోలీసులు కేసు నమోదు చేసి మృతదేహాన్ని పోస్టు మార్టమ్‌కు పంపి దర్యాప్తు చేస్తున్నారు. మృతుడికి భార్య, ముగ్గురు పిల్లలు ఉన్నారు.

చికెన్ ధరలు

నెల్లూరు పౌల్ట్రీ అసోసియేషన్

	కిలో (రూ.లలో)
బాయిలర్ లైవ్	117
స్కిన్ చికెన్	214
స్కిన్‌లెస్	236
కోడిగుడ్ల ధర (100): 560	

ఈవీఎం గోదాముల వద్ద పటిష్ట భద్రత ఉండాలి : కలెక్టర్

నెల్లూరు(వెంకటేశ్వరపురం), సెప్టెంబరు 24 (ఆంధ్రజ్యోతి) : ఈవీఎం గోదాముల వద్ద పటిష్ట భద్రతా చర్యలు చేపట్టాలని, భారత ఎన్నికల సంఘం మార్గదర్శకాలను కచ్చితంగా అమలు చేయాలని కలెక్టర్ హిమాన్షు శుక్లా అధికారులను ఆదేశించారు. నెల్లూరు ఆర్డీవో కార్యాలయ ప్రాంగణంలోని ఈవీఎం గోదాములను పలు రాజకీయ పార్టీల నాయకులతో కలిసి ఆయన బుధవారం ఉదయం తనిఖీ చేశారు. గోదాములో అగ్నిమాపక పరికరాలు, సీసీ కెమెరాలు సక్రమంగా ఉండేలా చూసుకోవాలన్నారు. కార్యక్రమంలో ఆర్డీవో అనూష, ఏవో నిర్మలానంద బాబా, అర్బన్ తహసీల్దారు షఫీమాలిక్, డీటీలు అషర్, అశోక్ పాల్గొన్నారు.



జేసీని కలిసిన వీఆర్వో సంఘ నాయకులు

నెల్లూరు(హరనాథపురం), సెప్టెంబరు 24 (ఆంధ్రజ్యోతి) : ఇటీవల బాధ్యతలు చేపట్టిన జాయింట్ కలెక్టర్ వెంకటేశ్వర్లును జిల్లా గ్రామ రెవెన్యూ అధికారుల సంఘ నాయకులు బుధవారం మర్యాద పూర్వకంగా కలిసి శుభాకాంక్షలు తెలిపారు. ఈ కార్యక్రమంలో ఆ సంఘం జిల్లా అధ్యక్షుడు పంట అశోక్‌కుమార్‌రెడ్డి, కార్యదర్శి దారా రమణయ్య, మొగళ్లూరు నాగేశ్వరరావు, రవిశేఖర్, రాజేశ్వరి తదితరులు పాల్గొన్నారు.

టీచర్లకిచ్చిన హామీలు నెరవేర్చాలి

నెల్లూరు(విద్య), సెప్టెంబరు 24 (ఆంధ్రజ్యోతి) : ప్రభుత్వ ఉపాధ్యాయులకు రాష్ట్ర ప్రభుత్వం ఇచ్చిన హామీలను వెంటనే నెరవేర్చాలని జిల్లా నోబెల్ టీచర్స్ అసోసియేషన్ అధ్యక్షకార్యదర్శులు నాటకం తిరుమలయ్య, సీహెచ్ చెన్నయ్య ఓ ప్రకటనలో కోరారు. గత వైసీపీ ప్రభుత్వంలో అవమానాలకు గురైన ఉపాధ్యాయులు కొత్త ప్రభుత్వంలో కూడా ఇబ్బందులు ఎదుర్కొనడం బాధాకరమన్నారు. ఇప్పటికైనా ఇచ్చిన హామీల్లో భాగంగా పెండింగ్‌లో ఉన్న నాలుగు విడతల కరువుభత్యాన్ని, మూడేళ్లుగా విడుదలకాని సంపాదిత సెలవుల నగదును వెంటనే విడుదల చేయాలని డిమాండ్ చేశారు. మధ్యంతర భృతి కనీసం 25శాతంకు తగ్గకుండా ప్రకటించాలని, పీఎఫ్ రుణాలివ్వాలని కోరారు.

ఆలయాల విశిష్టతపై ప్రధానికి త్వరలో నివేదిక

● అభ్యుదయ సేవా సంస్థ నిర్వాహకుడు నందకిషోర్‌రెడ్డి

నెల్లూరు (సాంస్కృతికం), సెప్టెంబరు 24 (ఆంధ్రజ్యోతి) : దేశంలో 4500 పురాతన ఆలయాలు ఉన్నాయని, వాటి విశిష్టతపై ప్రధాని నరేంద్ర మోదీకి త్వరలో నివేదిక ఇస్తానని అభ్యుదయ సేవా సంస్థ నిర్వాహకుడు నందకిషోర్‌రెడ్డి తెలిపారు. నగరంలోని మాగుంట లేఅవుట్‌లో బుధవారం ఆయన విలేకరులతో మాట్లాడారు. పురాతన ఆలయాల విశిష్టత నేటి సమాజానికి తెలియపరచాలనే ఉద్దేశంతో మూడేళ్లుగా దేశంలో విస్తృతంగా పర్యటిస్తున్నానని చెప్పారు. ఈ కార్యక్రమంలో రాజశేఖర్‌రెడ్డి, విశ్రాంత ఎయిర్‌ఫోర్స్ ఉద్యోగి కృష్ణారెడ్డి, తదితరులు పాల్గొన్నారు.



మూలస్థానేశ్వర ఆలయంలో ప్రాకారోత్సవం







వీరబ్రహ్మేంద్రస్వామి ఆలయంలో గాయత్రి అలంకారం, రాజరాజేశ్వరి అమ్మవారి ఆలయంలో చిన్నారికి బాలపూజ, భక్తుల రద్దీ

జగన్మాతా స్మరామి!

వైభవంగా శరన్నవరాత్రులు
ఆలయాల్లో భక్తుల రద్దీ
ఆకట్టుకున్న సాంస్కృతిక కార్యక్రమాలు

నెల్లూరు (సాంస్కృతికం), సెప్టెంబరు 24 (ఆంధ్రజ్యోతి) : నగరంలో దేవీ నవరాత్రి ఉత్సవాలు అంబరాన్ని అంటుతున్నాయి. బుధవారం రాజరాజేశ్వరి అమ్మవారు గాయత్రి అలంకారంలో దర్శనమిచ్చారు. ఉదయం విశేష నవావరణ పూజ, లలితా కుంకుమార్చన, మహాన్యాసం, చండీ హోమం జరిగాయి. చిన్నారులకు బాలపూజ చేశారు.

● స్టోన్‌హౌస్‌పేటలోని కన్యకా పరమేశ్వరి అమ్మవారు బాలాత్రిపుర సుందరి అలంకాంలో దర్శనమిచ్చారు. ఉదయం శ్రీసూక్త సహిత అభిషేకం, సహస్ర నామార్చన, త్రిశతి, ఖడ్గమాల, సప్తశతి పారాయణ జరిగాయి. సాయంత్రం ఉత్సవమూర్తులకు నవదుర్గా అలంకారం, మూలవర్లకు చందనాలంకారం జరిగాయి. కన్యకా పరమేశ్వరికి సహస్ర దీపాలంకరణ కనువిందు చేసింది. ఉభయకర్తలుగా షణ్ముఖ బ్రోకర్స్ అధినేతలు షేగు షణ్ముఖరావు, వాణీ, మహేంద్రకుమార్, రాజ్యలక్ష్మి వ్యవహరించారు.

● మూలస్థానేశ్వరస్వామి ఆలయంలో భువనేశ్వరి అమ్మవారికి భువనే శ్వరి అలంకారం జరిగింది. స్వామికి మహాన్యాస పూర్వక రుద్రాభిషేకాలు, భువనేశ్వరికి విశేష నవావరణ పూజ, పూలంగిసేవ, చండీహోమం జరిగాయి. సాంస్కృతిక కార్యక్రమాలు అలరించాయి.

● గ్రామదేవత ఇరుకళల పరమేశ్వరి గజలక్ష్మీగా భక్తుల పూజలు అందుకున్నారు. ఉదయం అభిషేకాలు, ఖడ్గమాల పూజలు, సాయంత్రం పూలంగిసేవ, రాత్రి సామూహిక కుంకుమార్చన, పల్లకీ ఉత్సవం కన్నుల పండువగా జరిగాయి.

● మూలాపేట శ్రీకృష్ణధర్మరాజస్వామి ఆలయంలో ద్రౌపదీదేవి కాళికగా భక్తులకు దర్శనమిచ్చారు. అభిషేకాలు, విశేష పూజలు జరిగాయి.

● మూలాపేట, నవాబుపేట, ఫత్తేఖాన్‌పేట, టెక్కేమిట్టలోని మహాలక్ష్మి ఆలయాల్లో అమ్మవార్లు వివిధ అలంకారాలలో భక్తులకు దర్శనమిచ్చారు. నవావరణ, కుంకుమ పూజలు, పల్లకీసేవ జరిగాయి.

● పప్పులవీధి సిద్ధివిఘ్నేశ్వర ఆలయంలో ధనలక్ష్మిగా కాత్యాయినీ అమ్మవారు దర్శనమిచ్చారు. నిత్యపూజలు, రుద్రాభిషేకాలు జరిగాయి.

● వీరబ్రహ్మేంద్రస్వామి ఆలయంలో అమ్మవారికి గాయత్రి అలంకరణ జరిగింది. ఉదయం విశేష పూజలు, హోమాలు చేశారు.

● నవాబుపేట శ్రీకృష్ణధర్మరాజస్వామి ఆలయంలో ద్రౌపదీదేవికి అన్నపూర్ణాదేవి అలంకారం కన్నుల పండువగా జరిగింది. అభిషేకాలు, హోమాలు, పూలంగిసేవ జరిగాయి.

● ఉస్మాన్‌సాహెబ్‌పేట కోదండరామపురంలోని మహాలక్ష్మి ఆలయంలో అన్నపూర్ణదేవి అలంకారం కన్నుల పండువగా జరిగింది. ఉదయం అభిషేకాలు, విశేష పూజలు, కుంకుమ పూజ జరిగాయి.

● బాబూగిరిజన కాలనీలోని మహాలక్ష్మి ఆలయంలో అభిషేకాలు, పూజలు, పూలంగిసేవ జరిగాయి.

● అయ్యప్పగుడి గురువాయురప్పన్ మహావిష్ణు ఆలయంలో ఆదిలక్ష్మికి గాయత్రిదేవి అలంకరణ జరిగింది. అభిషేకాలు, పూజలు, అర్చనలు, పూలంగిసేవ జరిగాయి.

● బాలాజీనగర్ సీతారామమందిరంలో సీతాదేవి ధనలక్ష్మి అలంకారం జరిగింది. అభిషేకం, ధనలక్ష్మీ హోమం, సామూహిక కుంకుమపూజ, అష్టలక్ష్మీ పూజ వైభవంగా జరిగాయి.

● పప్పులవీధి మహాలక్ష్మి ఆలయంలో రాజరాజేశ్వరి దేవీ అలంకారం జరిగింది. శ్రీచక్ర మహామేరుకు పంచామృతాభిషేకాలు, విశేష పూజలు జరిగాయి.

● వేదగిరిలో ధైర్యలక్ష్మిగా ఆదిలక్ష్మి

నెల్లూరు రూరల్, సెప్టెంబరు 24 (ఆంధ్రజ్యోతి) : దసర వేడుకల్లో భాగంగా వేదగిరి క్షేత్రంలో బుధవారం ఆదిలక్ష్మి అమ్మవారు ధైర్యలక్ష్మి అవతారంలో భక్తులకు దర్శనమిచ్చారు. ఈ సందర్భంగా అభిషేకాలు, ప్రత్యేక పూజలు జరిగాయి ఈవో గోపి, ప్రధాన అర్చకుడు భాస్కరాచార్యులు పర్యవేక్షించారు.



కన్యకాపరమేశ్వరి ఆలయంలో కోలాటం ఆడుతున్న మహిళలు



రాజరాజేశ్వరి ఆలయంలో సాంస్కృతిక ప్రదర్శన

అన్నదానానికి రూ.10వేల విరాళం

నెల్లూరు (సాంస్కృతికం), సెప్టెంబరు 24 (ఆంధ్రజ్యోతి) : నగరంలోని ఇరుకళల పరమేశ్వరి అమ్మవారి ఆలయంలో నిత్య అన్నదాన పథకానికి బుధవారం మిరియాల గౌరీశంకర్ అనే భక్తుడు రూ.10వేలు విరాళం అందజేశారు. ఆయనకు ఈవో గిరికృష్ణ ఆలయ మర్యాదలు చేశారు.

ఎన్‌సీసీ కేడెట్స్‌కు ప్రత్యేక శిక్షణ

నెల్లూరు(విద్య), సెప్టెంబరు 24 (ఆంధ్రజ్యోతి) : 24వ ఆంధ్రా బెటాలియన్ కమాండింగ్ ఆఫీసర్ కల్నల్ కరంచంద్ పర్యవేక్షణలో నెల్లూరు, ఒంగోలు జిల్లాలకు చెందిన 500 మంది ఎన్‌సీసీ కేడెట్స్‌కు నగరంలోని రెయిన్‌బో సీబీఎస్‌ఈ పాఠశాలలో పదిరోజుల ప్రత్యేక శిక్షణను బుధవారం ప్రారంభించారు. కల్నల్ మాట్లాడుతూ కేడెట్స్ అందరూ క్రమ శిక్షణతో తర్ఫీదు పొందాలని సూచించారు. దేశ సమైక్యత, సమగ్రతను కాపాడడంలో కీలకంగా వ్యవహరించేలా శిక్షణ ఉంటుందని చెప్పారు. అధికారులు శిక్షణను విజయవతంగా పూర్తి చేసి ఉత్తమ కేడెట్స్‌ను సిద్ధం చేయాలని ఆదేశించారు. ఈ కార్యక్రమంలో సుబేదార్ హేమంత్‌కుమార్, ట్రైనింగ్ ఆఫీసర్స్ సమాల్, రాజ్‌పాల్, ఎన్‌సీసీ అధికారులు మస్తాన్‌వలీ, శ్రీపతి ప్రసాద్, జయరామ్, జావీద్ బాషా, దీప్తి, సౌజన్య, సిబ్బంది పాల్గొన్నారు.



శిక్షణకు హాజరైన కేడెట్స్

పారిశుధ్య కార్మికులకు వైద్య పరీక్షలు

నెల్లూరు(సిటీ), సెప్టెంబరు 24 (ఆంధ్రజ్యోతి) : నగరంలోని అర్బన్ హెల్త్ సెంటర్లలో బుధవారం పారిశుధ్య కార్మికులందరికీ ఆరోగ్య పరీక్షలు నిర్వహించారు. స్వచ్ఛతహీ సేవ కార్యక్రమాల్లో భాగంగా వైద్య పరీక్షలు జరిపినట్లు కమిషనర్ నందన్, ఎంహెచ్‌వో కనకాద్రి తెలిపారు. ఆరోగ్య కేంద్రాల్లో జరుగుతున్న వైద్య శిబిరాలను పరిశీలించి మాట్లాడారు. పారిశుధ్య విభాగంలో పని చేస్తున్న కార్మికులందరికీ పరీక్షలు చేసి ఉచితంగా మందులు, ఆహారం అందించామని చెప్పారు. అనంతరం కార్పొరేషన్‌లో శిక్షణ పూర్తయిన సచివాలయాల్లోని ఎన్విరాన్మెంట్ సెక్రటరీలు, ఎమినిటీస్ సెక్రటరీలకు జ్ఞాపికలు అందచేశారు. ముందుగా ట్రంకురోడ్డులో పారిశుధ్య పనులను ఆకస్మికంగా తనిఖీ చేశారు.



డీకేడబ్ల్యూ కళాశాలలో ఎన్‌ఎస్‌ఎస్ దినోత్సవం

నెల్లూరు(విద్య), సెప్టెంబరు 24 (ఆంధ్రజ్యోతి) : నగరంలోని డీకే ప్రభుత్వ మహిళా డిగ్రీ కళాశాలలో బుధవారం ఎన్‌ఎస్‌ఎస్ దినోత్సవం నిర్వహించారు. వైస్ ప్రిన్సిపాల్ ఏవీ రమణరావు మాట్లాడుతూ ఎన్ ఎస్‌ఎస్ ద్వారా జిల్లాలో అనేక గ్రామాల్లో సేవా కార్యక్రమాలు నిర్వహిస్తున్నార న్నారు. ఇదే దృక్పథంతో మున్ముందు మరిన్ని సేవా కార్యక్రమాలు చేపట్టాలని తెలిపారు. రామచంద్రారెడ్డి ఆసుపత్రి వైద్యుడు రాజేశ్వరరావు మాట్లాడుతూ గ్రామీణ ప్రాంతాల్లో జరిగే కార్యక్రమాల్లో నిరక్ష్యరాస్యులైన వారికి ఆరోగ్య జాగ్రత్తలు గురించి తెలియచేసి వారిని అప్రమత్తంగా చేయాలని సూచించారు. అనంతరం విద్యార్థుల కు పోటీలు నిర్వహించి బహుమతులు అందచేశారు. ఈ కార్యక్రమంలో ఎన్ ఎస్‌ఎస్ ప్రోగ్రాం ఆఫీసర్లు డాక్టర్ కేవీ సత్యనారాయణ, కన్యాకుమారి, తమన్న, అధ్యాపకులు, సిబ్బంది పాల్గొన్నారు. కాగా, డీకేడబ్ల్యూ జూనియర్ కళాశాలలో కూడా ఎన్‌ఎస్‌ఎస్ కార్యక్రమం నిర్వహించారు. వీఎస్‌యూ కోఆర్డినేటర్ డాక్టర్ ఏ ఉదయ్‌శంకర్ మాట్లాడుతూ విద్యార్థులు సమాజ సేవలో కూడా భాగస్వాములు కావాలని పిలుపునిచ్చారు. అనంతరం పలు సేవా కార్యక్రమాలపై అవగాహన కల్పించారు. సమాజసేవ ప్రతిజ్ఞ చేయించి ఎన్‌ఎస్‌ఎస్‌లో ఉత్తమ సేవలందించిన వారికి బహుమతులు అందచేశారు. ఈ కార్యక్రమంలో ఎన్‌వైకే కోఆర్డినేటర్ మహేంద్రరెడ్డి, అడిషనల్ డీఎంహెచ్‌వో ఖాదర్‌వలి, పూర్వ విద్యార్థుల సంఘం ప్రతినిధి డాక్టర్ కుసుమకుమారి, ప్రిన్సిపాల్ డాక్టర్ ఎం రమణారెడ్డి, వైస్ ప్రిన్సిపాల్ కొండయ్య, ఎన్‌ఎస్‌ఎస్ ప్రోగ్రాం ఆఫీసర్లు ప్రసన్న, శివయ్య, భారతి, కృష్ణతులసి తదితరులు పాల్గొన్నారు.



క్విజ్ విజేతలకు బహుమతులు అందచేస్తున్న డాక్టర్ రాజేశ్వరరావు


పెన్నానది పరిసరాల్లో వ్యర్థాల తొలగింపు

నెల్లూరు(విద్య), సెప్టెంబరు 24 (ఆంధ్రజ్యోతి) : ప్రపంచ నదుల దినోత్సవాన్ని పురస్కరించుకుని 10 ఆంధ్ర నేవల్ యూనిట్స్ లెఫ్టినెంట్ కమాండర్ గణేష్ ఆదేశాల మేరకు నగరంలోని వెంగళరావు నగర్ మునిసిపల్ ఉన్నత పాఠశాల కేడెట్స్ బుధవారం రంగనాయకుల పేట సమీపంలోని పెన్నానది పరిసరాలను శుభ్రపరిచారు. పెన్నానదిరోడ్డు, బ్రిడ్జి, తిక్కనపార్కు, రైలువంతెన తదితర ప్రాంతాల్లోని వ్యర్థాలను తొలగించారు. ఎన్‌సీసీ సెకండ్ ఆఫీసర్ గుండాల నరేంద్రబాబు, దీపక్‌కుమార్ తదితరులు పాల్గొన్నారు.



పెన్నా నది పరిసర ప్రాంతంలో వ్యర్థాలు సేకరిసున్న ఎన్‌సీసీ క్యాడెట్లు





డీఆర్వోకు నూర్‌బాషా సంఘం నాయకుల వినతి

నెల్లూరు(హరనాథపురం), సెప్టెంబరు 24 (ఆంధ్రజ్యోతి): నూర్‌బాషా దూదేకుల బీసీ సంక్షేమ సంఘం భవన నిర్మాణానికి స్థలం కేటాయించాలని కోరుతూ డీఆర్వో విజయకుమార్‌కు బుధవారం ఆ సంఘ నాయకులు వినతిపత్రం ఇచ్చారు. సంఘం జిల్లా అధ్యక్షుడు కే బాబర్ జాన్ మాట్లాడుతూ జిల్లాలో 60 వేల మంది దూదేకుల కులస్తులు ఉన్నారని, సభలు.. సమావేశాలు నిర్వహించుకోడానికి కమ్యూనిటీ హాల్ లేదన్నారు. వెంకటేశ్వరపురం భగత్‌సింగ్ కాలనీ దగ్గర ప్రభుత్వ స్థలాన్ని మంజూరు చేయాలని కోరారు. అనంతరం ఇదే విషయమై కార్పొరేషన్ కమిషనర్ నందన్‌కు కూడా వినతిపత్రం ఇచ్చారు. కార్యక్రమంలో సంఘం జిల్లా ప్రధాన కార్యదర్శి కాజా మస్తాన్, కోశాధికారి సిని మాస్థాన్, ఉపాధ్యక్షుడు కాజా రహమతుల్లా పాల్గొన్నారు.

సీఎంను కలిసిన టీటీడీ సలహా మండలి చైర్మన్ సుమంత్‌రెడ్డి

నెల్లూరు(హరనాథపురం), సెప్టెంబరు 24(ఆంధ్రజ్యోతి) : తిరుమల-తి రుపతి దేవస్థానముల ఢిల్లీ లోకల్ అడ్వైజరీ కమిటీ చైర్మన్‌గా నియమితులైన జిల్లాకు చెందిన ఏడుగుండ్ల సుమంత్‌రెడ్డి బుధవారం విజయవాడలో ముఖ్యమంత్రి చంద్రబాబు నాయుడును మర్యాద పూర్వ కంగా కలిశారు. శ్రీవారికి సేవ చేసే భాగ్యం కల్పించినందుకు కృతజ్ఞతలు తెలిపారు. కోవూరు నియోజకవర్గం విడవలూరు మండలానికి చెందిన సుమంత్‌రెడ్డి మాజీ ముఖ్యమంత్రి నల్లారి కిరణ్‌కుమార్‌రెడ్డికి ముఖ్య అనుచరుడు. నెల్లూరు జిల్లా కోఆపరేటివ్ మార్కెటింగ్ సొసైటీ చైర్మన్‌గానూ పనిచేశారు.






రాపూరు : ధాన్యలక్ష్మిగా ఆదిలక్ష్మి అమ్మవారు


బుచ్చి రక్తబీజవధ అలంకారంలో కామాక్షితాయి


కావలి : శ్రీలలితాపరమేశ్వరి దేవి అలంకారంలో కలుగోళశాంభవి

దేవీ వైభవం


నెల్లూరు రూరల్ : ధైర్యలక్ష్మిగా ఆదిలక్ష్మి


నెల్లూరు : బాలా త్రిపుర సుందరిగా కన్యకాపరమేశ్వరి


నెల్లూరు : గజలక్ష్మిగా ఇరుకళల పరమేశ్వరి

భూ చోళ్లు!


ఎక్స్‌కవేటర్‌తో చెట్లను తొలగిస్తున్న అక్రమార్కులు

- ప్రభుత్వ భూమి కనిపిస్తే కబ్జానే!
- వర్షాకాలం వస్తే మరింత ఎక్కువగా..
- తాజాగా 40 ఎకరాల ఆక్రమణ
- అధికారులకు తెలిసినా పట్టించుకోని వైనం

మర్రిపాడు, సెప్టెంబరు 24 (ఆంధ్రజ్యోతి) : ఇటీవల వర్షాలు పడిన వారం, పది రోజుల వ్యవధిలో మర్రిపాడు మండలం పడమటినాయుడుపల్లి రెవెన్యూలో 30 ఎకరాలు, చుంచులూరు రెవెన్యూ పరిధిలోని నకరేకల్ ఏర్వేడుపల్లి జాతీయరహదారికి దగ్గరలో 10 ఎకరాలు, గాగినేనిగుంట రెవెన్యూ పరిధిలో 25 ఎకరాల ప్రభుత్వ భూములను అక్రమార్కులు దున్ని స్వాధీనపరుచుకున్నారు. రైతులు పొలాలకు వెళ్లేందుకు దారిని కూడా వదలకుండా ఆక్రమించిన పరిస్థితి నెలకొంది.

● హెచ్చరించి వదిలేస్తున్నందునే...

ప్రభుత్వ భూముల ఆక్రమణ సమయంలో అధికారులకు ఫిర్యాదులు వస్తే ఆక్రమణదారులను హెచ్చరించి వదిలేస్తున్నారు. దీంతో వారు తిరిగి కొన్ని రోజులకు మిగతా పని పూర్తి చేసి ప్రభుత్వ భూములను ఎట్టకేలకు తమ స్వాధీనంలోకి తెచ్చుకుంటున్నారు. ఇలా మండలంలో వేలాది ఎకరాల ప్రభుత్వ భూమిని అగ్రవర్ణాలకు చెందిన వారే అధికంగా కబ్జా చేసినట్లు సమాచారం. దీంతో ఖాళీగా ఉన్న ప్రభుత్వ భూమి గ్రామాల్లో క్రమేణా తగ్గిపోతోంది. మిగిలిన ఆ కొద్ది భూమి కోసం ఇద్దరు ముగ్గురు నిత్యం కొట్లాడుకుంటుండటంతో పోలీస్ స్టేషన్‌కు భూ తగాదాల కేసులే అధికంగా వస్తున్నాయి. ఇటీవల సింగనపల్లి రెవెన్యూ పరిధిలోలో ఓ ప్రభుత్వ భూమి ఆక్రమణ విషయంలో నేను ముందు.. అంటే నేను ముందంటూ ఇరు వర్గాలు ఘర్షణ పడగా, కొంతమంది తలలు పగిలి, చేతులు విరిగిన సంఘటనలు వేరు వేరు చోట్ల రెండు పర్యాయాలు చోటు చేసుకున్నాయి. మరో భూమిలో జామాయిల్ మొక్కలు నాటిన చెట్లను వేరొకరు కోసేయటంతో పంచాయితీ పోలీస్ స్టేషన్‌కు చేరింది. భీమవరంలో ఒకే భూమి కోసం రెండు వర్గాలు ఘర్షణ పడుతున్న పరిస్థితి మరో మూడు చోట్ల నెలకొంది.

● సీసీ కెమెరాలతో పర్యవేక్షణ

పొంగూరు రెవెన్యూ పరిధిలో జాతీయ రహదారి పక్కనే ఉన్న ప్రభుత్వ భూమిని పట్టా భూమిగా కంప్యూటర్ అడంగల్‌లో నమోదు చేసుకోవటంతో దాని ధర కోట్ల రూపాయలకు పెరిగింది. ఆ భూమిలో జామాయిల్ మొక్కలు నాటే క్రమంలో గ్రామంలో గొడవలు జరిగాయి. దీనికి కాస్త రాజకీయం తోడు కావడంతో ఎట్టకేలకు జామాయిల్ మొక్కలు నాటి అందులో సీసీ కెమెరాలతో నిత్యం పర్యవేక్షిస్తున్నారు. అదే రెవెన్యూ పరిధిలో వైసీపీ నేత రాత్రికి రాత్రే మిషన్ ద్వారా డ్రిల్ వేసి ఫెన్సింగ్ రాళ్లు నాటారు. ఉదయం ఇతర ప్రాంతాల నుండి మహిళా రౌడీ మూకలను తీసుకొచ్చి భూమి దున్నుతుండగా స్థానికుల ఫిర్యాదుతో ఆ నేతపై పోలీస్ స్టేషన్‌లో కేసు నమోదయింది. పెగళ్లపాడులో ఇటీవల 100 ఎకరాలు, ఇర్లపాడు రెవెన్యూ పరిధిలో సుమారు 15 ఎకరాలు అక్రమణకు గురైంది. అల్లంపాడు రెవెన్యూ పరిధిలో నెల్లూరు- ముంబాయి జాతీయ రహదారికి దగ్గర్లో సుమారు 200 ఎకరాల భూమిని గత వైసీపీ ప్రభుత్వంలో ఆ పార్టీ నేతలు ఆక్రమించి తమ స్వాధీనంలో ఉంచుకున్నారు. టీడీపీ అధికారంలోకి వచ్చిన వెంటనే రెండు నెలల కాలంలో ఆ మొత్తం భూమిలో ఆగమేఘాల మీద జామాయిల్ మొక్కలు నాటి ధీమాగా ఉన్నారు. ఇలా వేలాది ఎకరాల ప్రభుత్వ భూమి ఆక్రమణకు గురైంది. విడతల వారీగా పేదలకు భూ పంపిణీ చే యాలంటే ఇక్కడ సెంటు ప్రభుత్వ భూమి కూడా దొరికే పరిస్థితి కనిపించటంలేదు.

వృద్ధులు, పురుషుల కోసం సర్వీసులు పెంచండి

డయల్ యువర్ డీఎంలో ఓ ప్రయాణికుడు

నెల్లూరు(స్టోన్‌హౌస్‌పేట), సెప్టెంబరు 24 (ఆంధ్రజ్యోతి): స్త్రీశక్తి పథకం అమలయ్యాక మగవారికి, వృద్ధులకు బస్సుల్లో సీట్లు సరిపోవడం లేదని, నెల్లూరు-పామూరు రూటులో ప్రస్తుతం నడుపుతున్న సర్వీసులకు అదనంగా బస్సులు నడపాలని నెల్లూరుకి చెందిన సునీల్‌కుమార్ కోరారు. నెల్లూరు-1వ డిపోలో బుధవారం డయల్ యువర్ డీఎం నిర్వహించారు. ఈ కార్యక్రమానికి ఎనిమిది మంది ప్రయాణికులు ఫోన్ చేసి సమస్యలు తెలిపారు. స్పందించిన డీఎం వెంకటేశ్వర్లు ఉన్నతాధికారుల దృష్టికి తీసుకెళ్లి సమస్యలు పరిష్కరిస్తామని హామీ ఇచ్చారు.

● వారు ప్రస్తావించిన సమస్యలు..

- ఏటూరు నుంచి మెయిన్ రోడ్డుకు బస్సు సౌకర్యం కల్పించాలని సుజాత అనే ప్రయాణికురాలు కోరారు.
- పీఎస్ఆర్ బస్టాండు బుచ్చి బస్సులు నిలుపు ప్రదేశంలో బస్‌షెల్టర్ నిర్మించాలని కోవూరుకు చెందిన కే. శ్రీనివాసులు కోరారు.
- నెల్లూరు నుంచి పొదలకూరుకు పల్లెవెలుగు బస్సు సౌకర్యం కల్పించాలని పొదలకూరుకి చెందిన నారాయణ కోరారు.
- ముద్దమూడికి సాయంత్రం 5.15 నిమిషాల తర్వాత అదనపు ట్రిప్పు వేయాలని ముద్దమూడికి చెందిన ఏడుకొండలు కోరారు.
- నార్త్‌రాజుపాలెం గుండా ఎక్స్‌ప్రెస్ బస్సులు నడపాలని నార్త్‌రాజుపాలెంకు చెందిన ఆరిఫ్ కోరారు.
- సంగం లోపలికి బస్సులు రావడం లేదని కరీం ఫిర్యాదు చేశారు.
- సంగం నుంచి చేజర్లకు బస్సు సౌకర్యం కల్పించాలని జీ. హరిబాబు కోరారు.

ఉయ్యాలపల్లిలో ఇద్దరు పిల్లల అదృశ్యం

● ఆచూకీ కోసం గాలిస్తున్నగ్రామస్థులు ● పోలీసులకు సమాచారం


విఘువర్ధన్


నవశ్రావణ్

కలువాయి, సెప్టెంబరు 24(ఆంధ్రజ్యోతి): మండలంలోని ఉయ్యాలపల్లికి చెందిన ఇద్దరు పిల్లలు బుధవారం మధ్యాహ్నం నుంచి కనిపించడం లేదు. వారి ఆచూకీ కోసం గ్రామస్థులంతా కలసి ఊరు పరిసరాల్లోని కాలువలు, చెరువులు, అటవీ ప్రాంతంలో రాత్రి వరకు గాలించారు. గ్రామస్థుల సమాచారం మేరకు...ఉయ్యాలపల్లికి చెందిన నూటేటి విఘువర్ధన్(9) కలువాయిలోని ఓ ప్రైవేటు పాఠశాలలో 5వ తరగతి చదువుతున్నాడు. మనుబోటి నవశ్రావణ్ (12) గ్రామంలోని ప్రభుత్వ పాఠశాలలోనే 6వ తరగతి చదువుతున్నాడు. దసరా సెలవులు కావడంతో ఇద్దరు కలసి మధ్యాహ్నం వరకు గ్రామంలోనే ఆడుకుంటూ ఉన్నారు. ఊరికి సమీపంలోని చెరువు నుంచి టిప్పర్లతో లోని మట్టి తోలుతున్నారు. వీరిద్దరు మట్టి కోసం వెళుతున్న టిప్పరులో ఎక్కి చెరువు వద్దకు వెళ్లారు. కొద్ది సేపటి తరువాత పిల్లలు కోసం వారి తల్లిదండ్రులు చెరువు వద్ద వారిని అడగా ఇక్కడ లేరని చెప్పడంతో తల్లిదండ్రులు ఆందోళనకు గురయ్యారు. ఇంటికి రాకుండా చెరువు వద్ద కూడా లేకుండా ఎక్కడి పోయారని గ్రామస్థులు సుమారు 100 మంది కలసి రాత్రి పొద్దుపోయేవరకు సమీప ప్రాంతాల్లో వారి ఆచూకీ కోసం గాలించారు. కానీ ఆచూకీ తెలియలేదు. ఈ విషయమై పోలీసులకు కూడా సమాచారం ఇచ్చినట్లు వారు తెలిపారు.

నేడు ప్రపంచ ఫార్మసిస్టుల దినోత్సవం

వ్యాధుల నివారణలో కీలకం!

- వారు లేకుండా ఔషధ దుకాణాల్లేవు
- అనుమతులు లేకుండానే కొన్ని మందులషాపులు
- వైద్యులు రాసే మందుల్లో కంపెనీలదే అగ్రస్థానం
- సమస్యలు పరిష్కరించాలంటున్న ఫార్మసిస్టులు

నెల్లూరు (వైద్యం), సెప్టెంబరు 24 (ఆంధ్రజ్యోతి): వ్యాధులు న యం చేయటంలో ఫార్మసిస్టులదే కీలక పాత్ర. ఏమాత్రం పొరపాటుగా వారు మందులు పంపిణీ చేసినా, వాటి ని వైద్యులు గమనించక పోయినా వ్యాధి గ్రస్థులు తీవ్ర అనారోగ్యానికి గురికావాల్సిందే. అయితే వైద్యు లు రాసే ప్రిస్క్రిప్షన్ ఎంతో కీలకం. వైద్యులు రాసే మందులు వారికి మాత్రమే అర్థమవుతాయి. దీ నికి ఇందుకు అనుగుణంగా వారు మందులు ఇస్తుంటారు.ఈ నేపథ్యంలో 2009లో ఏర్పాటయిన ఫెడరేషన్ ఇంటర్నేషనల్ ఫార్మాస్యూటికల్స్ నిర్వాహకులు ఏటా సెప్టెంబరు 25న (నేడు) ప్రపంచ ఫార్మాసిస్టుల దినోత్సవాన్ని జరుపుకుంటా రు. ప్ర పంచ వ్యాప్తంగా రోగులకు మెరుగైన వైద్యం అందించాలన్నదే వారి నినాదం.

● డబ్బుకు ఆశపడి..

కొందరు వైద్యులు ఎక్కువగా డబ్బు అందించే కంపెనీలకే ప్రాధాన్యత ఇస్తూ, రోగి పేదరికాన్ని పరిగణలోకి తీసుకోవటం లేదన్న వాదన ఫార్మసిస్టుల నుంచి వినిపిస్తుంది. ఉదాహరణకు జ్వరానికి వినియోగించే పారాసెటమల్ మందులు రాయకుండా, డోలో వంటి వాటికే ప్రాధాన్యత ఇస్తున్నారని వారు చెబుతున్నారు. కాగా పలు రకాల నకిలీ మందులు తయారు చేసే వారు ఎక్కువగా ఉన్నారని ఫార్మసిస్టులు అంటున్నారు. ఏమాత్రం పనిచేయని ఊరు పేరు లేని మందుల కంపెనీలు ఇబ్బడిముబ్బడిగా వచ్చాయని, అవి తయారు చేసే మందులు వ్యాధులు తగ్గించక పోగా కొత్త రోగాలు వచ్చే అవకాశం ఉందంటున్నారు.



●కరోనాలోనూ కీలకం

2020 నుంచి 2022 వరకు జిల్లాలో 1.66 లక్షల మంది కరోనాకు గురయ్యారు. వారు కోలుకునేందుకు ఫార్మసిస్టులు అందించిన మందులే కీలకంగా మారాయి. రోగులు త్వరితగతిన కోలుకునేందుకు వారు చేసిన కృషి ఎంతో ఉంది. కరోనా చికిత్సకు వినియోగించే అత్యవసర రెమిడీసీవర్ ఇంజక్షన్లు, కరోనా మందుల కిట్లు, యాంపోటెరిసిన్ ఇంజక్షన్లు, పోసకొనజాల్ ఇంజక్షన్లు సైతం అందుబాటులో ఉండేందుకు వారు ఎంతో కృషి చేశారు.

● ఫార్మసిస్టులు లేకుండా...

జిల్లాలో 2500లకుపైగా మందులు దుకాణాలు ఉన్నాయి. ఆయా మందుల షాపు ల్లో తప్పనిసరిగా ఫార్మసిస్ట్ ఉండాలి. అ యితే చాలా వాటిల్లో వారు ఉండటం లేదు. కొందరైతే ఫార్మసిస్టుల ద్వారా మందుల షాపులకు అనుమతులు తీసుకుంటూ సొంతంగా నడుపుతున్నారు. గ్రామీణ ప్రాంతాల్లో పచారికొట్టులో కూడా మందులు అందుబాటులో ఉంటున్నాయి. వీటిని నిరోధానికి అధికారులు కృషి చేయటం లేదన్న విమర్శలు వినిపిస్తున్నాయి. ఇవి తీవ్ర అనారోగ్యానికి హేతువులవుతున్నాయి.

మాకూ సమస్యలు ఉన్నాయి



జిల్లాలోని ఫార్మాసిస్టులు పలు సమస్యలు ఎదుర్కొంటున్నారు. జిల్లా ప్రభుత్వ ఆసుపత్రిలో 130 మందికి పైగా పని చేస్తున్నారు. వీరిలో 90 మంది వరకు రెగ్యులర్ ఉద్యోగులే. అయితే మిగతా వారంతా కాంట్రాక్టు ఉద్యోగులే. వీరిని రెగ్యులర్ చేయాలని ఎప్పటి నుంచో డిమాండ్ చేస్తున్నాం.

- నరసింహులు, ఫార్మసిస్ట్ అసోసియేషన్ జిల్లా అధ్యక్షుడు

రోగులకు సహకారం



రోగులకు అన్నీ విధాలా సహకారం అందిస్తున్నాం. జిల్లాలో తమ అసోసియేషన్‌లో 2300 మంది వరకు సభ్యులు ఉన్నారు. వైద్యులు రాసిన మందుల కొరత లేకుండా చూస్తున్నాం. అయితే కొన్ని షాపుల వినియోగంలో ఫార్మసిస్టులు లేరన్న అపవాదు ఉంది. అనుమతి లేకుండా షాపులు నిర్వహిస్తే చర్యలు తీసుకోవాలి. అందుకు మా సహకారం ఉంటుంది.

- ప్రదీప్, జిల్లా కెమిస్ట్ అండ్ డ్రగ్గిస్ట్ అసోసియేషన్

జాతీయ యోగా పోటీలకు జడ్జిగా పద్మావతి



నెల్లూరు(విద్య), సెప్టెంబరు 24 (ఆంధ్రజ్యోతి) : విజయవాడలో ఈ నెల 28 నుంచి జరిగే ఆరో జాతీయ యోగా పోటీలకు నెల్లూరుకు చెందిన పద్మావతిని జడ్జిగా నియమిస్తూ యోగాసన భారత్ ఉపాధ్యక్షుడు, పోటీల చైర్మన్ డాక్టర్ సంజయ్ ఉత్తర్వులిచ్చారు. పంజాబ్‌లోని పాటియాలాలో జరిగిన జాతీయ స్థాయి న్యాయనిర్ణేతల రాత పరీక్షల్లో యోగా టీచర్ పద్మావతి ఉత్తీర్ణత సాధించడంతో ఆమెను జాతీయ పోటీలకు నియమించినట్లు తెలిపారు. జిల్లాలోని యోగా గురువులు, క్రీడాకారులు, యోగా అసోసియేషన్ ప్రతినిధులు పద్మావతికి అభినందనలు తెలిపారు.

రహదారిపై భారీ కొండచిలువ ప్రత్యక్షం


ప్రధాన రహదారిపై భారీ కొండ చిలువ

సీతారామపురం, సెప్టెంబరు 24 (ఆంధ్రజ్యోతి) : మండల కేంద్రంలోని బస్టాండ్ కూడలి సమీపంలో నుంచి డీజీ పేట వెళ్లే ప్రధాన రహదారిపై భారీ కొండచిలువ బుధవారం రాత్రి ప్రత్యక్షమైంది. దీంతో అటుగా వెళ్తున్న ప్రయాణికులు భయాందోళనకు గురయ్యారు. సుమారు 10 అడుగుల పొడవు ఉందని స్థానికులు తెలిపారు. కాగా, ప్రయాణికుల చప్పుడుతో పొదల్లోకి వెళ్లిపోయినట్లు తెలిపారు. సుమారు 15 నిమిషాల పాటు వాహనాలు నిలిచిపోయాయన్నారు.

దాడికి పాల్పడిన నలుగురు హిజ్రాల అరెస్టు

కందుకూరు, సెప్టెంబరు 24 (ఆంధ్రజ్యోతి): పట్టణంలోని హరిణి వైద్యశాలలో నర్సుపై దాడికి పాల్పడిన నలుగురు హిజ్రాలను అరెస్టు చేసినట్లు సీఐ అన్వర్‌బాషా తెలిపారు. బుధవారం రాత్రి ఆయన తన కార్యాలయంలో ఏర్పాటు చేసిన విలేకరుల సమావేశంలో మాట్లాడుతూ పట్టణంలోని ఉప్పుచెరువులో నివాసం ఉంటూ కందుకూరు పట్టణంలో దుకాణాలు, ఇతర సంస్థల వద్ద యాచన పేరుతో బలవంతం చేస్తున్న హిజ్రాలు మంగళవారం రాత్రి బస్టాండ్ సెంటర్‌లో ఉన్న ఆసుపత్రికి వెళ్లి చప్పట్లు కొడుతూ పెద్దగా కేకలు వేస్తూ డబ్బులు అడిగారు. ఆ సమయంలో డ్యూటీలో ఉన్న పుట్ట ఆదిలక్ష్మి అనే నర్సు డాక్టరు గారు లేరు, మీరు కేకలు వేయకండని హెచ్చరించిందని తెలిపారు. దీంతో రెచ్చిపోయిన వలేటి లావణ్య, బత్తుల పింకీ, బూదురు సౌజన్య, కందిపాటి విజయలక్ష్మి అనే హిజ్రాలు ఆమెపై దాడి చేసి దారుణంగా కొట్టారని, దీంతో చంపేస్తారని భయపడిపోయిన నర్సు ఆదిలక్ష్మి తన జేబులో ఉన్న రూ.2వేలు తీసి ఇచ్చిందని తెలిపారు. ఈ మొత్తం ఘటన సీసీ కెమెరాల్లో రికార్డు అయిందని, దీనిపై తక్షణమే విచారణ ప్రారంభించామని తెలిపారు.ఎస్పీ అజిత ఘటనను సీరియస్‌గా తీసుకుని తగు ఆదేశాలు జారీ చేయగా బుధవారం రాత్రి నలుగురిని అరెస్టు చేశామని తెలిపారు.

అరాచకాలను ఖండించిన వ్యాపారులు

కందుకూరు పట్టణంలో హిజ్రాల ఆగడాలపై కందుకూరులోని వ్యాపారులు బుధవారం ప్రత్యేక సమావేశం ఏర్పాటు చేసుకుని వారినుంచి విముక్తి కల్పించేలా పోలీసులు చర్యలు తీసుకోవాలని కోరుతూ తీర్మానించారు. స్థానిక పెద్దబజారులోని వాసవీ కన్యకా పరమేశ్వరి ఆలయంలో జరిగిన సమావేశంలో భిచ్చగాళ్లపై ఇకమీదట జాలి, దయ ఎవరూ చూపేదిలేదని వారిని భిక్షగాళ్లవలే చూడాలని తీర్మానించారు.

చెరువుల్లో యథేచ్ఛగా మట్టి అక్రమ తవ్వకాలు

● నామమాత్రపు రుసుంతో దోపిడీ ● పట్టించుకోని అధికారులు


చెరువులో అక్రమంగా మట్టి తవ్వి ట్రాక్టర్లకు లోడ్ చేస్తున్న ఎక్స్‌కవేటర్

కలిగిరి, సెప్టెంబరు 24 (ఆంధ్రజ్యోతి): అక్రమ మట్టి తవ్వకాలు రేయింబవళ్లు యథేచ్ఛగా జరుగుతున్నా అధికారులు ఏ మాత్రం పట్టించుకోవడం లేదు. ముఖ్యంగా ఆదివా రం, ఇతర సెలవు దినాలు వస్తే చాలు మట్టి తవ్వకాలతో పెట్రేగిపోతున్నారు. ఎక్స్‌కవేటర్లు తీసుకెళ్లి చెరువులను కుళ్ల బొడిచేస్తున్నారు. పదుల సంఖ్యలో ట్రాక్టర్లతో వందల ట్రిప్పుల మట్టిని అక్రమంగా తరలిస్తున్నారు. సంబంధిత అధికారులను మామూళ్లతో కట్టిపడేసి సాగుతున్న మట్టిదందాకు దళారులు తోడవుతున్నారు. వారే ఎవరికి మట్టి అవసరమో గుర్తించి వారితో బేరసారాలకు దిగుతున్నారు. ముఖ్యంగా మండలంలోని కలిగిరి, నాగసముద్రం, వీరనకొల్లు, వెలగపాడు పంచాయతీల పరిధిలో ఈ అక్రమ మట్టితోలకాలు ఎక్కువగా సాగుతున్నాయి. చెరువుల్లో ప్రజల అవసరాల పేరుతో దళారులు మట్టి తోలకాలను అధికారులకు నామమాత్రపు రుసుం చెల్లించి వందల కొద్ది ట్రాక్టర్లతో మట్టిని తరలిస్తూ వ్యాపారాలు చేస్తూ ధ నార్జనకు పాల్పడుతున్నారు. ఇష్టానుసారంగా చెరువులు తవ్వేస్తుండంతో చెరువుల వద్ద గుంతలు ఏర్పడి ప్రమాదాలు జరుగుతాయని స్థానికులు ఆందోళన వ్యక్తం చేస్తున్నారు. ముఖ్యంగా సెలవు దినాల్లో అయితే అధికారులు స్థానికంగా ఉండరన్న నెపంతో తమకు ఇబ్బందులు ఉండవని, ఒకవేళ అధికారులకు ఎవరైనా సమాచారం ఇస్తే వారు మట్టి తవ్వే ప్రాంతానికి వెళ్లే సరికి అక్రమార్కులు తమ పనికానించుకొని అక్కడి నుంచి ఉడాయిస్తున్నారు. ఎక్స్‌కవేటర్, ట్రాక్టర్ల యజమానుల వివరాలు తెలిసి అధికారులు విచారిస్తే రాజకీయ నాయకుల అండదండలతో తప్పించుకుంటున్నారు. అధికారులు కూడా రాజకీయ ఒత్తిడిలకు తలొగ్గి విధులు నిర్వహిస్తున్నారా అని అధికారుల తీరుపై సర్వత్రా విమర్శలు వినిపిస్తున్నాయి. దళారుల ప్రమేయంతో జరుగుతున్నమట్టి తవ్వకాలపై జిల్లా అధికారులు దృష్టి సారించి చెరువులను రక్షించాలని స్థానికులు కోరుతున్నారు.

ప్రకాశం టూ చెన్నై వయా నెల్లూరు

● రేషన్ బియ్యం రాకెట్ రూట్ ఇది.. ● రవాణదారుడు మహేష్‌రెడ్డిపై కేసు నమోదు

● పట్టుబడిన బియ్యం ఎంఎల్ఎస్ పాయింట్‌కు తరలింపు


పట్టుబడిన లారీలు

నెల్లూరురూరల్,సెప్టెంబరు 24(ఆంధ్రజ్యోతి): రేషన్ బియ్యం అక్రమ రవాణా గుట్టురట్టైంది. స్మగ్లింగ్ రూటు బహిర్గతం కావడంతో అధికార, రాజకీయ వర్గాలు విస్మయం వ్యక్తం చేస్తున్నాయి. ప్రకాశం జిల్లా నుంచి సేకరించిన రేషన్ బియ్యాన్ని లారీల్లో లోడ్ చేసి చెన్నైలోని మార్కెట్‌కు తరలిస్తూ వయా నెల్లూరులో ఆగడంతో భారీగా బియ్యం పట్టుబడినట్లు పౌరసరఫరాల శాఖకు చెందిన ఓ అధికారి తెలిపారు. సాధారణ బియ్యం రవాణా మాటున రేషన్ బియ్యం కూడా తరలించేందుకు సిద్ధం చేసుకున్న ప్రణాళిక బెడిసికొట్టడంతో రెండు లారీల్లోని బియ్యం పట్టుబడినట్లు ఆ అధికారి చెప్పుకొచ్చారు. ప్రకాశం జిల్లాలో రేషన్ షాపుల ద్వారా రహస్యంగా సేకరించిన బియ్యం చెన్నై మార్కెట్‌కు తరలించే బాధ్యతను అనంతరసాగరం మండలం వెంగంపల్లికి చెందిన బట్టిరెడ్డి మహేష్‌రెడ్డి తీసుకున్నట్లు పౌరసరఫరాల శాఖ అధికారులు ప్రాథమికంగా గుర్తించారు. పట్టుబడిన లారీలు ఆయనవే కావడంతో పౌరసరఫరాల శాఖ ఆయనపై 6ఏ కేసును నమోదు చేయగా, ఇటు నెల్లూరురూరల్ పోలీసులు సీఎస్‌డీటీ జమీర్‌బాషా ఇచ్చిన ఫిర్యాదుతో 7 ఆఫ్ ఈసీ చట్టం కింద కేసు కట్టినట్లు సీఐ గుంజి వేణు బుధవారం తెలిపారు. కాగా పట్టుబడిన రేషన్ బియ్యాన్ని నిల్వ చేసేందుకు పౌరసరఫరాల శాఖ నేతృత్వంలోని ఎంఎల్ఎస్ గోదాములకు తరలించారు. అధికారులకు పట్టుబడింది రెండు లారీల రేషన్ బియ్యమే అయినా, చెన్నైలోని స్మగ్లింగ్ మార్కెట్ కేంద్రంగా భారీ రాకెట్ నడుస్తున్నట్లు నిఘా వర్గాలు అంచనా వేస్తున్నాయి. పేదలకు ప్రభుత్వం ఉచితంగా అందిస్తున్న రేషన్ బియ్యానికి ఏకంగా రూ. 46 వరకు వ్యాపారులకు కొనుగోలు సమయంలో చెల్లిస్తున్నట్లు తెలుస్తోంది. వీటిని పలువురు తినేందుకు ఇష్టపడక రేషన్ డీలర్లకు కేజీ రూ. 10ల చొప్పున అమ్మేసి సొమ్ముచేసుకుంటున్నా రు. ఇలా సేకరించిన బియ్యాన్ని మండలాల వారీగా మాఫీయా వ్యక్తులు జిల్లాకు కేజీ రూ. 15 నుంచి 20ల వరకు అమ్ముతున్నట్లు సమాచారం. ఈ మార్గాల ద్వారా రేషన్ బియ్యం స్మగ్లింగ్ చేసే సిండికేట్లు భారీగా నిల్వ చేసి చెన్నైకు తరలిస్తున్నట్లు తాజాగా పట్టుబడిన లారీగా రాకెట్ ద్వారా సమాచారాన్ని నిఘా వర్గాలు సేకరించినట్లు తెలుస్తోంది. కాగా మహేష్‌రెడ్డి అనే వ్యక్తి రెండు లారీల్లో రేషన్ బియ్యాన్ని నింపి మరో మూడు లారీల్లో సాధారణ బియ్యం నింపి నెల్లూరులో ఎందుకు ఆపారు...? వీటితో పాటు మరిన్ని లారీలు ఒకే సారి చెన్నై బయల్దేరే అవకాశమేమైనా ఉందా...? ఉంటే ఆ లారీలు ఎక్కడ...? అన్నది దర్యాప్తు అధికారులు ఆరా తీస్తున్నారు.

భవన నిర్మాణ పనుల పరిశీలన

ఉదయగిరి, సెప్టెంబరు 24 (ఆంధ్రజ్యోతి): స్థానిక ఎంపీడీవో కార్యాలయ ఆవరణలో జరుగుతున్న నూతన కార్యాలయ భవన నిర్మాణ పనులను బుధవారం పంచాయతీరాజ్ డీఈ సీహెచ్ మణికుమార్ పరిశీలించారు. పనుల్లో నాణ్యతా ప్రమాణాలు పాటించి త్వరితగతిన పూర్తి చేయాలని కాంట్రాక్టర్‌కు సూచించారు. మరో రెండు నెలల్లో భవనం పనులు పూర్తయి అందుబాటులోకి వస్తుందన్నారు. ఈకార్యక్రమంలో ఏఈ శ్రీనివాసులు, ఇంజనీరింగ్ అసిస్టెంట్లు, సిబ్బంది తదితరులు పాల్గొన్నారు.

బంగారం, వెండి ధరలు

బంగారం (22 క్యారెట్లు)	
ఒక గ్రాము ధర	రూ. 10898
వెండి కిలో ధర	రూ. 138600
వెండి ఒక గ్రాము	రూ. 141.60

న్యూస్ బాక్స్

ఆలయ నిర్మాణానికి భూమిపూజ



భూమిపూజ చేస్తున్న కోటంరెడ్డి దంపతులు, గ్రామస్థులు

సంగం, సెప్టెంబరు 24 (ఆంధ్రజ్యోతి): మండలంలోని పడమటిపాళెంలో మహాలక్ష్మమ్మ ఆలయ జీర్ణోద్ధరణ పనులతో పాటు విజయ గణపతి నూతన ఆలయ నిర్మాణానికి బుధవారం భూమి పూజ చేశారు. గ్రామస్థుల సహకారంతో మహాలక్ష్మమ్మ ఆలయ జీర్ణోద్ధరణ పనులతో పాటు విజయ గణపతి ఆలయాన్ని నిర్మించనున్నట్లు గ్రామ సర్పంచ్ కోటంరెడ్డి బాలకృష్ణారెడ్డి, పద్మజ దంపతులు పేర్కొన్నారు. ఆమేరకు గ్రామస్థుల నడుమ వేదపండితుల ఆధ్వర్యంలో భూమిపూజ చేసి జీర్ణోద్ధరణ పనులు ప్రారంభించారు. అనంతరం వారు మాట్లాడుతూ నవంబరు 14, 15, 16 తేదీల్లో విజయ గణపతి, మహాలక్ష్మమ్మ నూతన విగ్రహాలను ప్రతిష్ఠించనున్నట్లు వారు తెలిపారు.

సచివాలయ సిబ్బందికి శిక్షణ



శిక్షణ కార్యక్రమంలో మాట్లాడుతున్న తహసీల్దారు నాగరాజు

దుత్తలూరు(ఉదయగిరి), సెప్టెంబరు 24(ఆంధ్రజ్యోతి): స్థానిక మండల పరిషత్ కార్యాలయ సమావేశ మందిరంలో పీ4 కార్యక్రమంపై బుధవారం సచివాలయ సిబ్బందికి శిక్షణ నిర్వహించారు. ఈ సందర్భంగా తహసీల్దారు యనమల నాగరాజు మాట్లాడుతూ రాష్ట్ర ప్రభుత్వం రూపొందించిన పీ4 కార్యక్రమం పకడ్బందీగా అమలు చేసేందుకు సిబ్బంది కృషి చేయాలన్నారు. గ్రామాల్లో పేదలను ఆదుకుని బంగారు కుటుంబాలుగా తీర్చిదిద్దాలన్నారు. ఈ కార్యక్రమంలో డిప్యూటీ ఎంపీడీవో మల్లికార్జున, ఎంఈవో వెంగయ్య, పంచాయతీ కార్యదర్శులు, వీఆర్వోలు, సచివాలయ సిబ్బంది పాల్గొన్నారు.

ఆదర్శమూర్తి మహ్మద్ ప్రవక్త

ఉదయగిరి, సెప్టెంబరు 24 (ఆంధ్రజ్యోతి): ఆదర్శమూర్తి మహ్మద్ ప్రవక్త అని జమాతే ఇస్లామీ హింద్ రాష్ట్ర సలహా మండలి సభ్యుడు కేఎం అబ్దుస్‌సుభహాన్ పేర్కొన్నారు. బుధవారం పట్టణంలోని దిలావర్‌భాయ్ వీధిలో మహ్మద్‌ప్రవక్త జన్మించిన నెలను పురస్కరించుకుని సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ నేటి సమాజం ఆయన చూపిన మార్గంలో నడవాలన్నారు. ఈ కార్యక్రమంలో జమాతే ఇస్లామీ హింద్ జిల్లా అధ్యక్షుడు షేక్ ఇస్మాయిల్, సభ్యులు మసూద్, సమద్, ముస్లింలు తదితరులు పాల్గొన్నారు.

కలెక్టర్‌ను కలిసిన సొసైటీ చైర్మన్ చల్లా



కలెక్టర్‌కి పుష్పగుచ్ఛం అందజేస్తున్న సొసైటీ చైర్మన్ చల్లా

వింజమూరు, సెప్టెంబరు 24 (ఆంధ్రజ్యోతి): జిల్లాకు నూతనంగా వచ్చిన కలెక్టర్ హిమాన్షు శుక్లాను మండల వ్యవసాయ సహకార సంఘం అధ్యక్షుడు చల్లా వెంకటేశ్వర్లు యాదవ్ బుధవారం మర్యాద పూర్వకంగా కలిశారు. ఈసందర్భంగా మండలంలో రైతుల సమస్యలను కలెక్టర్‌కు వివరించారు.

స్వచ్ఛమైన ఓటర్ల జాబితా తయారు చేయాలి

ఉదయగిరి, సెప్టెంబరు 24 (ఆంధ్రజ్యోతి): స్థానిక తహసీల్దారు కార్యాలయంలో మండలంలోని బూత్‌లెవల్ అధికారులతో బుధవారం తహసీల్దారు ఎల్ రామ్మోహన్ సమీక్షా సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ బీఎల్‌వోలు బాధ్యతగా పనిచేసి స్వచ్ఛమైన ఓటర్ల జాబితా తయారీకి కృషి చేయాలన్నారు. 2002లో ఓటు హక్కు పొందిన వారు 2025 ఓటర్ల జాబితాలో ఉన్నారా, లేరా గుర్తించాలన్నారు. 18 ఏళ్లు నిండిన ప్రతిఒక్కరికీ ఓటు హక్కు కల్పించాలన్నారు. ఈకార్యక్రమంలో ఎన్నికల సీనియర్ అసిస్టెంట్ నీహా, డీఈవో అలీం, బీఎల్‌వోలు తదితరులు పాల్గొన్నారు.

వైభవంగా శరన్నవరాత్రి ఉత్సవాలు

ప్రత్యేక అలంకరణలో అమ్మవారికి పూజలు



ఆత్మకూరు: మంగళగౌరీదేవి అలంకారంలో జ్వాలాముఖి అమ్మవారు



సంగం : అన్నపూర్ణదేవి అలంకారంలో శ్రీ కామాక్షీదేవి



వరికుంటపాడు : అన్నపూర్ణదేవి అలంకారంలో నాగరప్పమ్మ

ఆత్మకూరు, సెప్టెంబరు 24 (ఆంధ్రజ్యోతి): పట్టణంలోని ఉత్తర బలిజ వీధిలో ఉన్న జ్వాలాముఖి ఆలయంలో శరన్నవరాత్రి ఉత్సవాల్లో భాగంగా బుధవారం అమ్మవారు మంగళగౌరీదేవి అలంకారంలో భక్తులకు దర్శనమిచ్చారు. ఈసందర్భంగా ప్రత్యేక పూజలు నిర్వహించారు. ఈకార్యక్రమంలో భక్తులు అధిక సంఖ్యలో పాల్గొని తీర్థప్రసాదాలు స్వీకరించారు.

● **సంగం:** స్థానిక పెన్నానది ఒడ్డున ఉన్న శ్రీ కామాక్షీదేవి సమేత సంగమేశ్వరాలయంలో బుధవారం రాత్రి అన్నపూర్ణదేవి అలంకారంలో భక్తులకు దర్శనమిచ్చారు ఈ సందర్భంగా ప్రత్యేక పూజలు నిర్వహించారు. పల్లకీ సేవ నిర్వహించారు. ఈ కార్యక్రమంలో పిట్టు మల్లికార్జునరెడ్డి, పద్మజ దంపతులు, భక్తులు పాల్గొన్నారు.

● **వరికుంటపాడు (ఉదయగిరి రూరల్):** మండలంలోని తూర్పురొంపిదొడ్లలో ఉన్న మానసాదేవి అమ్మవారు చంద్రగంట అలంకరణలో భక్తులకు దర్శనమిచ్చారు. అలాగే వరకుంటపాడులోని నాగరప్పమ్మ అమ్మవారు అన్నపూర్ణదేవి అలంకరణలో దర్శనమిచ్చారు. ఈ సందర్భంగా అర్చకులు ప్రత్యేక పూజలతో పాటు కుంకుమార్చన, సహస్ర దీపాలంకరణ, అభిషేకాలు నిర్వహించి తీర్థప్రసాదాలు అందజేశారు. భక్తులు సైతం అధిక సంఖ్యలో పాల్గొని కాయాకర్పూరం అందజేసి తమ మొక్కులు తీర్చుకున్నారు.



నర్రవాడలో భువనేశ్వరిదేవి అలంకరణలో రేణుకాఎల్లమ్మ

● **ఉదయగిరి:** పట్టణంలోని పార్వతీపరమేశ్వర, బాలాజీనగర్, సంతానలక్ష్మి ఆలయాల్లో అమ్మవారు భక్తులకు అన్నపూర్ణాదేవి అలంకరణలో దర్శనమిచ్చారు. అర్చకులు అమ్మవారికి ప్రత్యేక పూజలు చేపట్టారు. భక్తులు అధిక సంఖ్యలో పాల్గొని అమ్మవార్లను దర్శించి కాయాకర్పూరం అందజేసి మొక్కులు తీర్చుకున్నారు.

● **దుత్తలూరు:** మండలంలోని నర్రవాడ పంచాయతీ గుదేవారిపాళెంలో రేణుకాఎల్లమ్మతల్లి భువనేశ్వరిదేవి అలంకరణలో భక్తులకు దర్శనమిచ్చారు. భక్తులు అధిక సంఖ్యలో పాల్గొని అమ్మవారిని దర్శించి కాయాకర్పూరం అందజేసి మొక్కులు తీర్చుకున్నారు.

● **సీతారామపురం:** మండల కేంద్రంలోని వాసవి కన్యకా పరమేశ్వరి దేవి ఆలయంలో, గ్రామ దేవత అంకాలమ్మ గుడి వద్ద, నారాయణమ్మపేట గ్రామంలోని విజయ కనకదుర్గదేవి ఆలయాలలో, ఘటిక సిద్దేశ్వరం క్షేత్రంలోని ఇష్టకామేశ్వరీదేవి అమ్మవారు అన్నపూర్ణాదేవి అలంకారంలో భక్తులకు దర్శనం ఇచ్చారు. అమ్మవారికి ప్రత్యేక పూజలు, అభిషేకాలు నిర్వహించి భక్తులకు తీర్థప్రసాదాలను పంచిపెట్టారు. అంకాలమ్మ గుడి వద్ద టీడీపీ మండల కోఆర్డినేటర్ చింతల శ్రీనివాసులు సహకారంతో అన్నదాన కార్యక్రమం నిర్వహించారు.



ఉదయగిరి : అన్నపూర్ణాదేవి అలంకరణలో పార్వతీదేవి



తూర్పురొంపిదొడ్ల : చంద్రగంట అలంకరణలో మానసాదేవి అమ్మవారు



సీతారామపురం : అన్నపూర్ణాదేవి అలంకారంలో శ్రీవాసవి కన్యకా పరమేశ్వరిదేవి

మహిళలకు వైద్య పరీక్షలు



మహిళలకు వైద్య పరీక్షలు నిర్వహిస్తున్న వైద్య సిబ్బంది

సంగం, సెప్టెంబరు 24 (ఆంధ్రజ్యోతి): స్థానిక ప్రభుత్వ వైద్యశాల ఆవరణలో కేంద్ర ప్రభుత్వం ప్రవేశపెట్టిన స్వస్థ్ నారీ సశక్తి పరివార్ అభియాన్ పథకంలో భాగంగా బుధవారం వైద్య శిబిరం ఏర్పాటు చేశారు. వైద్య శిబిరానికి హాజరైన మహిళలకు వైద్య పరీక్షలు నిర్వహించి మందులు పంపిణీ చేశారు. ఈ సందర్భంగా ఐసీడీయస్ ఆధ్వర్యంలో తక్కువ ఖర్చుతో అధిక పోషక విలువలు ఉండే ఆహార పదార్థాలను ప్రదర్శించారు. ఈ కార్యక్రమంలో వైద్యాధికారి డాక్టర్ శ్రీనివాసులురెడ్డి, అశోక్, ఏఎన్ఎం, ఆశా కార్యకర్తలు పాల్గొన్నారు.

ఉదయగిరి ఎంపీడీవోగా శ్రీనివాసులు



బాధ్యతలు స్వీకరిస్తున్న ఎంపీడీవో శ్రీనివాసులు

ఉదయగిరి, సెప్టెంబరు 24 (ఆంధ్రజ్యోతి): ఉదయగిరి మండల పరిషత్ అభివృద్ధి అధికారిగా బీ.శ్రీనివాసులు బుధవారం బాధ్యతలు స్వీకరించారు. ఇక్కడ పనిచేస్తున్న ఎంపీడీవో అప్పాజీ పదోన్నతిపై చిత్తూరు జిల్లాకు బదిలీ కాగా ప్రకాశం జిల్లా మార్కాపురం డిప్యూటీ ఎంపీడీవోగా పనిచేస్తున్న బీ శ్రీనివాసులకు ఎంపీడీవోగా పదోన్నతి కల్పిస్తూ ఉదయగిరికి బదిలీ చేయడంతో ఆయన బాధ్యతలు స్వీకరించారు. ఈసందర్భంగా ఆయన మాట్లాడుతూ అందరి సహకారంతో మండల అభివృద్ధికి తనవంతు కృషి చేస్తానన్నారు. అనంతరం కార్యాలయ సిబ్బంది ఆయనకు అభినందనలు తెలిపి సన్మానించారు. ఈ కార్యక్రమంలో డిప్యూటీ ఎంపీడీవో కరీముల్లా, ఏవో పద్మజ, సీనియర్, జూనియర్ అసిస్టెంట్లు నవాజ్, సమద్, సిబ్బంది ఇమ్రాన్, లక్ష్మీ, మస్తాన్, పంచాయతీ కార్యదర్శులు తదితరులు పాల్గొన్నారు.

ప్రతిఒక్కరూ పరిసరాల పరిశుభ్రత పాటించాలి

వింజమూరు, సెప్టెంబరు 24 (ఆంధ్ర జ్యోతి): మండలంలోని ప్రతి గ్రామంలో పరిసరాల పరిశుభ్రత కార్యక్రమాన్ని నిర్వహిస్తున్నట్లు ఎంపీడీవో శ్రీనివాసులు రెడ్డి, డిప్యూటీ ఎంపీడీవో రామారావు తెలిపారు. బుధవారం మండల కార్యాలయ పరిసర ప్రాంతాల్లో ఈ కార్యక్రమాన్ని నిర్వహించినట్లు తెలిపారు. ప్రతిఒక్కరూ పరిసరాల పరిశుభ్రత పాటించాలన్నారు.

నిధుల కొరతతో ఆగిన సచివాలయ నిర్మాణం



అసంపూర్తిగా ఉన్న గ్రామ సచివాలయం భవనం

సంగం, సెప్టెంబరు 24 (ఆంధ్రజ్యోతి): మండలంలోని దువ్వూరులో గ్రామ సచివాలయ భవన నిర్మాణం నిధుల కొరతతో అర్ధంతరంగా ఆగిపోయింది. గత వైసీపీ ప్రభుత్వంలో ఈ భవనానికి రూ. 45 లక్షలు మంజూరు చేశారు. మొదటి విడత రూ. 25 లక్షలు మంజూరుకాగా శ్లాబు వరకు నిర్మించారు. అంతలో ఎన్నికలు రావడంతో పనులు ఆగిపోయాయి. అనంతరం నిధులు మంజూరు కాలేదు. దీంతో భవనం అసంపూర్తిగా నిలిచిపోయింది. ప్రస్తుతం కమ్యూనిటీ భవనంలో సిబ్బంది విధులు నిర్వహిస్తున్నారు.

ఉదయగిరిని జిల్లా చేయాలని మహిళల ఆందోళన



తహసీల్దారు కార్యాలయం ఎదుట ఆందోళన చేస్తున్న పొదుపు మహిళలు

ఉదయగిరి, సెప్టెంబరు 24 (ఆంధ్రజ్యోతి): చారిత్రక నేపథ్యం కలిగి అనాదిగా అభివృద్ధికి నోచుకోని ఉదయగిరిని జిల్లా చేయాలని బుధవారం స్థానిక తహసీల్దారు కార్యాలయం ఎదుట మండలంలోని పొదుపు మహిళలు ఆందోళన చేపట్టారు. ఈ సందర్భంగా పలువురు మాట్లాడుతూ సాగు, తాగునీరు లేక మెట్ట ప్రాంత ప్రజలు ఇబ్బందులు పడుతున్నారన్నారు. బంగారం పండే భూములున్నా బీళ్లుగా ఉన్నాయన్నారు. ఉన్నప్రాంతంలో ఉపాధిలేక కుటుంబాలతో సహా ఇతర ప్రాంతాలకు వలస పోతున్నారన్నారు. ఉదయగిరి అన్ని రంగాల్లో అభివృద్ధి చెందాలంటే జిల్లా చేయడం ఒక్కటే మార్గమన్నారు. అనంతరం తహసీల్దారు ఎల్ రామ్మోహన్‌కు వినతిపత్రం అందజేశారు. ఈ కార్యక్రమంలో జిల్లా సాధన సమితి నాయకులు దస్తగిరి అహ్మద్, రంతు జానీ, మహిళలు తదితరులు పాల్గొన్నారు.

అధిక ఎరువుల వాడకం అనర్థదాయకం



బండగానిపల్లిలో అవగాహన ర్యాలీ నిర్వహిస్తున్న అధికారులు

ఉదయగిరి, సెప్టెంబరు 24 (ఆంధ్రజ్యోతి): వ్యవసాయాధికారుల సిఫార్సు మేరకే రైతులు పంటకు ఎరువులు వాడాలని, అధికంగా వాడితే అనర్థాలు తప్పవని మండల వ్యవసాయాధికారి విజయభాస్కర్ సూచించారు. బుధవారం మండలంలోని బండగానిపల్లి, జీ.చెరువుపల్లి రైతుసేవా కేంద్రాల పరిధిలో పొలం పిలుస్తోంది కార్యక్రమం నిర్వహించారు. ఈ సందర్భంగా సాగులో ఉన్న పంటలను పరిశీలించి రైతులకు తగు సూచనలు, సలహాలు అందజేశారు. అనంతరం ఎరువులు అధికంగా వినియోగిస్తే భూసారం తగ్గుతుందని, ఖర్చులు పెరిగి పంట దిగుబడుల్లో నాణ్యత తగ్గిపోతుందని అవగాహన కల్పిస్తూ ర్యాలీ చేపట్టారు. ఈ కార్యక్రమంలో వీఏఏ వెంకటేశ్వర్లు, రైతులు తదితరులు పాల్గొన్నారు.

విద్యార్థి దశ నుంచే సేవాగుణం అలవర్చుకోవాలి



ర్యాలీ నిర్వహిస్తున్న అధ్యాపకులు, విద్యార్థులు

ఉదయగిరి, సెప్టెంబరు 24(ఆంధ్రజ్యోతి): విద్యార్థి దశ నుంచే సేవాగుణం కలిగి సమాజం పట్ల బాధ్యతగా వ్యవహరించాలని మేకపాటి గౌతంరెడ్డి ప్రభుత్వ వ్యవసాయ కళాశాల అసోసియేట్ డీన్ డాక్టర్ జీ.కృష్ణారెడ్డి సూచించారు. బుధవారం జాతీయ సేవా పథకం వ్యవస్థాపక దినోత్సవ వేడుకలను ఘనంగా నిర్వహించి ర్యాలీ చేపట్టారు. అనంతరం ఆయన మాట్లాడుతూ ప్రతిఫలం ఆశించకుండా సేవామార్గం పట్టేవారే జాతీయ సేవా పథకం వలంటీర్లు అన్నారు. అనంతరం కళాశాల ఆవరణలో చెత్తాచెదారాన్ని తొలగించి శుభ్రం చేశారు. ఈ కార్యక్రమంలో అధ్యాపకులు మనోజ్‌కుమార్, మౌనిక, రమేష్‌నాయక్, వెంకటేశ్వర్లు, షేక్ మునీర్‌బాషా, సిబ్బంది, విద్యార్థులు తదితరులు పాల్గొన్నారు.



ఉద్యోగాలు ఇప్పిస్తానని నకిలీ పోలీసు గాలం

● **పలువురి నుంచి రూ.51 లక్షల వసూలు**

నెల్లూరు(క్రైం), సెప్టెంబరు 24 (ఆంధ్రజ్యోతి): 'విజయవాడలో క్రైమ్ బ్రాంచ్ సర్కిల్ ఇన్‌స్పెక్టర్‌గా పని చేస్తున్నాను. నాకు ఫారెస్ట్ డిపార్ట్‌మెంట్ లో చాలా పరిచయాలు ఉన్నాయి. మీకు ఉద్యోగం ఇప్పిస్తాను. దానికి డబ్బులు ఇవ్వాలి' అంటూ మాయమాటలు చెప్పి ఓ నకిలీ పోలీసు నిరుద్యోగుల నుంచి రూ.51 లక్షలకుపైగా వసూలు చేసి పరారయ్యాడు. ఈ ఘటనపై వేదాయపాళెం పోలీసులు కేసు నమోదు చేశారు. పోలీసుల సమాచారం మేరకు... నెల్లూరు నగరం న్యూ మిలటరీ కాలనీకి చెందిన తూపిలి వినోద్ కుమార్ బీటెక్ చదివి ఉద్యోగాన్వేషణలో ఉన్నాడు. ప్రస్తుతం మైకాస్‌రోడ్డు సెంటర్‌లో ఆయన మామ ప్రసాద్ నిర్వహిస్తున్న టీ బ్రేక్ దుకాణంలో పనిచేస్తున్నాడు. ఆ దుకాణానికి పొదలకూరురోడ్డు ప్రాంతానికి చెందిన దేవళ్ల సాయికృష్ణ వస్తూ ఉండేవాడు. తాను విజయవాడలో క్రైమ్ బ్రాంచ్ సీఐగా పనిచేస్తున్నానని, తనకు డబ్బులు ఇస్తే ఫారెస్ట్ డిపార్ట్‌మెంట్‌లో ఉద్యోగం ఇప్పిస్తానని వినోద్‌కుమార్‌ను నమ్మించాడు. పలుమార్లు పోలీసు యూనిఫామ్‌లో రావడంతో నిజంగా పోలీసే అని వినోద్‌కుమార్ నమ్మి ఈ ఏడాది జూన్ నుంచి ఆగస్టు వరకు ఫోన్‌పే ద్వారా రూ.3.31 లక్షలు, చేతికి రూ.3.20 లక్షలు, ఆరు సవర్ల బంగారు వస్తువులు... కలిపి మొత్తం రూ.11 లక్షలు సాయికృష్ణకు ఇచ్చాడు. ఉద్యోగం విషయం ప్రశ్నించినప్పుడల్లా తప్పించుకుంటూ ఉండటంతో వినోద్‌కుమార్‌కు అనుమానం వచ్చి విచారించగా సాయికృష్ణ ప్రభుత్వ ఉద్యోగి కాదని తెలిసింది. దీంతో తనకు ఉద్యోగం వద్దని, తానిచ్చిన నగదు, నగలు తిరిగి ఇచ్చేయాలని ఈ నెల 14వ తేదీ నిలదీశాడు. దీనికి స్పందించిన సాయికృష్ణ 'నాపై నమ్మకం లేకపోతే నా కారు, రెండు బైక్‌లు మీ వద్దనే ఉంచుకోండి, నగదు ఇచ్చాక వాటిని తీసుకువెళతాను' అని చెప్పి వాటిని ఇచ్చి వెళ్లిపోయాడు. 15వ తేదీ అతని ఇంటికి వెళ్లి చూడగా తాళం వేసి ఉండటంతో మోసపోయామని తెలుసుకున్నాడు. ఎన్‌సీసీ కాలనీకి చెందిన పోలిరెడ్డి పావని, భారతి, దగదర్తికి చెందిన కే హేమంత్‌కు కూడా ఉద్యోగాలు ఇప్పిస్తానని సాయికృష్ణ రూ.40 లక్షలు తీసుకొని మోసం చేశాడని వినోద్‌కుమార్‌కు తెలిసింది. ఈ నేపథ్యంలో బుధవారం వేదాయ పాళెం పోలీసులకు ఫిర్యాదు చేశాడు. కారు, రెండు బైక్‌లను స్వాధీనం చేసుకున్న పోలీసులు కేసు నమోదు చేసి విచారిస్తున్నారు.

రామాలయంలో చోరీ



కంపచెట్లలో పడి ఉన్న హుండీ

వరికుంటపాడు (ఉదయగిరి రూరల్), సెప్టెంబరు 24 (ఆంధ్రజ్యోతి): మండలంలోని తూర్పు కొండా రెడ్డిపల్లి రామాలయంలో గుర్తుతెలియని దుండగులు చోరీకి పాల్పడిన సంఘటన బుధవారం వెలుగు చూసింది. వివరాల మేరకు... మంగళవారం సాయంత్రం రోజు మాదిరిగా పూజలు నిర్వహించి ఆలయ ప్రధాన గేటుకు తాళాలు వేసి నివాసాలకు చేరుకున్నారు. బుధవారం ఉదయం గేటు తాళాలు పగులకొట్టి ఉండడాన్ని అటుగా వెళ్లిన కొంతమంది గమనించి గ్రామస్థులకు సమాచారం అందజేశారు. దీంతో వారు అక్కడికి చేరుకుని హుండీతో పాటు రెండు బంగారు తాళిబొట్లు చోరీకి గురయినట్లు నిర్ధారించారు. అనంతరం గాలింపు చర్యలు చేపట్టి గ్రామ శివారు ప్రాంతంలోని కంపచెట్లలో పడి ఉన్న హుండీని గుర్తించారు. ఆలయ కమిటీ అందించిన ఫిర్యాదు మేరకు పోలీసులు సంఘటనా స్థలానికి చేరుకొని దర్యాప్తు చేపట్టారు.

● **చిల్లర దుకాణంలో..**

కావలిరూరల్, సెప్టెంబరు 24(ఆంధ్రజ్యోతి): కావలి పట్టణం ట్రంక్ రోడ్డులో ఉన్న చిల్లర దుకాణంలో చోరీ జరిగినట్లు బుధవారం దుకాణం యజమాని తాతా అమర్‌చంద్ గుర్తించి పోలీసులకు ఫిర్యాదు చేశాడు. 1వ పట్టణ పోలీసులు, బాధితుడి వివరాల మేరకు.. మంగళవారం రాత్రి దుకాణం మూసి వెళ్లగా అర్ధరాత్రి సమయంలో దుకాణం వెనుక షెట్టరు పగలగొట్టి లోనికి ప్రవేశించిన గుర్తుతెలియని దుండగులు గల్లా పెట్టెలో ఉంచిన రూ.10,000 అపహరించుకువెళ్లారు. అలాగే పక్కనే ఉన్న మరో దుకాణంలో చోరీ యత్నానికి పాల్పడగా ఆ సమీపంలో మనుషుల అలికిడి రావడంతో అక్కడ నుంచి వెళ్లిపోయారు. బాధితుడి ఫిర్యాదు మేరకు ఎస్‌ఐ సుమన్ కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నట్లు తెలిపారు.

● **రెండు ద్విచక్ర వాహనాలు..**

నెల్లూరు రూరల్, సెప్టెంబరు 24 (ఆంధ్రజ్యోతి) : నెల్లూరు రూరల్ పరిధిలోని రెండు ద్విచక్ర వాహనాలు చోరీ అయినట్లు రూరల్ సీఐ గుంజి వేణు బుధవారం తెలిపారు. చింతారెడ్డిపాళెంకు చెందిన శ్రీధర్ తన యమహా ఎఫ్‌జడ్ వాహనాన్ని గత నెల 25వ తేదీన మెడికవర్ ఆసుపత్రి వద్ద ఉంచగా అది చోరీకి గురైనట్లు ఫిర్యాదు చేశారని తెలిపారు. దేవరపాళెంలోని ఐఎంఎల్ డిపోలో హమాలీ కార్మికుడిగా పనిచేస్తున్న గడ్డం వెంకటేశ్వర్లు ఈ నెల 20వ తేదీన తన హోండా సీబీజడ్ బైక్‌ను ఇంటి వద్ద ఉంచగా చోరీకి గురైనట్లు ఫిర్యాదు చేశారన్నారు. ఈ కేసులు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నామని చెప్పారు.

నిద్రిస్తున్న వ్యక్తిపైకి లారీ...

నరుకూరు రోడ్డు వద్దనున్న వెంకటరమణ రైసు మిల్లులో బుధవారం వేకువజామున లారీ వెనుక్కు తీస్తున్న సమయంలో పక్కనే నిద్రపోతున్న ఓ వ్యక్తి కాలుపైకి వాహనం ఎక్కింది. అతని కాలు పూర్తిదెబ్బతిన్నదని, పూర్తి వివరాలు అందాల్సి ఉందని సీఐ తెలిపారు.

● **13 సవర్ల బంగారు నగలు..**

కోవూరు, సెప్టెంబరు 24(ఆంధ్రజ్యోతి): స్థానిక పాత ఆంధ్రాబ్యాంకు సమీపంలో నివాసముంటున్న మూర్తిరాజు చంద్రశేఖరరావు ఇంట్లో గుర్తుతెలియని దుండగులు 13 సవర్ల బంగారు నగలు అపహరించుకెళ్లినట్లు బుధవారం పోలీసులకు ఫిర్యాదు అందింది. వివరాల మేరకు... చంద్రశేఖరరావు ఈనెల 15వ తేదీన హైదరాబాద్‌కు వెళ్లారు. ఈ క్రమంలో మంగళవారం రాత్రి గుర్తు తెలియని వ్యక్తులు ఇంటి తలుపులు పగులగొట్టి 13 సవర్ల బంగారు నగలు అపహరించుకు వెళ్లారు. బుధవారం హైదరాబాదు నుంచి తిరిగి వచ్చిన ఆయన పోలీసులకు ఫిర్యాదు చేశారు. పోలీసులు కేసు దర్యాప్తు చేపట్టారు.

పది బైకుల స్వాధీనం



వివరాలు వెల్లడిస్తున్న డీఎస్పీ శ్రీనివాసరావు, పక్కన సీఐ సుధాకరరెడ్డి

కోవూరు, సెప్టెంబరు 24(ఆంధ్రజ్యోతి): ఇటీవల బైక్‌లను అపహరిస్తూ పట్టుబడిన కావలి పట్టణానికి చెందిన నిందితుడు సాగర్ వద్ద నుంచి పది మోటారు బైక్‌లను స్వాధీనం చేసుకున్నట్లు నెల్లూరు రూరల్ డీఎస్పీ జీ శ్రీనివాసరావు తెలిపారు. స్థానిక సీఐ కార్యాలయంలలో బుధవారం ఏర్పాటు చేసిన విలేకరుల సమావేశంలో ఆయన మాట్లాడారు. జాతీయ రహదారిపై పహారా కాస్తున్న పోలీసులు సాగర్‌ను అదుపులోనికి ప్రశ్నించడంతో వివరాలు వెలుగులోకి వచ్చినట్లు చెప్పారు. నిందితుడు సాగర్ తన మిత్రులు సహన్‌బాబు, ఆదర్శ్‌గోవింద్‌లతో కలిసి వరుస చోరీలకు పాల్పడినట్లు అంగీకరించాడని చెప్పారు. దీంతో రూ.9లక్షల విలువ చేసే పది బైకులను స్వాధీనం చేసుకున్న కోవూరు పోలీసులను ఆయన అభినందించారు. ఈ సమావేశంలో సీఐ సుధాకరరెడ్డి పాల్గొన్నారు.

యువకుడి మృతదేహం గుర్తింపు

కలువాయి, సెప్టెంబరు 24 (ఆంధ్రజ్యోతి): సోమశిల కండలేరు వరద కాలువ ప్రవాహంలో సోమవారం గల్లంతైన కేశమనేనిపల్లి ఎస్టీ కాలనీకి చెందిన చలంచర్ల శీనయ్య (35) మృతదేహాన్ని బుధవారం కండలేరు జలాశయం పాత దాచూరు సమీపంలో స్థానికులు గుర్తించారు. ఈమేరకు పోలీసులు కేసు నమోదు చేసి మృతదేహాన్ని పోస్టుమార్టమ్‌కు పంపి దర్యాప్తు చేస్తున్నారు. మృతుడికి భార్య, ముగ్గురు పిల్లలు ఉన్నారు.

చికెన్ ధరలు

నెల్లూరు పౌల్ట్రీ అసోసియేషన్

	కిలో (రూ.లలో)
బాయిలర్ లైవ్	117
స్కిన్ చికెన్	214
స్కిన్‌లెస్	236

కోడిగుడ్ల ధర (100): 560

ఆయనలా అవినీతికి పాల్పడడం లేదు : టీడీపీ

కందుకూరు, సెప్టెంబరు 24(ఆంధ్రజ్యోతి): వైసీపీ కందుకూరు ఇన్‌చార్జి బుర్రా మధుసూదన్‌యాదవ్ కనిగిరి నియోజకవర్గంలో చేసిన అవినీతి, భూదందాలు లాగా అందరూ చేస్తారనుకుని ఎమ్మెల్యే ఇంటూరి నాగేశ్వరరావుపై విమర్శలు చేయడం అవివేకమని టీడీపీ నాయకులు విమర్శించారు. బుధవారం స్థానిక పార్టీ కార్యాలయంలో ఏర్పాటు చేసిన విలేకరుల సమావేశంలో టీడీపీ నాయకులు దామా మల్లేశ్వరరావు, జనిగర్ల నాగరాజు, బుస్సారెడ్డి కృష్ణారెడ్డి, పోకూరి రాంబాబు, చదలవాడ కొండయ్య, బెజవాడ ప్రసాదు, చిలకపాటి మధు, రాయపాటి శ్రీనివాసరావు తదితరులు మాట్లాడుతూ రామాయపట్నంలో మేజరు పోర్టు నిర్మాణంకు టీడీపీ ప్రభుత్వంలో శంకుస్థాపన జరగ్గా దానిని మైనర్‌పోర్టుగా మార్చింది వైసీపీ ప్రభుత్వం కాదా అని ప్రశ్నించారు.

న్యూస్ బాక్స్

పెద్ద శేష వాహనంపై శ్రీవారి చిద్విలాసం



పెద్దశేష వాహన సేవలందుకుంటున్న వేంకటేశ్వరస్వామి

కావలి(టౌన్), సెప్టెంబరు 24(ఆంధ్రజ్యోతి): స్థానిక బృందావనం కాలనీలో వెలసిఉన్న వేంకటేశ్వరస్వామి నవరాత్రి బ్రహ్మోత్సవాల్లో భాగంగా రెండవ రోజు పెద్దశేష వాహనంపై విహరించారు. ఆలయ వ్యవస్థాపక కమిటీ అధ్యక్షుడు శ్రీరామ్ మాల్యాద్రి పర్యవేక్షణలో ఆలయ అర్చకులు అర్చకం అంజనాద్రి, నారాయణ సునీల్‌కుమార్ బ్రహ్మోత్సవాల యాగ్నికస్వామి పరాంకుశం చినవెంకటస్వామి అర్చకత్వంలో బ్రహ్మోత్సవాలు అంగరంగ వైభవంగా జరుగుతున్నాయి. బుధవారం రాత్రి ధ్వజారోహణం పూజల అనంతరం శ్రీవారు పెద్దశేష వాహనంపై ఊరేగుతూ భక్తులకు అభయమిచ్చారు. భక్తులు అడుగడునా శ్రీవారికి బ్రహ్మరథం పట్టి స్వామివారిని దర్శించుకుని పూజలు నిర్వహించారు. గురువారం ఉదయం స్వామివారికి చిన్నశేష వాహన ఉత్సవం రాత్రి హంసవాహన ఉత్సవం జరగనున్నాయి.

ఎమ్మెల్సీ సోము వీర్రాజుకు రజక సంఘం కృతజ్ఞతలు

కావలి(టౌన్), సెప్టెంబరు 24(ఆంధ్రజ్యోతి): రజకులను ఎస్సీలుగా గుర్తించాలని శాసన మండలిలో ప్రస్తావించిన ఎమ్మెల్సీ సోము వీర్రాజుకు రజక సంఘం నాయకులు తలమంచి రవి సంఘం తరుపున బుధవారం ఒక ప్రకటనలో కృతజ్ఞతలు తెలిపారు. ఎన్నికల ప్రచారంలో భాగంగా ముఖ్యమంత్రి చంద్రబాబునాయుడు కూడా రజక కులాన్ని ఎస్సీ జాబితాలో కలుపుతామని హామీ ఇచ్చారని పేర్కొన్నారు. రజక కులస్తులు కొన్ని రాష్ట్రాల్లో ఎస్సీలుగా కొన్ని రాష్ట్రాల్లో ఎస్టీలుగా పరిగణించబడుతున్నారన్నారని, మన రాష్ట్రంలో మాత్రమే బీసీలుగా చలామణి అవుతున్నామని, కనుక ఎస్సీ జాబితాలో చేర్చి న్యాయం చేయాలని తెలిపారు.

రోడ్డు ప్రమాదంలో ఇద్దరికి తీవ్రగాయాలు

అల్లూరు, సెప్టెంబరు 24(ఆంధ్రజ్యోతి) : రోడ్డు ప్రమాదంలో ఇద్దరికి తీవ్ర గాయాలైన సంఘటన అల్లూరులో బుధవారం రాత్రి జరిగింది. అల్లూరు శివారులోని లారీ కాటా వద్ద ఎదురెదురుగా వస్తున్న రెండు ద్విచక్ర వాహనాలు ఢీకొనడంతో ఈ ప్రమాదం జరిగింది. క్షతగాత్రులను చికిత్స నిమిత్తం 108 అంబులెన్స్‌లో కావలికి తరలించారు.

ఆర్వో ప్లాంట్ నిరుపయోగం!

- 22 రోజులుగా పనిచేయని పరిస్థితి
- అరకొరగా వాటర్ క్యాన్ల కొనుగోలు
- ఏరియా వైద్యశాలలో తాగునీటికి అవస్థ
- ఇబ్బందులు పడుతున్న రోగులు, వారి సహాయకులు

కావలి, సెప్టెంబరు 24(ఆంధ్రజ్యోతి): కావలి ఏరియా వైద్యశాలలో తాగునీటికి రోగులు, వారి సహాయకులు తీవ్ర ఇబ్బందులు ఎదుర్కొంటున్నారు. ఇక్కడ ఉన్న ఆర్వో ప్లాంట్ 22 రోజులుగా పనిచేయకపోవడంతో నిరుపయోగంగా మారింది. దీంతో వాటర్ క్యాన్లు కొనుగోలు చేసి సరఫరా చేస్తున్నా అవి అరకొరగా ఉండటంతో వైద్యశాలలో తాగునీటి ఇబ్బందులు తప్పడం లేదు. వైద్యశాలలో ఉన్న ఆర్వో ప్లాంట్ మోటారును, వాటి వైర్లను 22 రోజుల కిందట దొంగలు తీసుకెళ్లారు. వాటితో పాటు ఏసీల కాపర్ వైర్లను కూడా చోరీ చేశారు. దీనిపై పోలీసులకు ఫిర్యాదు చేసినా పట్టించుకున్న దాఖలాలు లేవని ఆసుపత్రి వర్గాలు అంటున్నాయి. ఆర్వో ప్లాంట్ మోటారు, వైర్లు ఏర్పాటు చేయాలంటే సుమారు రూ.70 వేల వరకు ఖర్చు అవుతోందని అంచనా. అదీకాక ఆర్వోప్లాంట్ బేస్ కూడా దెబ్బతిని ఉన్నందున దానిని కూడా మార్చి కొత్తది



ఏరియా వైద్యశాలలో నిరుపయోగంగా ఉన్న ఆర్వో ప్లాంట్

వేయాలంటే మరో రూ.40 వేల వరకు అవసరం అవుతోందని అంచనా. ఈ క్రమంలో ఆర్వో ప్లాంట్‌ను మళ్లీ నూతనంగా తీసుకు రావాలంటే సుమారు లక్ష రూపాయల వరకు ఖర్చు అవుతోందని, ఎవరైనా దాతలు ముందుకు వస్తే బాగుంటుందని ఎదురు చూస్తున్నారు. గతంలో ఈ ఆర్వో ప్లాంట్‌ను ప్రస్తుత రాజ్యసభ సభ్యుడు బీద మస్తాన్‌రావు దాతృత్వంతో ఏర్పాటు చేశారు. మళ్లీ ఎవరైనా కొత్త దాతలు దొరుకుతారా లేకపోతే వైద్యశాల అభివృద్ధి నిధుల నుంచి దానిని నిర్మించాలా అనే సందిగ్ధంలో ఉన్నారు. ఆర్వో ప్లాంట్ ఉంటే అర్ధరాత్రి నీరు అవసరమైనా తెచ్చుకునే వెసులుబాటు ఉండేది. క్యాన్లు సరఫరా చేసినా అవి ఎప్పుడు వస్తాయో ఎప్పుడు అయిపోతాయో అవి ఎక్కడ ఉంటాయో అర్థం కాక రోగులు, వారి సహాయకులు తాగునీటి కోసం ఇబ్బందులు పడుతున్నారు. వైద్యాధికారులు స్పందించి దాతల ద్వారా, వైద్యశాల అభివృద్ధి నిధుల నుంచైనా త్వరగా ఆర్వోప్లాంట్‌ను సిద్ధం చేసి వైద్యశాలలో తాగునీటి ఇబ్బందులు తొలగించాలని కోరుతున్నారు.



ఆటోలో తీసుకువచ్చిన వాటర్ క్యాన్లు



మొగిలిచెర్లలో పౌష్టికాహారాన్ని ప్రదర్శిస్తున్న సూపర్‌వైజర్ రాధాదేవి, తదితరులు

గర్భిణులు, బాలింతలు
పౌష్టికాహారం తప్పనిసరిగా తీసుకోవాలి

లింగసముద్రం, సెప్టెంబరు 24(ఆంధ్రజ్యోతి): గర్భిణులు, బాలింతలు అంగన్వాడీ కేంద్రాలలో ఇచ్చే కోడిగుడ్లు, పాలు, అటుకులు, ఖర్జూరం, రాగిపిండి, బెల్లం, చిక్కీలు తదితర పౌష్టికాహారాన్ని తీసుకోవాలని ఐసీడీఎస్ సూపర్‌వైజర్ ఏవీ రాధాదేవి చెప్పారు. బుధవారం మండలంలోని మొగిలిచెర్ల అంగన్వాడీ కేంద్రంలో పోషణ మాసోత్సవాలు నిర్వహించారు. ఈ సందర్భంగా పౌష్టికాహారాన్ని ప్రదర్శించారు. ఈ కార్యక్రమంలో అంగన్వాడీ కార్యకర్తలు ఏ.మాధవి, ప్రసన్న, సులోచన, ఓబులమ్మ, శ్రీదేవి పాల్గొన్నారు.

పౌష్టికాహారంపై అవగాహన ఉండాలి

బిట్రగుంట, సెప్టెంబరు 24(ఆంధ్రజ్యోతి): గర్భిణులు, బాలింతలు అంగన్వాడీ కేంద్రాల్లో ప్రభుత్వం అందచేస్తున్న పౌష్టికాహారాన్ని తప్పనిసరిగా తీసుకోవాలని వైద్యులు రాజశేఖర్, నిత్యప్రశాంతి అన్నారు. బోగోలు మండలంలోని ఏనుగులబావి, మంగమూరు పంచాయతీలో బుధవారం స్వస్థ్ నారీ సశక్త్ పరివార్ అభియాన్ కార్యక్రమాలు వేర్వేగా నిర్వహించారు. ఈ సందర్భంగా మహిళలు ఎదుర్కొంటున్న పలు వ్యాధుల గురించి అవగాహన కల్పించారు. ఏనుగులబావిలో సర్పంచు ప్రభాకర్‌రెడ్డి, ఏఎంసీ డైరెక్టర్ ఎల్లమ్మ, హెల్త్ సూపర్‌వైజర్ వసంత, అంగన్వాడీ సూపర్‌వైజర్ సౌజన్య, ముంగమూరులో టీడీపీ నేత వై.వెంకటే శ్వర్లు, శ్రీనివాసులురెడ్డి, తదితరులు పాల్గొన్నారు.



పౌష్టికాహారాన్ని ప్రదర్శిస్తున్న వైద్యులు, సిబ్బంది, అంగన్‌వాడీలు

వేధిస్తున్న అధ్యాపకులు,
ఉపాధ్యాయుల కొరత!

- విధులకు హాజరు కాని జూనియర్ అసిస్టెంటు
- ఇది తిమ్మారెడ్డిపాలెం ఏపీ మోడల్ స్కూల్ పరిస్థితి
- ఇబ్బందులు పడుతున్న విద్యార్థులు



తిమ్మారెడ్డిపాలెం ఏపీ మోడల్ స్కూల్

లింగసముద్రం, సెప్టెంబరు 24(ఆంధ్రజ్యోతి) : మండలంలోని తిమ్మారెడ్డిపాలెం ఏపీ మోడల్ స్కూల్‌లో అధ్యాపకులు, ఉపాధ్యాయులు, సిబ్బంది కొరత వేధిస్తోంది. ఈ ఏడాది జూన్‌లో జరిగిన సాధారణ బదిలీల్లో పలు సబ్జెక్టులకు సంబంధించిన ఉపాధ్యాయులు బదిలీపై వెళ్లారు. వారి స్థానంలో ఇక్కడకు ఎవరూ రాలేదు. దీంతో మూడు నెలలుగా ఉపాధ్యాయులు, అధ్యాపకుల, సిబ్బంది పోస్టులు ఖాళీగా ఉండడంతో విద్యార్థులు ఇబ్బందులు పడుతున్నారు. ప్రధానంగా తెలుగు సబ్జెక్టుల పోస్టులు 2, బోటనీ, సైన్సు, సోషల్ సబ్జెక్టు పోస్టులు ఒక్కొక్కటి చొప్పున ఖాళీగా ఉన్నాయి. అయితే బోటనీ సబ్జెక్టుకు జువాలజీ అధ్యాపకురాలు, 6వ రతగతి నుంచి 8వ తరగతి విద్యార్థులకు పీజీటీ తెలుగు అధ్యాపకులు, సైన్సు సబ్జెక్టుకు ఫిజిక్స్, కెమిస్ట్రీ అధ్యాపకులు, సోషల్ సబ్జెక్టుకు ఎకనామిక్స్ సివిక్స్ సబ్జెక్టుల అధ్యాపకుల ద్వారా బోధన చేయస్తూ ప్రిన్సిపాల్ మహమ్మద్ హష్తార్ తాత్కాలికంగా చర్యలు చేపట్టారు. అలాగే స్కూల్‌లో జూనియర్ అసిస్టెంటు ఒకరు ఈ ఏడాది ఏప్రిల్ నెలలో సెలవుపై వెళ్లారు. ఆయన ఇప్పటి వరకు విధుల్లో చేరలేదు.దీంతో ప్రిన్సిపాల్, రికార్డు అసిస్టెంటు, కంప్యూటర్ ఆపరేటర్లు జూనియర్ అసిస్టెంటు పనులు చేయాల్సి వస్తోంది. దీంతో ప్రిన్సిపాల్, విద్యార్థులు, ఉపాధ్యాయులు ఇబ్బందులు పడుతున్నారు. ప్రస్తుతం మోడల్ స్కూల్‌లో 313 మంది విద్యార్థులు 6వ తరగతి నుంచి ఇంటర్మీడియట్ వరకు చదువుతున్నారు. సంబంధిత ఉన్నతాధికారులు స్పందించి తగిన చర్యలు తీసుకోవాలని విద్యార్థులు, వారి తలిదండ్రులు కోరుతున్నారు.

విండ్రో కంపోస్ట్ తయారీ విధానం పరిశీలన



విండ్రో కంపోస్ట్ తయారీ విధానాన్ని పరిశీలిస్తున్న నాయుడుపేట మున్సిపల్ కమిషనర్ ఫజులుల్లా

కావలి, సెప్టెంబరు 24(ఆంధ్రజ్యోతి): కావలి పురపాలకసంఘంలో పారిశుధ్య నిర్వహణ, విండ్రోకంపోస్ట్ తయారీ విధానాలను తెలుసుకుని తమ పురపాక సంఘంలో కూడా అమలు చేసేందుకు బుధవారం నాయుడుపేట మున్సిపల్ కమిసనర్ షేక్ ఫజులుల్లా కావలికి వచ్చారు. పట్టణంలోని కంపోస్ట్‌యార్డులో నూతన సాంకేతిక పరిజ్ఞానంతో తయారు చేస్తున్న విండ్రోకంపోస్ట్ తయారీ విధానాన్ని ఆయన పరిశీలించి అక్కడ సిబ్బందిని అడిగి వివరాలు తెలుసుకున్నారు. అలాగే పట్టణంలో ఇంటింటి నుంచి సేకరించిన చెత్తను తీసుకెళ్లే వాహనాలు వచ్చే వరకు రోడ్డుపై పడేయకుండా చెత్త డబ్బాలను పెట్టేందుకు ఏర్పాటు చేసిన ఇనుప గ్రిల్స్‌తో తయారు చేసిన బోనులను, బ్లాక్ స్పాట్స్‌ను గ్రీన్ స్పాట్స్‌గా మార్చేందుకు ఏర్పాటు చేసిన తులసి వనాలను పరిశీలించి సిబ్బందిని అడిగి తెలుసుకున్నారు. ఈ విధానం బాగుందని కావలి పురపాలకసంఘం పనితీరును అభినందించారు. ఈ కార్యక్రమంలో శానిటరీ ఇన్‌స్పెక్టర్ ఎండీ బషీర్, సిబ్బంది తదితరులు పాల్గొన్నారు.

ప్రతి మహిళ లక్షాధికారి కావాలి

- మున్సిపల్ కమిషనర్ శ్రావణ్‌కుమార్



వస్తువులను తిలకిస్తున్న మున్సిపల్ కమిషన్ శ్రావణ్‌కుమార్

కావలి(టౌన్), సెప్టెంబరు 24(ఆంధ్రజ్యోతి): ప్రతి మహిళ లక్షాధికారి కావాలన్నదే ప్రభుత్వ లక్ష్యమని మున్సిపల్ కమిషనర్ శ్రావణ్ కుమార్ తెలిపారు. రైల్వే రోడ్డులోని మెప్మా కార్యాలయ ప్రాంగణంలో మెప్మా ఆధ్వర్యంలో స్వయం సహాయక సంఘాల సభ్యులు ఏర్పాటు చేసిన అర్బన్ మార్కెట్‌ను బుధవారం శ్రావణ్‌కుమార్ ప్రారంభించారు. ఆయన మాట్లాడుతూ ప్రభుత్వ లక్ష్యం చిన్న వ్యాపారల నుంచి పెద్ద వ్యాపారాలు చేసుకోవాలని, తయారు చేసిన వస్తువులు ఆన్‌లైన్ మార్కెటింగ్ చేసుకునేందుకు అవకాశం కల్పించారని, తద్వారా లాభాలు పొందవచ్చన్నారు. మహిళలు తయారు చేసి ప్రదర్శించిన వస్తువులు, వస్త్రాలు, ఆభరణాలు, ఆహారానికి సంభందించిన రాగిపిండి, మల్టీగ్రెయిన్ పిండి, వడియాలు, ఊరగాయలు, మగ్గం వర్క్ శారీస్, పింగాణి గ్లాసులు బొమ్మలు, ఫినాయిల్, వర్క్ బ్లౌజ్‌లు తదితర వస్తువులు ప్రత్యేక ఆకర్షణగా ఆకట్టుకున్నాయి. కార్యక్రమంలో డీఈ సాయిరామ్, ఇండియన్ బ్యాంక్ మేనేజర్ హరిబాబు, మెప్మా సీఎంఎం భారతి తదితరులు పాల్గొన్నారు.

నూతన విద్యావిధానంపై సెమినార్



సెమినార్‌లో మాట్లాడుతున్న డాక్టరు సుదర్శన్

కందుకూరు, సెప్టెంబరు 24(ఆంధ్రజ్యోతి): బహుజన టీచర్స్ అసోసియేషన్ (బీటీఏ) ఆధ్వర్యంలో నూతన విద్యావిధానంపై బుధవారం స్థానిక బాలుర ఉన్నత పాఠశాలలో సెమినార్ నిర్వహించారు. నూతన విద్యావిధానం-విద్యావ్యవస్థపై దాని ప్రభావం అనే అంశంపై ఉస్మానియా యూనివర్సిటీ అసిస్టెంట్ ప్రొఫెసర్ డాక్టరు సుదర్శన్ బాలబోయిన మాట్లాడుతూ నూతన జాతీయ విద్యావిధానం హిందీ భాషను బలవంతంగా హిందీయేతర రాష్ట్రాలలో ప్రవేశపెట్టడానికి ప్రయత్నిస్తోందని, అంతేగాక వృత్తివిద్యను ప్రవేశపెట్టి సనాతన ధర్మంలోని వివక్షను ప్రోత్సహించే విధంగా ఉందని విమర్శించారు. ఉపాధ్యాయులు విద్యార్థుల సమగ్ర అభివృద్ధికి కృషి చేయాలని, ప్రభుత్వ పాఠశాలల్లో విద్యాభ్యాసం చేసేది నిరుపేద విద్యార్థులే కనుక వారి ఉన్నతికోసం చిత్తశుద్ధితో పాటుపడాలని కోరారు. కార్యక్రమంలో బీటీఏ రాష్ట్ర ప్రధానకార్యదర్శి చిట్టేటి రమేష్, శ్రీమాన ప్రసాద్ తదితరులు పాల్గొన్నారు.

క్యాన్సర్ వ్యాధులపై అవగాహన ఉండాలి



మహిళలకు వ్యాధులపై అవగాహనకలిగిస్తున్న డాక్టర్ గీతారెడ్డి

కలిగిరి, సెప్టెంబరు 24(ఆంధ్రజ్యోతి): స్థానిక ప్రాథమిక ఆరోగ్య కేంద్రం వద్ద బుధవారం స్వస్థ్ నారీ సశక్త్ పరివార్ అభియాన్ కార్యక్రమం వైద్యాధికారిణి డాక్టర్ బిజ్జం గీతారెడ్డి ఆధ్వర్యంలో జరిగింది. ఆమె మాట్లాడుతూ మహిళలు క్యాన్సర్ వ్యాధులపై అవగాహన కలిగి ఉండాలన్నారు. గర్భాశయ ముఖద్వారం, నోటి, రొమ్ము క్యాన్సర్ల గురించి అవగాహన కల్పించారు. ఈ కార్యక్రమంలో జడ్పీటీసీ పాలూరి మాల్యాద్రిరెడ్డి, టీడీపీ మండల కన్వీనర్ బిజ్జం కృష్ణారెడ్డి, సర్పంచు రాగి దివ్య, పీఏసీఎస్ అధ్యక్షుడు కదిరి వెంకటరంగారావు, అంగన్‌వాడీ సీడీపీవో చర్మిష్ట సూపర్ వైజర్ విజయలక్ష్మి, యల్లకర సతీష్, కొప్పోలు కొండలరావు, తదితరులు పాల్గొన్నారు.

నేడు విద్యుత్ సరఫరాకు అంతరాయం

లింగసముద్రం, సెప్టెంబరు 24(ఆంధ్రజ్యోతి) : మండలంలోని మొగిలిచెర్ల, లింసము ద్రం, చినపవని విద్యుత్ సబ్‌స్టేషన్ల పరిధి లోని గ్రామాల్లో గురువారం విద్యుత్ సరఫరాకు అంతరాయం కలుగుతుందని మండల విద్యుత్ శాఖ ఏఈ షేక్ ఫిరోజ్ బుధవారం ఒక ప్రకటనలో తెలిపారు. ఆయా సబ్ స్టేషన్లలో ఆర్‌డీఎస్ఎస్ మెయింటెనెన్స్ పనులు జరుగుతున్నందున ఉదయం 9 గంటల నుంచి మధ్యాహ్నం 3 గంటల వరకు విద్యుత్ సరఫరాను నిలిపి వేస్తున్నట్టు పేర్కొన్నారు. వినియోగదారులు ఈ విషయాన్ని గమనించాలని పేర్కొన్నారు.

భక్తిశ్రద్ధలతో నవరాత్రి ఉత్సవాలు



కలిగిరి : లలిత త్రిపురసుందరీదేవిగా భద్రకాళి



కావలి(టౌన్) : కన్యకాపరమేశ్వరి కుంకుమ సమర్పిస్తున్న భక్తులు

కావలి(టౌన్), సెప్టెంబరు 24(ఆంధ్రజ్యోతి): దేవి శరన్నవరాత్రి ఉత్సవాలు మూడవ రోజు బుధవారం భక్తిశ్రద్ధలతో జరిగాయి. గ్రామదేవత కలుగోళశాంభవి భక్తులకు శ్రీలలితా పరమేశ్వరి దేవి అలంకారంలో దర్శనమిచ్చి రాత్రి వ్యాళీ వాహన సేవలందుకున్నారు. శివాలయంలోని దుర్గాభ్రమరాంబ అమ్మణ్ణి అన్నపూర్ణాదేవి అలంకారంలో, అన్నపూర్ణాదేవి అలకారంలో కొత్తబజారులోని వాసవీకన్యకాపరమేశ్వరి, విష్ణాలయంలోని రాజ్యలక్ష్మి ధాన్యలక్ష్మి అలంకారంలో, వడ్డిపాలెంలోని కనకదుర్గాదేవి గాయిత్రీ దేవి అలంకారంలో దర్శనమిచ్చారు. ఆయా ఆలయాల్లో భక్తులు వేలాదిగా పాల్గొని అమ్మవార్లను దర్శించుకుని పూజలు నిర్వహించారు. విద్యుదీపాలంకరణలు భక్తుల కోలాహలంతో అమ్మవారి ఆలయాల్లో ఆధ్యాత్మిక శోభ సంతరించుకుంది. కన్యకాపరమేశ్వరికి భక్తులు కుంకుమ సమర్పించారు. ఆలయ ప్రాంగణంలో మహిళా భక్తుల కోలాటాలు, సాంస్కృతిక కార్యక్రమాలు ఆకట్టుకున్నాయి.



బిట్రగుంట : అన్నపూర్ణాదేవిగా రాజరాజేశ్వరిదేవి

● అమ్మణ్ణులకు విశేష పూజలు

అల్లూరు: దేవీనవరాత్రులను పురస్కరించుకొని మండలంలోని అన్ని శక్తి ఆలయాల్లో బుధవారం విశేష పూజలు నిర్వహించారు. ముఖ్యంగా అల్లూరులోని పార్వతీదేవి ఆలయం (దసరా దేవాలయం), పోలేరమ్మ, కలుగోళమ్మ, గంగమ్మ, అంకమ్మ, కన్యకా పరమేశ్వరి ఆలయాల్లో విశేష పూజలు నిర్వహించారు. ఆలయాలను పూలతో శోభాయమానంగా తీర్చిదిద్దారు. నార్తుమోపూరులోని పోలేరమ్మ ఆలయం, ఇస్కపల్లిలోని శివాలయంలో ఉదయం నుంచి ప్రత్యేక పూజా కార్యక్రమాలను నిర్వహించారు. బాలాత్రిపుర సుందరి అలంకారంలో కన్యకాపరమేశ్వరి దర్శనమిచ్చారు.



అల్లూరు:బాలాత్రిపుర సుందరిగా కన్యకాపరమేశ్వరి

● అన్నపూర్ణాదేవిగా రాజరాజేశ్వరిదేవి

బిట్రగుంట : బోగోలు మండలం విశ్వనాథరావు పేటలోని కోదండరామస్వామి ఆలయంలో రాజరాజేశ్వ రిదేవి అన్నపూర్ణాదేవిగా భక్తులకు దర్శనమిచ్చారు. రైల్వే పీడబ్ల్యూఐ ఎస్.రాజ్‌కుమార్ సుజాత దంపతులు ఉభయకర్తలుగా వ్యవహరించారు. రామస్వామిపాలెం లోని జ్ఞాన ప్రసూనాంభ సమేత రామలింగేశ్వర స్వామి ఆలయంలో అమ్మవారు అన్నపూర్ణాదేవిగా పూజలందుకున్నారు.

● భద్రకాళికి ప్రత్యేక అభిషేకాలు

కలిగిరి : దేవీ నవరాత్రులలో భాగంగా మండలంలోని తెల్లపాడులో భద్రకాళి అమ్మవారు బుధవారం భక్తులకు లలితత్రిపురసుందరీదేవి అలంకారంలో దర్శనమిచ్చారు. అమ్మవారికి పాలు, పెరుగు, తేనె, నెయ్యి, పన్నీరు, పసుపు, కుంకుమ, ఫలాలతో జరిగిన ప్రత్యేక అభిషేక కార్యక్రమాల్లో భక్తులు పాల్గొని తీర్థప్రసాదాలు స్వీకరించారు. నున్నా వెంకట కొండ య్యాచెంచమ్మ దంపతులు ఉభయకర్తలుగా వ్యవహరించారు. భక్తులు అధిక సంఖ్యలో పాల్గొన్నారు.



కావలి(టౌన్) : అన్నపూర్ణాదేవి అలంకారంలో కన్యకాపరమేశ్వరి





కొడితాడు ఆసరాతో గరుడపతాకం ధ్వజస్తంభం పైకెగసింది. నింగిలో రెపరెపలాడుతూ సకల దేవతా గణానికి స్వాగతం పలికింది. భక్తజనం జయజయనాదాల నడుమ బ్రహ్మోత్సవాల సంబరం ఆరంభం అయింది. తిరుమల కొండంతా దీపకాంతులతో కళకళలాడుతుండగా సీఎం చంద్రబాబు నెత్తిన పట్టు వస్త్రాలు పెట్టుకుని ఊరేగింపుగా కుటుంబంతో కలిసి ఆలయానికి వెళ్లి రాష్ట్రప్రభుత్వం తరపున శ్రీనివాసుడికి సమర్పించారు. ఉపరాష్ట్రపతి రాధాకృష్ణన్‌తో కలిసి రాత్రి పెద్దశేషవాహన సేవలో పాల్గొన్నారు. సాంస్కృతిక దళాల ఆటపాటల నడుమ సాగిన వాహనోత్సవం భక్తకోటికి కనువిందు చేసింది.

తిరుమలేశుని దివ్యోత్సవం



బ్రహ్మోత్సవాలలో నేడు

ఉదయం: 8 - 10 గంటల మధ్య చిన్నశేష వాహనం

రాత్రి: 7 - 9 గంటల మధ్య హంస వాహనం

అంగరంగ వైభవంగా బ్రహ్మోత్సవం ప్రారంభం

> చిన్నప్పటి నుంచీ శ్రీవారిని చూస్తూ పెరిగా. ఏ కష్టం వచ్చినా ఆయనపైనే భారం వేస్తా. బ్రహ్మోత్సవాల్లో 14 సార్లు పట్టువస్త్రాలు సమర్పించే అవకాశాన్ని వేంకటేశ్వరస్వామి నాకు ఇచ్చారు. ఇది ఎవరికీ దక్కని అవకాశం. రాష్ట్రంలోని ప్రతి గ్రామంలో, దేశంలోని అన్ని రాజధానుల్లో శ్రీవారి ఆలయాలు ఉండాలి. స్వామివారికి అతిపెద్ద సంపద శ్రీవారి సేవకులే.
>
> - పట్టువస్త్రాల సమర్పణ సందర్భంగా ముఖ్యమంత్రి చంద్రబాబు

తిరుమల, సెప్టెంబరు 24(ఆంధ్రజ్యోతి): తిరుమల వేంకటేశ్వరస్వామి బ్రహ్మోత్సవాల్లో భాగంగా తొలిరోజైన బుధవారం రాత్రి శ్రీదేవి, భూదేవి సమేత మలయప్పస్వామి పెద్దశేష వాహనంలో ఊరేగుతూ భక్తులను కటాక్షించారు. ఏడు తలల స్వర్ణశేష వాహనంపై పరమపద వైకుంఠనాథుడి అలంకారంలో మాడవీధుల్లో ఊరేగారు. రాత్రి 9 నుంచి 11 గంటల మధ్య మంగళవాయిద్యాలు, వేదమంత్రాలు, కళాబృందాల ప్రదర్శనలు, గోవింద నామస్మరణల నడుమ పెద్దశేష వాహనంపై శ్రీనివాసుడు దర్శనమిచ్చాడు. అంతకుముందు పట్టువస్త్రాలు సమర్పించిన ముఖ్యమంత్రి చంద్రబాబు , మంత్రి నారా లోకేశ్ దంపతులు, అలాగే ఉపరాష్ట్రపతి రాధాకృష్ణన్ వాహన మండపంలో ఉత్సవర్లను దర్శించుకున్నారు.అర్చకులు వారికి హారతి ఇచ్చి శఠగోపంతో ఆశీర్వదించారు.వాహన సేవలో మాడవీధులు సాంస్కృతిక కార్యక్రమాలతో మార్మోగాయి. కోలాటాలు, డప్పువాయిద్యాలు, చెక్కభజన బృందాల నడుమ వివిధ దేవతామూర్తుల అలంకరణలతో కళాకారులు పాల్గొన్నారు.తొలిరోజు వాహనసేవలో భక్తుల రద్దీ తక్కువగానే కనిపించింది.

ఆగమోక్తంగా ధ్వజారోహణం

శ్రీవారి ఆలయంలో బుధవారం సాయంత్రం 5.43 - 6.15 గంటల మధ్య మీనలగ్నంలో జరిగిన ధ్వజారోహణ ఘట్టంతో వార్షిక బ్రహ్మోత్సవాలు ప్రారంభమయ్యాయి. శ్రీదేవి, భూదేవి సమేత మలయప్పస్వామి సమక్షంలో వేద గానాలు, మంగళవాయిద్యాల మధ్య అర్చకస్వాములు బంగారు ధ్వజస్తంభంపై గరుడ ధ్వజపటాన్ని ఎగురవేసి సకల దేవతలను, అష్టదిక్పాలకులను బ్రహ్మోత్సవాలకు ఆహ్వానించారు.

శ్రీవారిని దర్శించుకున్న ఉపరాష్ట్రపతి

ఉపరాష్ట్రపతి సీపీ రాధాకృష్ణన్ బుధవారం రాత్రి తిరుమల శ్రీవారిని దర్శించుకున్నారు. ఆలయం వద్దకు చేరుకున్న ఉప రాష్ట్రపతికి సీఎం చంద్రబాబు, టీటీడీ చైర్మన్ బీఆర్ నాయుడు, ఈవో అనిల్‌కుమార్ సింఘాల్ స్వాగతం పలికారు. అనంతరం మహాద్వారం నుంచి ఆలయంలోకి వెళ్లిన రాధాకృష్ణన్ ముందుగా ధ్వజస్తంభానికి మొక్కుకుని తర్వాత గర్భాలయంలోని మూలమూర్తిని దర్శించుకున్నారు. అనంతరం ఆలయం వెలుపలకు వచ్చి అప్పటికే వాహనమండపంలో ఉన్న సీఎం చంద్రబాబుతో కలిసి పెద్దశేషవాహనంపై ఉన్న ఉత్సవమూర్తులను దర్శించుకున్నారు.



బాబు వెనుకే తమన్

తిరుమల, సెప్టెంబరు 24(ఆంధ్రజ్యోతి): పట్టువస్త్రాలు సమర్పించడానికి వచ్చిన సీఎం చంద్రబాబు వెంటే సంగీత దర్శకుడు తమన్ ఉండటం హాట్‌టాపిక్‌గా మారింది. సీఎం రాకముందే తమన్ వైకుంఠం క్యూకాంప్లెక్స్ ద్వారా ఆలయంలోకి వెళ్లారు. కొంత సమయానికే వెలుపలకు వచ్చి అఖిలాండం నుంచి పట్టువస్త్రాలు తీసుకొస్తున్న సీఎం కుటుంబ సభ్యులతో కలిసిపోయారు. ఆ తర్వాత బయోమెట్రిక్ నుంచి తిరిగి ఆలయంలోకి ప్రవేశించారు. సాధారణంగా ఇలా బయోమెట్రిక్ నుంచి ప్రవేశించడం నిషేధం. అయితే వీవీఐపీతో వచ్చిన కొందరికి ఈ వెసులుబాటు ఉంటుందని అధికారులు తెలిపారు. మరోవైపు టీటీడీ మాజీ సభ్యుడు పసుపులేటి హరిప్రసాద్ మహాద్వారం నుంచి ఆలయంలోకి వెళ్లడం విమర్శలకు దారి తీసింది.



'ఆల్తూరుపాడు' పూర్తి చేయండి



డక్కిలి మండలంలోని ఆల్తూరుపాడు వద్ద రూ.630 కోట్లతో రిజర్వాయరు నిర్మాణం పూర్తి చేస్తేనే మెట్ట రైతులకు సాగు.. తిరుపతి, తిరుమలకు తాగునీరు అందుతుంది. గత వైసీపీ ప్రభుత్వంలో ఈ ప్రాజెక్టు నిరాదరణకు గురవడంతో.. ఈ ప్రాంత రైతులు కూటమి ప్రభుత్వంపై కొండంత ఆశ పెట్టుకున్నారు. ఈ ప్రాజెక్టు పూర్తయితే 1.60 లక్షల ఎకరాలకు సాగునీరు.. 2.50 లక్షల జనాభాకు తాగునీటి అవసరాలు తీరుతాయి.

- కురుగొండ్ల రామకృష్ణ, వెంకటగిరి ఎమ్మెల్యే

ఆనందంగా అమరావతికి

- 80 బస్సుల్లో బయలుదేరిన భావి ఉపాధ్యాయులు
- నేడు సీఎం చేతులమీదుగా నియామక పత్రాల స్వీకరణ



సహాయకులతో కలిసి బస్సులో బయలుదేరిన డీఎస్సీ అభ్యర్థులు

తిరుపతి(విద్య), సెప్టెంబరు 24 (ఆంధ్రజ్యోతి): ఉమ్మడి జిల్లా నుంచి డీఎస్సీకి ఎంపికైన.. భావి ఉపాధ్యాయులు బుధవారం అమరావతికి పయనమయ్యారు. నియామక పత్రాలు అందుకునేందుకు వీరంతా ఉత్సాహంగా కదలివెళ్లారు. రాష్ట్రవ్యాప్తంగా ఎంపికైన అభ్యర్థులందరికీ గురువారం అమరావతిలో ముఖ్యమంత్రి చంద్రబాబు నియామకపత్రాలు అందజేయనున్నారు. ఈనెల 18నే ఈ కార్యక్రమం జరగాల్సి ఉన్నా, భారీ వర్షాల వల్ల 25వ తేదీకి వాయిదా పడిన విషయం తెలిసిందే. ఈ క్రమంలో గురువారం నియామక పత్రాలు అందుకోవడానికి ఉమ్మడి చిత్తూరు జిల్లా నుంచి 1532 మందికి గాను 1484 మంది, వారి సహాయకులు మరో 1484 మంది 80 బస్సుల్లో బుధవారం ఉదయం బయలుదేరి వెళ్లారు. అనారోగ్యం, ఇతర కారణాలవల్ల 48 మంది వెళ్లలేకపోయారు. వీరందరికీ 380 మంది రూట్ ఆఫీసర్లు మార్గదర్శకులుగా వ్యవహరిస్తారని డీఈవో కేవీఎన్ కుమార్ తెలిపారు. అభ్యర్థులకు రవాణా, వసతి ప్రభుత్వమే కల్పించిందన్నారు.

ఉదయం 5 నుంచే రిజిస్ట్రేషన్

ఉమ్మడి జిల్లాలోని అభ్యర్థులు వేకువజామున 4 గంటలనుంచే తిరుపతి- రేణిగుంట మార్గంలోని చదలవాడ రమణమ్మ ఇంజినీరింగ్ కళాశాలకు చేరుకోవడం మొదలు పెట్టారు. దీంతో ఉదయం 5 గంటలకే రిజిస్ట్రేషన్ ప్రారంభించారు. 9.30 గంటలకంతా వీరి రిజిస్ట్రేషన్ పూర్తయింది. అల్పాహారం తీసుకున్నాక 10 గంటలకు అమరావతికి బస్సులు బయలుదేరాయి. అభ్యర్థులు, సహాయకులే కాకుండా వీడ్కోలు పలికేందుకు ఇతర కుటుబ సభ్యులుకూడా ఇంజినీరింగ్ కళాశాలకు చేరుకోవడంతో అక్కడ పండగ వాతావరణం నెలకొంది.

మధ్యాహ్న భోజనం: కొందరికి గూడూరు, మరికొందరికి నెల్లూరు


రాత్రి బస: గుంటూరు

> డీఎస్సీకి ఎంపికైంది: 1532 మంది
> (మహిళలు 774, పురుషులు 758)
> అమరావతికి వెళ్లింది: 1,484 మంది
> (మహిళలు 729, పురుషులు 755)
> వివిధ కారణాలతో వెళ్లనివారు: 48 మంది
> సహాయకులు: మరో 1,484 మంది
> రూట్ ఆఫీసర్లు: 380 మంది
> సిబ్బంది సహా మొత్తం: 3,368 మంది

బ్రహ్మోత్సవాలకు అటవీ శాఖ సిద్ధం

మంగళం, సెప్టెంబరు 24(ఆంధ్రజ్యోతి): తిరుమల శ్రీవారి బ్రహ్మోత్సవాలకు అటవీశాఖ సిద్ధమైంది. నడకదారి భక్తుల రక్షణకు ప్రత్యేక చర్యలు చేపట్టింది. అక్టోబరు 2 వరకు సిబ్బందికి సెలవులు రద్దు చేశారు. ఎస్వీ జూపార్కుకు చెందిన ఇద్దరు స్నేక్ క్యాచర్లను తిరుమలలో ఉంచాలని నిర్ణయించారు. లక్ష్మీనరసింహ స్వామి ఆలయం వద్ద చిరుత సంచారం నేపథ్యంలో ఒక సెక్షన్ ఆఫీసర్‌తోపాటు బీట్ ఆఫీసర్ 15మంది వాచర్లు, వెటర్నరీ డాక్టర్‌ను నియమించారు. నడక దారిలో చిరుతలు, ఎలుగుబంట్లు, ఏనుగుల సంచారంపై అటవీశాఖ ప్రత్యేక నిఘా ఉంచింది.









అమ్మవార్లకు శరన్నవరాత్రి అలంకరణలు

సూళ్లూరుపేట: అన్నపూర్ణగా చెంగాళమ్మ అమ్మవారు

చిల్లకూరు: గాయత్రీదేవిగా తూర్పు కనుపూరులోని ముత్యాలమ్మ


తిరుపతి: గాయత్రీదేవి అలంకారంలో తాతయ్యగుంట గంగమ్మ

శ్రీకాళహస్తి: తపస్సు అలంకారంలో జ్ఞానప్రసూనాంబ



సేవింతురే!

బ్రహ్మోత్సవాలకు నాంది పలికిన పల్లవరాణి సామవై



చిత్రం: సింగంపల్లి సత్యనారాయణ

తిరుమల బ్రహ్మోత్సవాలకు శ్రీకారం చుట్టింది పల్లవరాణి సామవై. క్రీ.శ.966లో ఆమె వెండితో రూపొందించిన భోగశ్రీనివాసమూర్తిని ఆలయంలో ప్రతిష్ఠించారు. మూల విగ్రహానికి సామ్యంగా అమరిన ఈ ఉత్సవమూర్తిని మనవాళ పెరుమాళ్ అనేవారు. వైభవోపేతంగా సాగిన ఆనాటి ప్రతిష్ఠాపన క్రతువే తిరుమల ఉత్సవాలకు నాంది అని అంటారు. ఏడాదికి రెండు బ్రహ్మోత్సవాలు జరిగేలా సామవై నిర్ణయించి జరిపించారు. 10వ శతాబ్దం దాకా ఏటా రెండు బ్రహ్మోత్సవాలు జరిగినట్టు ఆధారాలున్నాయి. తొమ్మిదిరోజుల వేడుకలు ఆమె ప్రారంభించినవే. 966 ఆగస్టు 27న మొదలైన ఈ వేడుకలే తొలి పురటాసి బ్రహ్మోత్సవాలు. ఉత్సవ మూర్తికి పల్లవరాణి అనేక ఆభరణాలను కూడా సమకూర్చారు. ఉత్సవాలకు రథాలు ఏర్పాటు చేశారు. శ్రీవారి మూలవిరాట్టు పాదాల చెంత పద్మపీఠానికి అనించి ఉంచిన భోగశ్రీనివాసుని భక్తులు దర్శించవచ్చు.



శ్రీవారి సేవలో ఉపరాష్ట్రపతి

తిరుమల, సెప్టెంబరు24(ఆంధ్రజ్యోతి): భారత ఉపరాష్ట్రపతి సీపీ రాధాకృష్ణన్ బుధవారం రాత్రి శ్రీవారి ఆలయం వద్దకు చేరుకోగా సీఎం చంద్రబాబు, టీటీడీ చైర్మన్ బీఆర్ నాయుడు, ఈవో అనిల్‌కుమార్ సింఘాల్ స్వాగతం పలికారు. మహ ద్వారం నుంచి ఆలయంలోకి వెళ్లిన ఆయన స్వామిని దర్శించుకున్నారు. సీఎం చంద్రబాబుతో కలిసి వాహన మండపంలో పెద్దశేషవాహనంపై ఉత్సవమూర్తులను దర్శనం చేసుకున్నారు.


సర్వదర్శనానికి 12 గంటలు

తిరుమల వేంకటేశ్వరస్వామి దర్శనానికి 12 గంటల సమయం పడుతోంది. బుధవారం సాయంత్రం 5 గంటల వరకు ఉన్న సమాచారం మేరకు వైకుంఠం క్యూకాంప్లెక్స్2లో 22 కంపార్టుమెంట్లలో సర్వదర్శన భక్తులు, వైకుంఠం క్యూకాంప్లెక్స్1లో 5 కంపార్టుమెంట్లలో టైంస్లాట్ భక్తులు వేచి ఉన్నారు.

సోమవారం హుండీ ఆదాయం: రూ.2.85 కోట్లు

మంగళవారం శ్రీవారిని దర్శించుకున్న భక్తులు: 63,837


తలనీలాలు సమర్పించినవారు: 20,904







శ్రీవారి ఆలయంలోని రంగనాయక మండపంలో చంద్రబాబు కుటుంబీకులు.. సీఎంతో బోర్డు చైర్మన్, సభ్యులు, అధికారులు



నాడు : 1970ల నాటి ధ్వజారోహణం









బుధవారం రాత్రి పెద్దశేష వాహన సేవ ముందు కళా ప్రదర్శనలు



నేడు : బుధవారం జరిగిన ధ్వజారోహణం



ఊరేగిన ధ్వజపటం

ధ్వజారోహణంకి ముందు శుక్రవారం తిరుమల మాడవీధుల్లో ధ్వజపటం ఊరేగింపు వైభవంగా జరిగింది. గరుడకేతన ప్రతిష్ఠ, కంకణధారణ, ఆలయ ఆవరణంలో జరిగాయి. బయట అష్టదిక్కుల్లో అర్చకులు బలినివేస్తూ ఆలయం ముందుకు వచ్చారు. వారి వెనుకనే శ్రీదేవి, భూదేవి సమేత శ్రీమలయప్పస్వామి, అనంత, గరుడ, విష్వక్సేన, సుగ్రీవ, హనుమంతులను, ధ్వజపటాన్ని మాడవీధుల్లో ఊరేగిస్తూ సకలదేవతా మూర్తులకు ఆహ్వానం పలికారు. అనంతరం ఉత్సవ మూర్తులతో పాటు ధ్వజపటాన్ని ఆలయంలోకి తీసుకు వెళ్లి ధ్వజారోహణం నిర్వహించారు.

\- తిరుమల, ఆంధ్రజ్యోతి







ఫల, పుష్ప ప్రదర్శన శాల ప్రారంభం

తిరుమల, సెప్టెంబరు24(ఆంధ్రజ్యోతి): తిరుమల బ్రహ్మోత్సవాల్లో ప్రత్యేక ఆకర్షణ ఫల, పుష్ప, ఫొటో ప్రదర్శన. కల్యాణవేదిక వద్ద ఏర్పాటు చేసిన ఈ ప్రదర్శనను, రాంభగీచా-2లో ఏర్పాటు చేసిన మీడియా సెంటర్‌ను బుధవారం టీటీడీ చైర్మన్ బీఆర్ నాయుడు ప్రారంభించారు. టీటీడీ బోర్డు సభ్యులు పనబాక లక్ష్మి, జానకీదేవి, శాంతారామ్, నరేష్‌కుమార్, జంగా కృష్ణ మూర్తిలతో కలిసి పలు స్టాల్స్‌ను సందర్శించారు. ఏర్పాటు చేసిన వివిధ శాఖలను అభినందించారు. సీవీఆర్వో రవి, గార్డెన్ డిప్యూటీ డైరెక్టర్ శ్రీనివాసులు, ఎస్వీ ఆయుర్వేద కళాశాల ప్రిన్సిపాల్ రేణుదీక్షిత్, ఎస్వీ శిల్ప కళాశాల ప్రిన్సిపాల్ వెంకటరెడ్డి ఈ కార్యక్రమంలో పాల్గొన్నారు.

పుష్ప ప్రదర్శన శాలలో 90 వేల మొక్కలు

వివిధ రంగుల్లో 18 రకాల జాతులను ప్రదర్శనకు ఉంచారు. కూరగాయలు, పండ్లు, పుష్పాలతో రూపొందించిన జంతువులు, పక్షల బొమ్మలు సందర్శకులను ఆకర్షిస్తున్నాయి. ఆనందనిలయ విమాన వేంకటేశ్వరుని మోసుకెళుతున్న మహాగరుడుడు సైకత శిల్పాన్ని బెంగుళూరుకు కళాకారిణి గౌరి రూపొందించారు. మూడు యుగాలకు సంబంధించిన 14 ఘట్టాలను కళ్లకుకట్టినట్టు చూపేలా ప్రతిమలను ఏర్పాటు చేశారు. మ్యూజిక్, డైలాగులు వినిపించడం వీటి ప్రత్యేకత. టీటీడీ గార్డెన్ విభాగం అధికారులు రూపొందించిన ఘటోత్కచ, బకాసుర, సురస, ద్రౌపతి స్వయంవరం వంటి పురాణ నేపథ్య పుష్ప అలంకరణలు ప్రత్యేక ఆకర్షణగా నిలిచాయి. ఆయుర్వేద, అటవీశాఖల స్టాల్స్, శిల్పకళాశాలల స్టాల్స్ భక్తులను ఆకట్టుకుంటున్నాయి. టీటీడీ పబ్లికేషన్స్ విభాగం అగర బత్తి స్టాల్‌ను ఏర్పాటు చేసింది.







ద్రౌపది స్వయంవరం



ఫలపుష్ప ప్రదర్శన శాలలో ఏర్పాటు చేసిన 'ద్రౌపది స్వయంవరం' సెట్టింగ్ ప్రత్యేక ఆకర్షణగా దర్శనమిస్తోంది. గతేడాది 'సీతా స్వయంవరం' స్థానంలోనే దీనిని ప్రస్తుతం ఏర్పాటు చేశారు. 20 రోజుల పాటు 20 మంది నిపుణులు 60 అడుగుల వెడల్పు, 39 అడుగుల ఎత్తుతో నిర్మించిన ఈ సెట్టింగ్ కోసం కృషి చేశారు.



ఎగ్జిబిషన్ ప్రారంభించి పాత చిత్రాలు తిలకిస్తున్న బీఆర్ నాయుడు

పాత చిత్రాల విందు

శ్రీవారి బ్రహ్మోత్సవాల సందర్భంగా కల్యాణ వేదికలో ఏర్పాటు చేసిన ఫొటో ఎగ్జిబిషన్‌లో తిరుమల, తిరుపతికి సంబంధించిన పాత ఫోటోలు విశేషంగా ఆకట్టుకుంటున్నాయి. 1940 నుంచి భిన్న ప్రదేశాల్లో భిన్న సందర్భాల్లో తీసిన ఫోటోలు ఇందులో ఉన్నాయి. ఒకే ప్రదేశం నాడు-నేడు అంటూ ఏర్పాటు చేసిన ఫోటోలను సందర్శకులు ఆసక్తిగా తిలకించారు.

మూలస్థాన ఎల్లమ్మకు వెండి గజ వాహనం



వెండి గజ వాహనం

చంద్రగిరి, సెప్టెంబరు 24(ఆంధ్రజ్యోతి): చంద్రగిరిలోని మూలస్థాన ఎల్లమ్మకు రూ.కోటి విలువైన వెండి గజ వాహనం వితరణగా అందింది. చంద్రగిరికి చెందిన జీఆర్ విజయరాఘవులు, బేబిరాణి, జీఆర్ చక్రపాణి, సత్యనాయణన్, హేమావతి వితరణగా అందించారు. దీని బరువు 75 కిలోలు. వినాయక స్వామి ఆలయంలో గజవాహనానికి ప్రత్యేక పూజలు నిర్వహించి, ఊరేగింపుగా ఎల్లమ్మ ఆలయానికి తీసుకొచ్చారు. ఎమ్మెల్యే పులివర్తి నాని పాల్గొని వాహనాన్ని మోశారు. ఆలయ చైర్మన్ మొక్కల చంద్రశేఖర్‌రెడ్డి, ఏఎంసీ చైర్మన్ గౌస్‌బాషా, టీడీపీ మండలాధ్యక్షుడు బాలకృష్ణమూర్తి, సింగిల్ విండో చైర్మన్ రాజులుగారి వినోద్‌రెడ్డి, టీడీపీ మండల ప్రధాన కార్యదర్శి కొండూరు ప్రవీణ్‌రాయల్, నాయకులు పాల్గొన్నారు.



ఊరేగింపుగా వెండి గజ వాహనాన్ని తీసుకువస్తున్న ఎమ్మెల్యే నాని, మొక్కల చంద్రశేఖర్‌రెడ్డి తదితరులు

తిరుపతిలో తెలంగాణ యువకుడి హత్య

● రైలు పట్టాల పక్కన ఘాతుకం



సతీష్‌కుమార్ (ఫైల్ ఫొటో)

తిరుపతి(నేరవిభాగం), సెప్టెంబరు 24 (ఆంధ్రజ్యోతి): తెలంగాణ రాష్ట్రం కామారెడ్డి జిల్లా రాజంపేట మండలం ఆర్‌గొండ గ్రామానికి చెందిన తమన్నగారి సతీష్‌కుమార్ (23) తిరుపతిలో బుధవారం మధ్యాహ్నం హత్యకు గురయ్యారు. ఆర్టీసీ బస్టాండు సమీపంలోని రైలు పట్టాల పక్కన ఈ ఘాతుకం జరిగింది. తిరుపతి రైల్వే సీఐ ఆశీర్వాదం తెలిపిన ప్రకారం.. ఆర్‌గొండ గ్రామానికి చెందిన సతీష్‌కుమార్ ఒక్కడే కుమారుడు. ప్రైవేటు విద్యాసంస్థలో పీఈటీగా పనిచేస్తున్న ఇతడికి ఏడాది కిందట వివాహమైంది. గత ఆగస్టు నెలలో వివాహ వార్షికోత్సవం జరిగింది. తర్వాత ఆయన భార్య అలిగి వెళ్లిపోయింది. తర్వాత పీఈటీ ఉద్యోగాన్ని మానేసిన సతీష్‌కుమార్ ఖాళీగా ఉన్నారు. ఈనెల 22న కామారెడ్డి నుంచి రాయలసీమ ఎక్స్‌ప్రెస్‌లో బయలుదేరి మంగళవారం మధ్యాహ్నం తిరుపతికి చేరుకున్నారు. ఆర్టీసీ బస్టాండు వద్దనున్న ఓ దుకాణంలో మద్యం తాగినట్లు పోలీసులు చెబుతున్నారు. ఆ తర్వాత ఏం జరిగిందో గానీ బుధవారం మధ్యాహ్నం దాదాపు 12.30 గంటల ప్రాంతంలో ఆర్టీసీ బస్టాండుకు సమీపంలోని రైల్వే ట్రాక్ పక్కన, 91-40 విద్యుత్ స్తంభం వద్ద దుండగులు పగులకొట్టిన మద్యం సీసాతో ఇతడి గొంతు కోశారు. వారి నుంచి తప్పించుకున్న సతీష్ కొంత దూరం పరుగెత్తు కుంటూ వెళ్లి కింద పడి మృతి చెందినట్లు అక్కడి పరిస్థితులను బట్టి తెలుస్తోంది. పట్టాల పక్కన మృతదేహం ఉన్న విషయాన్ని కొందరు రైల్వే ప్రయాణికులు రైల్వే ఎస్ఐ రత్నమాలకు ఫోనుచేసి సమాచారమిచ్చారు. దీంతో రైల్వే సీఐ ఆశీర్వాదం, ఎస్ఐ ధర్మేంద్ర రాజు, తిరుపతి ఈస్ట్ సీఐ శ్రీనివాసులు, డాగ్ స్క్వాడ్, ఫోరెన్సిక్ అధికారులు జయశ్రీ, డాక్టర్ రాజశేఖర్, డాక్టర్ రాజేష్‌గాంధీ, వేలిముద్ర నిపుణులు సంఘటనా స్థలాన్ని పరిశీలించారు. హత్యకు ఉపయోగించిన మద్యం సీసా, పీఈటీగా పనిచేసిన ఐడీ కార్డు, ఆధార్, పాస్‌పోర్టు, రైలు టికెట్, సెక్యూరిటీ గార్డు పోస్టుకు సంబంధించి రెజ్యూమ్‌ను స్వాధీనం చేసుకున్నారు. ఐడీ కార్డుల్లోని సెల్‌ఫోను నెంబర్ల ఆధారంగా కుటుంబీకులకు సమాచారం అందించారు. సాయంత్రం తిరుపతి రైల్వే ఇన్‌చార్జి డీఎస్పీ శ్రీనివాసాచారి ఘటనా స్థలాన్ని పరిశీలించారు. ఈ హత్యకు కారణం ఆయన గ్రామానికి సంబంధించి ఎవరితోనైనా ఆర్థిక లావాదేవీలా లేదా వివాహేతర సంబంధమా? లేకుంటే మద్యం మత్తులో స్థానికంగా ఘర్షణ పడటంతో హత్య చేశారా అనే కోణాల్లో రైల్వే సీఐ ఆశీర్వాదం కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నారు. మృతదేహాన్ని పోస్టుమార్టం నిమిత్తం రుయాస్పత్రికి తరలించారు.

డాగ్ స్క్వాడ్‌తో పరిశీలన

మృతదేహం వద్ద నుంచి ఆర్టీసీ బస్టాండు దగ్గర్లోని బార్ వద్దకు.. అక్కడ్నుంచి అంబేడ్కర్ విగ్రహం, మఫీ బస్టాండులోని వినాయక విగ్రహం వరకు పోలీస్ జాగిలం టైగర్ వెళ్లి ఆగిపోయింది. దీన్ని బట్టి హంతకులు హత్య చేశాక బస్సులో పారిపోయి ఉంటారని పోలీసులు భావిస్తున్నారు.

స్విమ్స్‌లో 25 వేల గుండె చికిత్సలు

తిరుపతి(వైద్యం), సెప్టెంబరు 24(ఆంధ్రజ్యోతి): స్విమ్స్ కార్డియాలజీ విభాగం ప్రారంభించిన 32 ఏళ్లలో 25 వేల గుండె చికిత్సను విజయవంతంగా నిర్వహించినట్లు కార్డియాలజీ విభాగాధిపతి డాక్టర్ రాజశేఖర్ బుధవారం ఒక ప్రకటనలో తెలిపారు. స్విమ్స్‌లో 1993లో కార్డియాలజీ విభాగం స్థాపించగా, అదే ఏడాది క్యాథ్‌ల్యాబ్‌ను ప్రారంభించినట్లు పేర్కొన్నారు. మొదటి గుండె చికిత్సను 1994లో మొదలు పెట్టి ఇప్పటి వరకు 25 వేల గుండె చికిత్సలను నిర్వహించడం గొప్ప విషయమన్నారు. వీటిల్లో ఎన్టీఆర్ వైద్యసేవ, టీటీడీ ప్రాణదాన పథకాల కింద 85 శాతం పేదలకు ఉచిత చికిత్సలు అందించామన్నారు.

సైబర్ నేరగాళ్ల బురిడీ

● వృద్ధుడి ఖాతాలో రూ.1.58 లక్షలు హాంఫట్

తిరుపతి(నేరవిభాగం), సెప్టెంబరు 24(ఆంధ్రజ్యోతి): సైబర్ కేటుగాళ్లు రోజుకో రూపంలో బురిడీ కొట్టిస్తున్నారు. తిరుపతికి చెందిన ఓ వృద్ధుడు తాజాగా వీరిలో వలలో చిక్కి రూ. 1.58 లక్షలు పోగొట్టుకున్నాడు. స్థానిక విజయనగర్ కాలనీకి చెందిన 65 ఏళ్ల వ్యక్తికి గుర్తు తెలియని వ్యక్తి మూడు రోజుల క్రితం వాట్సాప్ కాల్ చేశాడు. ఇంట్లో ఉంటూనే చిన్న వ్యాపారం చేసుకుని సొమ్ము ఆర్జించవచ్చని నమ్మబలికాడు. తమ వాట్సాప్ నెంబరుకు హాయ్ అని పెడితే మిగిలిన వివరాలు పంపుతామన్నాడు. దీంతో బాధితుడు కుమార్తె ద్వారా హాయ్ అని పెట్టించాడు. వెంటనే సైబర్ మోసగాళ్లు మరో అడుగేసి బ్యాంకు ఖాతా,ఆధార్ వివరాలు పంపితే చిరు వ్యాపారానికి సంబంధించి పెట్టుబడి పంపుతామని బురిడీ కొట్టించాడు. సదరు వ్యక్తి వివరాలు పంపగానే బ్యాంకు ఖాతాలోని రూ.1.58 లక్షలు కాజేశారు. మొబైల్‌కు విత్‌డ్రా మెసేజ్ రావడంతో బాధితుడు లబోదిబోమంటూ 1930కి కాల్ చేసి ఫిర్యాదు చేశారు.

బెడిసికొట్టిన అరెస్ట్ డ్రామా కాల్

తిరుపతి(నేరవిభాగం), సెప్టెంబరు 24(ఆంధ్రజ్యోతి): కొడుకును అరెస్టు చేశామంటూ ఒక కళాకారుడికి టోపీ వేసేందుకు సైబర్‌నేరగాడు చేసిన విఫలయత్నమిది. ఎంఆర్‌పల్లికి చెందిన ఎమ్మాని వెంకటేశ్వర్లు అనే మ్యూజిక్ లెక్చరర్‌కు బుధవారం ఓ అజ్ఞాత వ్యక్తి నుంచి వాట్సాప్ కాల్ వచ్చింది. ఎస్ఐ యూనిఫాంలో అతని డీపీ ఉంది. మీ హైదరాబాదులో ఉన్న కుమారుడ్ని ఒక కేసులో అరెస్ట్ చేశామన్నాడు. రూ.20వేలు ఫోన్‌పే ద్వారా పంపకపోతే బయటకు రాడంటూ బెదిరించాడు. అబ్బాయితో మాట్లాడించండని వెంకటేశ్వర్లు గట్టిగా గద్దించగా చిన్నబాబుది ఏడుపు స్వరం వినిపించాడు. తనకు హిందీ తెలియదని, ఇంగ్లీషులో మాట్లాడాలని వెంకటేశ్వర్లు రెట్టించేసరికి ఆ సైబర్ నేరగాడు డబ్బులు పంపుతారా లేదా అంటూ హెచ్చరించి ఫోన్ పెట్టేశారు. తన ఖాతాలో డబ్బులు లేకపోవడంతో నష్టం జరగలేదని వెంకటేశ్వర్లు ఆంధ్రజ్యోతికి చెప్పారు.



చిల్లకూరు: ధాన్యలక్ష్మీదేవి అలంకారంలో ఆదిలక్ష్మి - డక్కిలి: లలితా త్రిపుర సుందరి అలంకరణలో పార్వతీదేవి



నాయుడుపేట: పార్వతీదేవి అలంకారంలో మూకాంబికాదేవి



సూళ్లూరుపేట చెంగాలమ్మ ఆలయానికి సారె తీసుకెళ్తున్న మన్నారుపోలూరు, నూకలపాలెం గ్రామస్తులు - భువనేశ్వరి అలంకారంలో కన్యకాపమేశ్వరి



కోట: అన్నపూర్ణదేవి అలంకరణలో దుర్గాదేవి, లలితా త్రిపురసుందరిదేవి అలంకరణలో వాసవీ కన్యకాపరమేశ్వరి

అమ్మ రూపం... అపురూపం

సూళ్లూరుపేట, సెప్టెంబరు 24(ఆంధ్రజ్యోతి): దేవి నవరాత్రి ఉత్సవాల్లో భాగంగా సూళ్లూరుపేటలోని చెంగాళమ్మ అన్నపూర్ణ అలంకారంలో దర్శనమిచ్చారు. ఉదయం అమ్మవారికి అభిషేకానంతరం పుష్పాంకరణ చేశారు. మహా చండీయాగం నిర్వహించారు. సాయంత్రం మన్నారుపోలూరు, నూకలపాలెం, వట్రపాలెం గ్రామస్తులు అమ్మవారికి సారె సమర్పించారు. సారె తీసుకొచ్చిన గ్రామస్తులకు ఆలయ రాజగోపురం వద్ద సహాయ కమిషనర్ ప్రసన్నలక్ష్మి స్వాగతం పలికారు. అమ్మవారి అలంకారానికి టీడీపీ నేత కొండేపాటి గంగాప్రసాద్, కోమలి దంపతులు, చండీయాగానికి హైదరాబాదుకు చెందిన బారతుల కల్యాణ్ కుమార్, గాయత్రి దంపతులు ఉభయ కర్తలుగా వ్యవహరించారు. అలాగే నాగేశ్వరస్వామి ఆలయంలో అమ్మవారిని రాజరాజేశ్వరిగా అలంకరించారు. ఈశ్వరవాక సుందర్‌రెడ్డి, ప్రభావతి దంపతులు ఉభయ కర్తలుగా వ్యహరించారు. అదేవిధంగా వాసలి కన్యకా పరమేశ్వరిని భువనేశ్వరిగా అలంకరించారు. అలవల సత్య నారాయణ దంపతులు, ఓలేటి సుబ్రహ్మణ్యం, పాబోలు, మాలేపాటి సుధాకర్ దంపతులు ఉభయకర్తలుగా వ్యవహరించారు.

నాయుడుపేట: పట్టణంలోని మూకాంబికాదేవి పార్వతీదేవి అలంకరణలో దర్శనమిచ్చారు. అలాగే మానసాదేవి, పోలేరమ్మ, కన్యకా పరమేశ్వరి, అంకమ్మ వివిధ అలంకరణల్లో దర్శనమిచ్చారు.

గూడూరు: స్థానిక సాయిసత్సంగ నిలయంలోని విజయదుర్గాదేవి ఉపపీఠంలో విజయదుర్గాదేవిని అన్నపూర్ణాదేవిగా, బజారు కలశం వద్ద అమ్మవారిని చాముండేశ్వరిదేవిగా, నారాయణమ్మ పేరంటాళ్లు ఆలయంలో అమ్మవారిని గాయత్రిదేవిగా, రాజరాజేశ్వరీదేవిని అన్నపూర్ణాదేవిగా, కన్యకాపరమేశ్వరి ఆలయంలో అమ్మవారిని గాయత్రిదేవిగా, ధర్మరాజ స్వామి ఆలయంలో ద్రౌపదీ దేవిని బండాసురవధ అలంకారంలో, గంగమ్మ ఆలయంలో అమ్మవారిని గాయత్రిదేవిగా, మహాలక్ష్మమ్మ ఆలయంలో అమ్మవారిని దుర్గాదేవిగా అలంకరించారు.

చిల్లకూరు: మండలంలోని తూర్పుకనుపూరు గ్రామంలో వెలసిన ముత్యాలమ్మను గాయత్రిదేవిగా అలంకరించి పూజలు నిర్వహించారు. అర్థరథంపై ఉంచి గ్రామోత్సవం జరిపారు. కలవకొండ లక్ష్మీనరసింహస్వామి ఆలయంలోని ఆదిలక్ష్మీదేవిని ధాన్యలక్ష్మీదేగా అలంకరించారు.

వెంకటగిరి టౌన్: పట్టణంలోని వాసవి కన్యకాపరమేశ్వరి రాజరాజేశ్వరి అలంకారం, మూలవిరాట్‌కు అర్ధనారీశ్వరి, కర్ణకమ్మవీధిలోని హరహరక్షేత్రంలో కాత్యాయనీదేవికి అన్నపూర్ణదేవిగా, వెంకటేశ్వర స్వామి వరాహావతారంలో, మందనాంచరేశ్వరికి వైష్ణవిదేవిగా దర్శనమిచ్చారు.

డక్కిలి: దేవుని వెల్లంపల్లిలోని స్తంభాలగిరి ఈశ్వరయ్య స్వామి ఆలయంలో స్వామి, అమ్మవార్లకు పూజలు నిర్వహించారు. పార్వతీదేవిని త్రిపుర సుందరీదేవిగా అలంకరించి భక్తులకు దర్శనం కల్పించారు.

కోట: పట్టణంలోని దుర్గాదేవిని అన్నపూర్ణదేవిగా, వాసవీ కన్యకా పరమేశ్వరిని బాలత్రిపుర సుందరిదేవిగా అలంకరించారు. ఆర్యవైశ్యసంఘం ఆధ్వర్యంలో పూజలు నిర్వహించారు.



గూడూరు: అన్నపూర్ణాదేవి అలంకరణలో విజయదుర్గాదేవి, రాజరాజేశ్వరీదేవి, గాయత్రిదేవిగా గంగమ్మ, దుర్గాదేవిగా మహాలక్ష్మమ్మ - వెంకటగిరి: రాజరాజేశ్వరిగా కన్యకాపరమేశ్వరి, మూలవిరాట్‌కు అర్ధనారీశ్వరి అలంకారం, మందనాంచరేశ్వరిగా వైష్ణవిదేవి

విద్యార్థులు సేవాభావాన్ని పెంపొందించుకోవాలి



కార్యక్రమంలో మాట్లాడుతున్న సునీల్‌కుమార్

గూడూరు, సెప్టెంబరు 24 (ఆంధ్రజ్యోతి): విద్యార్థులు సేవాభావాన్ని పెంపొందించుకుని సమాజంలో ఆదర్శవంతంగా మెలగాలని పూర్వ విద్యార్థి, జీఎస్‌టీ ప్రాక్టీషనర్ కోట సునీల్ కుమార్ అన్నారు. బుధవారం స్థానిక ఎస్‌కేఆర్ ప్రభుత్వ డిగ్రీ కళాశాలలో ఎన్‌ఎస్‌ఎస్ దినోత్సవం నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ విద్యార్థులు నైతిక విలువలను పెంపొందించుకుని జీవనో పాధికి అవసరమైన జ్ఞానాన్ని ఆర్జించాలన్నారు. విద్యార్థుల్లో సామాజిక బాధ్యత, సమాజసేవ, వ్యక్తిత్వ వికాసం, పెంపొందించాలనే లక్ష్యంతో జాతీయ సేవా పథకాన్ని ప్రారంభించడం జరిగిందన్నారు. కళాశాల అభివృద్ధికి తనవంతుగా రూ.50 వేలు అందజేస్తామన్నారు. కార్యక్రమంలో ప్రిన్సిపాల్ డాక్టర్ శివప్రసాద్, డాక్టర్ విజయమహేష్, డాక్టర్ శ్రీనివాసులు, డాక్టర్ పీర్‌కుమార్, నారాయణరాజు, శ్రీధర్‌శర్మ, షైమూన్, శైలజ తదితరులు పాల్గొన్నారు.

నైపుణ్యాలను పెంపొందించడమే హ్యాకథాన్ లక్ష్యం



విద్యార్థులకు ప్రశంసాపత్రాలు అందజేస్తున్న కళాశాల సిబ్బంది

గూడూరు, సెప్టెంబరు 24 (ఆంధ్రజ్యోతి): విద్యార్థుల్లో నూతన ఆవిష్కరణలను, సమస్యల పరిష్కార నైపుణ్యాలను పెంపొందించడమే హ్యాకథాన్ ఉద్దేశమని ప్రొఫెసర్ ప్రణయ్‌కుమార్ అన్నారు. బుధవారం స్థానిక ఆదిశంకర డీమ్డ్ యూనివర్సిటీలో స్మార్ట్ ఇండియా హ్యాకథాన్-2025 నిర్వహించారు. విద్యార్థులు పలు నూతన ఆవిష్కరణలను చేపట్టడంతో పాటు సాఫ్ట్‌వేర్, హార్డ్‌వేర్ సమస్యల పరిష్కారాలను రూపొందించడంలో సృజనాత్మకతను ప్రదర్శించారు. ప్రతిభచాటిన విద్యార్థులకు ప్రశంసాపత్రాలను అందజేశారు. కార్యక్రమంలో డాక్టర్ జేవైఎన్ నాయుడు, డాక్టర్ రాజయ్య, రామయ్య తదితరులు పాల్గొన్నారు.

వేతన సలహా మండలి చైర్మన్‌కు సన్మానం



శ్రీనివాసులురెడ్డిని సన్మానిస్తున్న ఎమ్మెల్యే పాశం సునీల్‌కుమార్

గూడూరు, సెప్టెంబరు 24 (ఆంధ్రజ్యోతి): కనీస వేతనం సలహామండలి చైర్మన్‌గా బుధవారం బాధ్యతలు చేపట్టిన పెళ్లకూరు శ్రీనివాసులురెడ్డిని ఎమ్మెల్యే పాశం సునీల్‌కుమార్ సన్మానించారు. ఈ సందర్భంగా ఎమ్మెల్యే పాశం సునీల్ కుమార్ మాట్లాడుతూ పార్టీలో కష్టపడి పనిచేసే వారికి సీఎం చంద్రబాబు నాయుడు తగిన గుర్తింపు ఇస్తున్నారన్నారు. గతంలో గూడూరు టీడీపీ పరిశీలకుడిగా శ్రీనివాసులురెడ్డి వ్యవహరించి పార్టీ పటిష్టతకు ఎంతో కృషి చేశారన్నారు. అదేవిధంగా విజయవాడలోని రాష్ట్ర లేబర్ కమిషనర్ శేషగిరిబాబును మర్యాదపూర్వకంగా కలిసి పట్టణంలో కార్మికుల సమస్యలను వారి దృష్టికి తీసుకువెళ్లినట్లు తెలిపారు.

ఎనిమిది గంటల పని విధానాన్నే కొనసాగించాలి

గూడూరు, సెప్టెంబరు 24 (ఆంధ్రజ్యోతి): కార్మికవర్గం పోరాడి సాధించుకున్న ఎనిమిది గంటల పని విధానాన్నే కొనసాగించాలని సీఐటీయూ నాయకులు అన్నారు. బుధవారం స్థానిక టవర్‌క్లాక్ సెంటర్ వద్ద సీఐటీయూ ఆధ్వర్యంలో ధర్నా నిర్వహించారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ పెట్టుబడిదారులకు, కార్పొరేట్ సంస్థలకు కొమ్ముకాసేలా 10నుంచి 13 గంటల వరకు పని విధానాన్ని ప్రవేశపెట్టేలా కార్మిక చట్ట సవరణ చేయడం మంచి పద్ధతి కాదన్నారు. కార్యక్రమంలో బీవీ.రమణయ్య, కోటేశ్వరరావు, శంకరయ్య, మురళి, రఫీ, వెంకటరమణ, శ్రీనివాసులు, చంద్రమోహన్, చంద్రయ్య, నారాయణ తదితరులు పాల్గొన్నారు.

మంత్రి సవితకు సన్మానం

తడ, సెప్టెంబరు 24 (ఆంధ్రజ్యోతి): స్కోచ్ అవార్డును దక్కించుకున్న రాష్ట్ర బీసీ సంక్షేమశాఖ మంత్రి సవితను బెస్త సంక్షేమ కార్పొరేషన్ బొమ్మన శ్రీధర్ సత్కరించారు. మంగళవారం విజయవాడలో మంత్రి సవితను కలిసి సన్మానించారు. కార్యక్రమంలో ఏఎంసీ డైరెక్టర్ ఏకాంబరం పాల్గొన్నారు.

మంత్రి లోకేశ్‌ను కలిసిన నెలవల

తడ, సెప్టెంబరు 24 (ఆంధ్రజ్యోతి): మంత్రి నారా లోకేశ్‌ను సూళ్లూరుపేట నియోజకవర్గ టీడీపీ ఇన్‌చార్జి నెలవల సుబ్రహ్మణ్యం బుధవారం సాయంత్రం కలిశారు. తిరుమల పర్యటన నిమిత్తం రేణిగుంట విమానాశ్రయానికి చేరుకున్న మంత్రి లోకేశ్‌కు నెలవల సుబ్రహ్మణ్యం పుష్పగుచ్ఛం అందజేసి స్వాగతం పలికారు.



ఎంపీడీవో బాధ్యతల స్వీకరణ



ఎంపీడీవో సుకుమార్‌ను సన్మానిస్తున్న మండల పరిషత్ సిబ్బంది, పంచాయతీ కార్యదర్శులు

సూళ్లూరుపేట, సెప్టెంబరు 24(ఆంధ్రజ్యోతి): సూళ్లూరుపేట ఎంపీడీవోగా టీ.సుకుమార్ బుధవారం బాధ్యతలు స్వీకరించారు. ప్రకాశం జిల్లా తర్లుపాడు డిప్యూటీ ఎంపీడీవోగా పనిచేస్తున్న ఆయన పదోన్నతిపై ఇక్కడకు వచ్చారు. సుకుమార్‌ను ఇన్‌చార్జి ఎంపీడీవో మురళీకృష్ణ, పంచాయతీ కార్యదర్శులు సన్మానించారు.

రికార్డులు లేని ఆటోల సీజ్

నాయుడుపేట టౌన్, సెప్టెంబరు 24 (ఆంధ్రజ్యోతి): పట్టణ పరిధిలో అర్బన్ సీఐ బాబి స్పెషల్ డ్రైవ్ బుధవారం నిర్వహించారు. రికార్డులు లేని 25 ఆటోలను సీజ్ చేశారు.

భూ సమస్యలను పరిష్కరించండి

బాలాయపల్లి, సెప్టెంబరు 24(ఆంధ్రజ్యోతి): మండలంలోని పల్లిపాడు, కోటంబేడు గ్రామాల్లో నెలకొన్న భూసమస్యలను పరిష్కరించాలని సీపీఎం జిల్లా కార్యదర్శి వందవాసి నాగరాజు అన్నారు. బుధవారం తహసీల్దార్ కార్యాలయం వద్ద ఆయా గ్రామాల దళితులతో కలిసి నిరసన తెలిపారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ పల్లిపాడులోని సర్వే నంబరు 53లో గల 149 ఎకరాలను గత పదిహేనేళ్లుగా దళితులు సాగు చేసుకుంటున్నారని తెలిపారు. అటవీ శాఖ, రెవెన్యూ అధికారులు జాయింట్ సర్వే నిర్వహించి రెవెన్యూ భూమిగా తేల్చినా అటవీశాఖ అధికారులు అడ్డుకోవడం తగదన్నారు. అనంతరం తహసీల్దార్ విజయలక్ష్మికి వినతిపత్రం అందజేశారు. కార్యక్రమంలో నియోజకవర్గ నాయకులు వడ్డిపల్లి చెంగయ్య, గజ్జెల రాజగోపాల్, వెంకటరమణయ్య, సుబ్బమ్మ తదితరులు పాల్గొన్నారు.

అటవీ అధికారులు సాగును అడ్డుకుంటున్నారు

బాలాయపల్లి, సెప్టెంబరు 24 (ఆంధ్రజ్యోతి): అటవీ అధికారులు సాగును అడ్డుకుంటున్నారని మండలంలోని పెరిమిడి గిరిజనులు యానాది సంక్షేమ సంఘం జిల్లా అధ్యక్షుడు చెంచు మల్లికార్జున ఆధ్వర్యంలో బుధవారం తహసీల్దార్ విజయలక్ష్మికి ఫిర్యాదు చేశారు. ఇటీవల రెవెన్యూ, అటవీశాఖ అధికారులు జాయింట్ సర్వే నిర్వహించి రెవెన్యూ భూములుగా గుర్తించారని, అయినా అటవీశాఖ అధికారులు సాగును అడ్డుకోవడం దుర్మార్గమన్నారు.

పౌష్టికాహారం తీసుకోండి

సూళ్లూరుపేట, సెప్టెంబరు 24 (ఆంధ్రజ్యోతి): బాలింతలు, గర్భిణులు పౌష్టికాహారం తీసుకోవాలని సీడీపీవో జ్యోతి కిరణ్ అన్నారు. మండల పరిధిలోని జంగాలగుంట అంగన్వాడీ కేంద్రంలో బాలింతలకు, గర్భిణులు రోజువారీ తీసుకునే ఆహారంపై అవగాహన కల్పించారు. ఉప్పు, చక్కెర. నూనె వాడకం తగ్గించాలని సూచించారు. అంగన్వాడీ సూపర్‌వైజర్ నారాయణమ్మ, జయమ్మ పాల్గొన్నారు.

పాలెంపాడులో తాగునీటి బోర్ల సీజ్

దొరవారిసత్రం, సెప్టెంబరు 24(ఆంధ్రజ్యోతి): దొరవారిసత్రం మండలం పాలెంపాడు గ్రామంలో తాగునీటి బోర్లను బుధవారం ఆర్‌డబ్ల్యూఎస్ అధికారులు సీజ్ చేశారు. ఆ గ్రామంలో కొద్ది రోజులుగా కిడ్నీ బాధితుల సంఖ్య పెరుగుతుండటంతో ఇటీవల అధికారులు చేతిబోర్లు, డైరెక్ట్ పంపింగ్ స్కీమ్ బోర్లలోని నీటి నమూనాలను రాజమండ్రి పరిశోధన కేంద్రానికి పంపారు. ఆ గ్రామంలోని నీళ్లు తాగడానికి ఉపయోగపడేలా లేవని నివేదిక అందడంతో ఆర్‌డబ్ల్యూఎస్ గూడూరు డివిజన్ ఈఈ సత్తార్ హుస్సేన్, సూళ్లూరుపేట డీఈ చంద్రశేఖర్, ఎంపీడీవో గోవర్దన్ బుధవారం గ్రామంలో పర్యటించి బోర్లను సీజ్ చేశారు. బోర్లలను క్లీనింగ్ చేసే వరకు ఎవ్వరూ నీటిని వాడొద్దని గ్రామస్తులకు సూచించారు. నాయుడుపేట నుంచి ట్యాంకర్ల ద్వారా తాగునీటిని సరఫరా చేసేలా ఏర్పాట్లు చేపట్టారు.

పోలేరమ్మ హుండీ ఆదాయం లెక్కింపు

నాయుడుపేట టౌన్, సెప్టెంబరు 24 (ఆంధ్రజ్యోతి): పట్టణంలోని గడియారం సెంటర్ వద్ద వెలసిన గ్రామదేవత పోలేరమ్మ హుండీ నగదును బుధవారం లెక్కించారు. రెండు నెలల 13 రోజులకు రూ.3లక్షల ఆదాయం వచ్చినట్లు ఈవో రవికృష్ణ తెలిపారు. కార్యక్రమంలో ముత్యాలమ్మ ఆలయ ఈవో నవీన్‌కుమార్, ఆలయ కమిటీ చైర్మన్ నానాబాల సుబ్బారావు, నారాయణ, రవి, నిత్యకృష్ణారెడ్డి తదితరులు పాల్గొన్నారు.

ప్రధాని మోదీ మహిళా పక్షపాతి



కార్యక్రమంలో బీజేపీ నేతలు చంద్రప్ప, ఎద్దల నరేంద్రరెడ్డి

పెళ్లకూరు, సెప్టెంబరు 24 (ఆంధ్రజ్యోతి): ప్రధానిమంత్రి మోదీ మహిళా పక్షపాతి అని బీజేపీ నేతలు చంద్రప్ప, ఎద్దల నరేంద్రరెడ్డి అన్నారు. బుధవారం మండలంలోని పాలచ్చూరు సచివాలయంలో నిర్వహించిన స్వస్థ్ నారీ సశక్త్ పరివార్ కార్యక్రమం నిర్వహించారు. పెళ్లకూరు వైద్యుడు జితేంద్ర ఆధ్వర్యంలో మహిళలందరికీ బీపీ, షుగర్, నోటి, రొమ్ము గర్భాశయ ముఖద్వార క్యాన్సర్ నిర్ధారణకు ఉచితంగా వైద్య పరీక్షలు చేపట్టి మందులు పంపిణీ చేస్తున్నారన్నారు. అనంతరం గ్రామంలో మొక్కలు నాటారు. కార్యక్రమంలో బీజేపీ జిల్లా ఉపాధ్యక్షుడు కలిచేటి నరసింహులు, బీజేపీ మాజీ మండల అధ్యక్షుడు గోగుతోటి మురళి, జనసేన నాయకుడు తాళ్ల రెడ్డిశ్రీనివాస్, రమణ, వీరయ్య, భరత్, వెంకట్ తదితరులు పాల్గొన్నారు.

గూడూరును నెల్లూరు జిల్లాలో కలపాలి

కోట, సెప్టెంబరు 24 (ఆంధ్రజ్యోతి): గూడూరు నియోజకవర్గాన్ని నెల్లూరు జిల్లాలో కలపాలని, వాకాడు తాలూకా యూనిట్ ఉద్యోగ, ఉపాధ్యాయ ఐక్యవేదిక నాయకులు బుధవారం తహసీల్దారు జయజయరావుకు వినతిపత్రం అందజేశారు. సుదూరంలో ఉన్న తిరుపతికి వెళ్లడం వ్యయప్రయాసాలకు గురవ్వాల్సి వస్తోందన్నారు.

జీఎస్టీ 2.0 సంస్కరణ.. ఓ పొదుపు పండుగ

● అన్ని వర్గాలకు ఎంతో ప్రయోజనం ● పాత ధరల ప్రకారం అమ్మితే చర్యలు ● ప్రత్యేక బృందాల ద్వారా పరిశీలన : కలెక్టర్

నెల్లూరు (హరనాథపురం), సెప్టెంబరు 24 (ఆంధ్రజ్యోతి) : కేంద్ర ప్రభుత్వం తీసుకొచ్చిన జీఎస్టీ 2.0 సంస్కరణతో పేద, మధ్య తరగతి వర్గాలకు ఎంతో మేలు చేకూరుతుందని, ఇది ఒక పొదుపు పండుగ అని కలెక్టర్ హిమాన్షు శుక్లా అన్నారు. బుధవారం కలెక్టరేట్‌లోని శంకరన్ హాలులో వాణిజ్య పన్నుల శాఖ జాయింట్ కమిషనర్ కిరణ్‌కుమార్‌తో కలిసి ఆయన విలేకరు లతో మాట్లాడా రు. నిత్యావసరాలు, మందులు, వ్యవసాయ పరికరాలు, భవన నిర్మాణ సామాగ్రి, ఆటో మొబైల్ రంగాల్లోని ఉత్పత్తులపై భారీగా జీఎస్టీ తగ్గిందన్నారు. ప్రధానంగా సిమెంటు ధరపై జీఎస్టీ 28 నుంచి 18 శాతానికి తగ్గడంతో భవన నిర్మాణ రంగం బలోపేతమవుతుందని చెప్పారు. నిత్యావసర వస్తువులు పూర్తిగా ప్రజలకు అందుబాటు ధరల్లో లభ్యమవుతాయని వివరించారు. ఈ తగ్గింపు వల్ల చిరువ్యాపారాలు పెరుగుతారని, ఫలితంగా రానున్న కాలంలో అన్ని వర్గాల వారు జీఎస్టీ పరిధిలోకి వస్తారని, ఇప్పటి కన్నా ఎక్కువగా ప్రభుత్వానికి ఆదాయం వస్తుందని వివరించారు. రాష్ట్రంలోని ప్రజలకు జీఎస్టీ రేట్లు తగ్గడం వల్ల రూ.8 వేల కోట్ల మేర లబ్ధి చేకూరుతుందని తెలిపారు. ఇక వ్యాపారులు కూడా కొత్త జీఎస్టీ రేట్ల ప్రకారం వస్తువులు అమ్మాలని, పాత జీఎస్టీ ప్రకారం అమ్మితే చర్యలు తప్పవని హెచ్చరించారు.

● **నెలపాటు కార్యక్రమాలు**

ప్రతి ఇంటికి జీఎస్టీ ఫలాలు చేరేలా నెల రోజులపాటు అవగాహనా కార్యక్రమాలు నిర్వహిస్తున్నట్లు కలెక్టర్ చెప్పారు. ఈ నెల 25 నుంచి 29వ తేదీ వరకు ఇంటింటికీ వెళ్లి జీఎస్టీ ఫలాల పేరుతో తగ్గిన నిత్యావసర వస్తువుల వివరాలను, కలుగుతున్న ప్రయోజనాలను వివరించనున్నట్లు తెలిపారు. 30 నుంచి అక్టోబరు 6వ తేదీ వరకు వ్యవసాయం దాని అనుబంధ రంగాల్లో కలిగే ప్రయోజనాలను వివరిస్తామని, అక్టోబరు 7 నుంచి 13 వరకు మానవవనరుల అభివృద్ధి, డిజిటల్ సాధికారతపై, 14 నుంచి 18వ తేదీ వరకు వికాస్ విశ్వాస్, నమ్మకమైన అభివృద్ధిపై అవగాహన కార్యక్రమాలు ఉంటాయని చెప్పారు.

● **ప్రత్యేక బృందాలతో ఆరా**

జీఎస్టీ అమలు తీరును ప్రత్యేక బృందాల ద్వారా పరిశీలించనున్నట్లు కలెక్టర్ తెలిపారు. వాణిజ్య సముదాయాల్లో నిబంధనలు పాటించకపోతే చర్యలు తీసుకొంటామని చెప్పారు. వాణిజ్య పన్నుల శాఖ జాయింట్ కమిషనర్ కిరణ్‌కుమార్ మాట్లాడుత జీఎస్టీ రిజిస్ట్రేషన్, రీఫండ్ తదితర సేవలు సులభతరమైనట్లు చెప్పారు.

వికసిత్ భారత్‌కు దరఖాస్తుల ఆహ్వానం

నెల్లూరు(విద్య) : స్వామి వివే కానంద జయంతిని పురస్కరించుకుని mybharath.gov.in పోర్టల్ ద్వారా నిర్వహించే వికసిత్ భారత్ క్విజ్‌లో 15 నుంచి 29 ఏళ్ల యువత పాల్గొనాలని సెట్నల్ సీఈవో నాగేశ్వర రావు ఓ ప్రకటనలో పేర్కొన్నారు. యువత ఆలోచనలను వినూత్నంగా ప్రదర్శించేందుకు ఉపయోగపడే ఈ వేదికకు అందరూ దరఖాస్తు చేసుకోవాలన్నారు.